



EDITOR & PUBLISHER: 9391690609, OFFICE: 7893003409.
aksharamtsnews@gmail.com .... www.aksharamtelugudaily.com

www.aksharamtelugudaily.com RNI NO: TELTEL/2018/75419

# సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

SUPHALA AKSHARAM

SUNDAY 28TH JUNE 2026 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 09 ISSUE : 102 COST : 3\- KHAMMAM, TELANGANA

ఆదివారం 28 జూన్ 2026 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 09 సంచిక : 102 వెల : రూ.3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI


## గుట్ట ఇవోగా మరో ఏడాది పాటు భవానీ శంకర్

- పదవీకాలాన్ని పొడిగించిన ప్రభుత్వం

యాదగిరిగుట్ట,జూన్27 యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థాన కార్యనిర్వహణ అధికారి భవానీశంకర్ మరో ఏడాదిపాటు కొనసాగనున్నారు. ఆయన ఇవోగా ఈ నెల 30న పదవీ విరమణ చేయాల్సి ఉంది. అయితే ప్రభుత్వం ఆయన పదవీకాలాన్ని ఏడాది పొడిగించింది. ఇవో పదవీ కాలాన్ని పొడిగిస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 30న ఆయన పదవీ విరమణ పొందుతుండటంతో ఆయన పదవీకాలంలో మరోఏడాది వరకు పొడిగించిన్నట్లు వెల్లడించారు.

# ఆర్టీసీ కార్మికుల హామీలను నెరవేరుస్తున్నాం

- వాస్తవాలను వక్రీకరించే ప్రయత్నం తగదు
- మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టీకరణ

హైదరాబాద్,జూన్27 తెలంగాణ ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. శనివారం ఉదయం మీడియాతో మాట్లాడుతూ... 32 డిమాండ్లలో 29 పరిష్కారానికి చర్యలు పూర్తి అయ్యాయ న్నారు. 11శాతం పీఆర్సీ జులై జీతాల నుంచే అమలు చేయనున్నట్లు తెలిపారు. గుర్తింపు సంఘాల ఎన్నికలను త్వరలో నిర్వహిస్తామన్నారు. విలీన కమిటీలో కార్మిక ప్రతినిధులకు చోటు కల్పిస్తామని చెప్పారు. గుర్తింపు సంఘం ఎన్నికల తర్వాతే విలీన కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. విలీన పక్రియపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళ్తుందన్నారు. కార్మికులను తప్పుదోవ పట్టించే ప్రచారాలను నమ్మొద్దన్నారు. ఎన్నికల నోడల్ అధికారిగా జేఎల్‌సీ సునీత నియామకం జరిగిందన్నారు. ఏపీ తరహా ఇబ్బందులు రాకుండా విలీన విధివిధానాలను రూపొందించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తోందని రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. కొంతమంది కార్మిక సంఘాల నాయకులు వాస్తవాలను వక్రీకరిస్తూ కార్మికులను, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం బాధాకరమని ఆయన అన్నారు. ఆర్టీసీ సమ్మె సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు పొన్నం ప్రభాకర్ , శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో లతో కలిసి చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు తో పాటు సీనియర్ ఐఏఎస్ అధికారులు ,÷నాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్



సుల్తానియా, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్ రాజ్, లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానా కిషోర్ , ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి ,ఇతర ఆర్టీసీ ఉన్నతాధికారులు, ప్రతి కార్మిక సంఘం నుంచి ఇద్దరు చొప్పున దాదాపు 30 మంది కార్మిక సంఘాల ప్రతినిధులతో సుదీర్ఘంగా 14 గంటల పాటు చర్చించి అందరి ఆమోదంతో ఏకగ్రీవ నిర్ణయాలు తీసుకున్నామని మంత్రి గుర్తుచేశారు. సమావేశంలో మొత్తం 32 డిమాండ్లలో 29 అంశాలు ఆర్టీసీ యాజమాన్యం పరిధిలో, మూడు అంశాలు ప్రభుత్వ పరిధిలో ఉన్నట్లు నిర్ణయించడం జరిగిందన్నారు. యాజమాన్యం పరిధిలో ఉన్న 29 అంశాల పరిష్కారానికి ఈడి ల కమిటీ ద్వారా ఇప్పటికే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పరిధిలో ఉన్న మూడు కీలక అంశాలైన ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికలు, 2021 పీఆర్సీ, ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం.పీఆర్సీ విషయంలో ప్రభుత్వం ప్రకటించిన 11 శాతం జూలై నెల జీతాల నుంచే అమల్లోకి రానుందని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల ➢ మిగతా 2వ పేజిలో..



## గోదావరి వరదలపై అప్రమత్తం కండి

- గతానుభవాలతో ముందస్తు నష్టనివారణ చర్యలు
- పుష్కరాల సందర్భంగా గోదావరి తీరం పరిశుభ్రంగా ఉండాలి
- అధికారులతో సమీక్షలో మంత్రి తుమ్మల ఆదేశాలు

భద్రాద్రి కొత్తగూడెం,జూన్27 గోదావరి వరదల వల్ల ప్రజానష్టం, పంట నష్టం లేకుండా సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆదేశించారు. గోదావరి పరివాహక ప్రాంతం భద్రాచలం, పినపాక నియోజకవర్గాల్లో వరదల పట్ల జిల్లా యంత్రాంగాన్ని సన్నద్ధం చేశామని తెలిపారు. కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాల యలో గోదావరి వరదల నేపథ్యంలో ముందస్తు ప్రణాళికపై శనివారం జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.వరదల సమయంలో

➢ మిగతా 2వ పేజిలో..

## రాష్ట్ర రోడ్లకు ఇక మహర్దశ

- హ్యామ్ రోడ్లకు నేడు సిఎం శంకుస్థాపన
- నల్లగొండ జిల్లా కనగల్‌లో నేడు శ్రీకారం



నల్లగొండ,జూన్27 తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రహదారుల రూపురేఖలను మార్చేలా ప్రభుత్వం భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుడుతోంది. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) పద్ధతిలో చేపట్టనున్న ఈ ప్రతిష్టాత్మక రోడ్ల పనులకు 28న నల్గొండ జిల్లా కనగల్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్ర చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఈ మెగా రోడ్డు ప్రాజెక్టు కోసం ప్రభుత్వం సుమారు రూ. 13,006 కోట్ల

➢ మిగతా 2వ పేజిలో..



## నేడు పల్స్ పోలియో కార్యక్రమం

➢ 2వ పేజిలో..

## గంజాయి స్మగ్లింగ్ ముఠా పట్టివేత

- శంషాబాద్‌లో భారీ ఆపరేషన్
- ఎస్కార్ట్ వాహనంతో పాటు మరి కొన్ని వాహనాలతో కాన్వాయ్
- 110 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు

హైదరాబాద్,జూన్ 27 హైదరాబాద్ నగర శివార్లలో అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న ఒక ముఠాను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. శంషాబాద్ డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ , ఆదిబట్ల పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఈ భారీ ఆపరేషన్‌లో సుమారు 110 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు శంషాబాద్ డీసీపీ రాజేష్ మీడియాకు వెల్లడించారు. సీజ్ చేసిన గంజాయి విలువ మార్కెట్లో రూ. 56 లక్షలు ఉంటుందని ఆయన తెలిపారు. ఈ స్మగ్లింగ్ రాకెట్‌కు సంబంధించి నలుగురు అంతర్రాష్ట్ర గంజాయి పెడ్లర్లను అరెస్ట్ చేయడంతో పాటు, రవాణాకు ఉపయోగించిన 2 కార్లు , 4 సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

➢ మిగతా 2వ పేజిలో..

## శంషాబాద్‌ల ప్రాంతంలో చిరుత సంచారం

- స్థానికుల సమాచారంతో అధికారుల వేట

హైదరాబాద్,జూన్27 హైదరాబాద్‌లోని శంషాబాద్ ప్రాంతంలో చిరుత సంచరిస్తోందనే ప్రచారం స్థానికంగా కలకలం రేపుతోంది. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం పరిసరాల్లోని చిన్మయ స్కూల్ సమీపంలో చిరుత కనిపించిందంటూ స్థానికులు సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలో

➢ మిగతా 2వ పేజిలో..

## సీషెల్స్ చేరుకున్న ప్రధాని మోడీ

**ఘనంగా స్వాగతం పలికిన ప్రవాస భారతీయులు**



న్యూఢిల్లీ,జూన్27 భారత ప్రధాని నరేంద్ర మోదీ మూడు రోజుల పర్యటన నిమిత్తం సీషెల్స్ వెళ్లారు. శనివారం సాయంత్రం సీషెల్స్ ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అక్కడ ఆయనకు ఘన స్వాగతం లభించింది. ప్రవాస భారతీయులు.. భారతీయ సంప్రదాయ నృత్యాలతో ఆయనకు స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్టులోని జనం మోదీ, మోదీ అంటూ పెద్ద ఎత్తున

➢ మిగతా 2వ పేజిలో..

## ముంబైలో భారీ ఉగ్రకుట్ర భగ్నం

**విషపు గుళికల పంపిణీని భగ్నం చేసిన పోలీసులు**

ముంబై,జూన్ 27 :ముంబై పోలీసులు తాజాగా భారీ కుట్రను భగ్నం చేశారు. మొహర్రం ఊరేగింపు సందర్భంగా ప్రజలకు ఎలుకల మందు నింపిన విషపు గుళికలు పంపిణీ చేసేందుకు ప్రయత్నించిన ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 14,900 విషపు గుళికలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని ఫయాజ్ ప్రేమ్‌జీగా గుర్తించారు. అతడు పుణెలోని విమాన్ నగర్ ప్రాంతంలో ఉంటున్నాడని చెప్పారు. పెయింట్ షాపు నిర్వహిస్తాడని తెలిపారు. నిందితుడు కొన్ని రోజులుగా ముంబైలోని డోంగ్రి ప్రాంతంలోని ఒక డార్మిటరీలో ఉంటున్నట్టు పోలీసులు గుర్తించారు. జేజే, బైకుల్లా ప్రాంతాల మీదుగా మొహర్రం ఊరేగింపు వెళుతున్న సమయంలో నిందితుడు అక్కడున్న వారికి విషపు గుళికలను పంచే ప్రయత్నం చేసే సమయంలో అతడిని అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 30 వేల గుళికలను రెడీ చేసేందుకు ఫయాజ్ ప్రయత్నించినట్టు పోలీసులు గుర్తించారు. 2019-25 మధ్య కాలంలో అతడు పలుమార్లు ఇరాన్, ఇరాక్‌లను సందర్శించినట్టు కూడా పోలీసుల దర్యాప్తులో బయటపడింది. గతేడాదే అతడు ఏకంగా 19 సార్లు ఇరాన్, ఇరాక్‌లకు వెళ్లివచ్చాడు. ఈ పర్యటనల వెనక అతడి ఉద్దేశం ఏమిటో, దీని వెనుక మరేదైనా పెద్ద నెట్‌వర్క్ ఉండవచ్చనే అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. ఫయాజ్ సోదరి ప్రస్తుతం ఇరాన్‌లో ఫిజియోథెరపిస్టుగా పనిచేస్తోంది. అతడి తల్లి కూడా ఇరాన్‌లోనే ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ఫయాజ్ డైవర్సీ అని కూడా చెప్పారు.

## అభివృద్ధి పనులు వేగంగా చేపట్టాలి

**అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం**

ఖమ్మం,జూన్ 27 పాలేరు నియోజకవర్గ పరిధిలోని కూసుమంచి మండలంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విస్తృతంగా పర్యటించారు. మండలంలోని దుబ్బతండా, లాల్ సింగ్ తండా, జీళ్లచెరువు గ్రామాల్లోని పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ గ్రామాల్లో రూ.16.13 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్లు, వంతెనల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ.. వర్షాకాలంలో తండా వాసులకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోకుండా ఉండేందుకే త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. వానలు పడుతున్నా అభివృద్ధి పనులు కొనసాగుతాయని.. నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, తదితరులు ఉన్నారు.

# ఆర్టీసీ కార్మికుల హామీలను నెరవేరుస్తున్నాం

మొదటి డిమాండ్ ఆర్టీసీ గుర్తింపు సంఘాలు ఎన్నికలు అని ఇప్పుడు మాట మార్చి ప్రజలను,కార్మికులను పక్కదోవ పట్టించడం సరికాదన్నారు. ఆర్టీసీ విలీనానికి సంబంధించి విధివిధానాలు రూపొందించే అధికారుల కమిటీలో కార్మిక ప్రతినిధులు తప్పనిసరిగా ఉండాలని సమావేశంలో కార్మికులు ఏకగ్రీవంగా నిర్ణయించారని మంత్రి పేర్కొన్నారు. అయితే ఆ కమిటీలో ఉండే కార్మిక నాయకులు గుర్తింపు పొందిన సంఘం నుంచి ఉండాలంటే ముందుగా గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించాలనే నిర్ణయం అందరి సమక్షంలో తీసుకున్నామని వెల్లడించారు.

దీనిలో భాగంగానే ప్రభుత్వం ఇప్పటికే గుర్తింపు సంఘాల ఎన్నికల పక్రియను ప్రారంభించిందని, లేబర్ జాయింట్ కమిషనర్ సునీతను ఎన్నికల నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసి త్వరలోనే గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించే దిశగా వెరిఫికేషన్ పక్రియ కొనసాగుతుందని చెప్పారు. కార్మికుల ప్రయోజనాలను కాపాడేందుకే ముందుగా గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించి, ఆ సంఘం నుంచి ప్రతినిధులను విలీన కమిటీలో చేర్చే పక్రియను ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ మాదిరి విలీనం తర్వాత ఇబ్బందులు కలగవద్దని గుర్తింపు కార్మిక సంఘాల నేతలను కమిటీ లో చేర్చి విధివిధానాలు రూపొందించేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ పరిస్థితుల్లో కొంతమంది కార్మిక సంఘాల నాయకులు గుర్తింపు సంఘాల ఎన్నికలు జరగకుండా, విలీన పక్రియను కూడా వివాదాస్పదం చేసేలా వ్యవహరించడం సరికాదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తోందని, కార్మికులు వాస్తవాలను గుర్తించి అసత్య ప్రచారాలను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. మాట మీద నిలబడే కాంగ్రెస్ ప్రభుత్వం విలీన పక్రియ గురించి భవిష్యత్ లో ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని గుర్తింపు సంఘం కార్మిక నేతలను కమిటీ లో చేర్చి విలీన విధివిధానాలు రూపొందించాలని భావిస్తుంది దీనిని సమస్త కార్మిక లోకం గమనించగలరని అన్నారు.

# సీషెల్స్ చేరుకున్న ప్రధాని మోడీ

నినాదాలు చేశారు. సీషెల్స్ ఎయిర్‌పోర్టులో తనకు లభించిన ఘన స్వాగతంపై ప్రధాని మోదీ ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. పోస్టులో.. 'అద్భుతమైన సాంస్కృతిక అనుబంధం. సీషెల్స్ ఎయిర్‌పోర్టులో లభించిన స్వాగతంలో కచ్ డ్యాన్స్ కూడా భాగమైంది. మన ప్రవాస భారతీయులు భారతదేశంలోని వివిధ ప్రాంతాల సంస్కృతులను కాపాడుకుంటున్న తీరు నిజంగా అభినందనీయం' అని పేర్కొన్నారు. ఇక, పర్యటన సందర్భంగా ఇరు దేశాల మధ్య జరిగిన పలు ఒప్పందాలపై ప్రధాని మోదీ సంతకాలు చేశారు. అనంతరం బొటానికల్ గార్డెన్‌కు వెళ్లారు. 194 ఏళ్ల తాబేలును వీక్షించారు. ఆ తర్వాత ప్రవాస భారతీయులతో మోదీ సమావేశం అయ్యారు.

## గంజాయి స్మగ్లింగ్ ముఠా పట్టివేత

ఈ ముఠా ఒడిశా రాష్ట్రం నుండి మహారాష్ట్రకు హైదరాబాద్ మీదుగా గంజాయిని అక్రమంగా తరలిస్తోంది. ఇందుకోసం టాటా హారియర్, మారుతి ఎర్టిగా వంటి లగ్జరీ వాహనాలను వినియోగించారు. పోలీసులకు దొరకకుండా ఉండేందుకు వీరు ఎంతో పకడ్బందీగా ప్లాన్ చేశారు. ఇందులో ఒక వాహనాన్ని 'పైలట్' వాహనంగా ముందు పంపిస్తూ.. మార్గమధ్యంలో ఎక్కడైనా పోలీస్ చెక్‌పోస్టులు, తనిఖీలు ఉన్నాయా అనే సమాచారాన్ని వెనుక గంజాయితో వస్తున్న వాహనానికి అందిస్తూ ఎస్కార్ట్‌గా వ్యవహరించేవారు. టోల్ గేట్లలో పోలీసుల నిఘాకు చిక్కకుండా ఉండేందుకు స్మగ్లర్లు చాకచక్యంగా వాహనాలకు నకిలీ మహారాష్ట్ర నెంబర్ ప్లేట్లను ఉపయోగించారు. అంతేకాకుండా, సాధారణ ఫోన్ కాల్స్ చేస్తే పోలీసులు ట్యాప్ చేస్తారనే భయంతో, ఒకరికొకరు సమాచారం ఇచ్చుకోవడానికి కేవలం ఇంటర్నెట్ కాలింగ్ (యాప్స్) మాత్రమే వాడుతూ నిఘా తప్పించుకునే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ, పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన టాస్క్ ఫోర్స్ పోలీసులు బొంగులూరు ఔటర్ రింగ్ రోడ్ గేట్ సమీపంలో ఈ రెండు వాహనాలను అడ్డుకుని గంజాయిని పట్టుకున్నారు.

స్మగ్లర్లు ఒడిశాలోని బెర్హంపూర్‌కు చెందిన సరఫరాదారు ప్రభిత్ర ప్రధాన్ నుండి కేవలం రూ. 4 వేలకే కిలో గంజాయిని కొనుగోలు చేస్తున్నట్లు విచారణలో తేలింది. ఆ గంజాయిని మహారాష్ట్రకు తరలించి అక్కడ వినియోగదారులకు కిలో రూ. 20 వేల నుండి రూ. 30 వేల వరకు విక్రయిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. కాగా, ఈ ముఠాలో కీలకమైన ప్రధాన సూత్రధారి ప్రణవ్ సింగ్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలింపు చర్యలు చేపట్టామని డీసీపీ తెలిపారు. ఈ వ్యవహారంపై ఆదిబట్ల పోలీసులు కేసు నమోదు చేసి, దీని వెనుక ఇంకా ఎవరెవరు ఉన్నారనే కోణంలో ముమ్మర దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## మరో పేపర్ లీక్ బట్టబయలు

- **మహారాష్ట్రలో 24 గంటలముందే టెట్ పేపర్ లీక్**
- **నేటి టెట్ పరీక్షను రద్దు చేసిన అధికారులు**

ముంబై,జూన్ 27: దేశంలో పరీక్ష పేపర్ల లీకేజీల పర్వం కొనసాగుతూనే ఉంది. తాజాగా మహారాష్ట్రలో 'ఉపాధ్యాయ అర్హత పరీక్ష' టెట్ పేపర్.. పరీక్షకు 24 గంటల ముందే లీక్ కావడం కలకలం రేపింది. ఆదివారం జరగాల్సిన ఈ పరీక్షను పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు మహారాష్ట్ర పరీక్షల మండలి ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. పరీక్షల పక్రియలో పారదర్శకత, నమ్మకత్వాన్ని కాపాడేందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు మండలి స్పష్టం చేసింది.విశ్వసనీయ సమాచారం ప్రకారం.. థానే రీజియన్ పరిధిలో టెట్ క్వశ్చన్ పేపర్ లీక్ అయినట్లు శనివారం తెల్లవారుజామున పోలీసులకు ముందస్తు సమాచారం అందింది. దీనిపై వెంటనే స్పందించిన భివండీ పోలీసులు ఒక రహస్య స్థావరంపై దాడి చేశారు. అక్కడ కొందరు వ్యక్తులు సీల్డ్ టెట్ క్వశ్చన్ పేపర్ ప్యాకెట్‌కు సంబంధించిన పేజీలను కలిగి ఉండడాన్ని గుర్తించారు. వెంటనే పరీక్షల మండలి అధికారులను పిలిపించి ఆ పేజీలను అసలు ప్రశ్నపత్రంతో సరిపోల్చి చూశారు. అవి లీక్ అయిన ఒరిజినల్ పేపరేనని తేలడంతో భివండీ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంలో పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,028 కేంద్రాలలో రేపు (ఆదివారం) జరగాల్సిన ఈ పరీక్ష కోసం సుమారు 4.28 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్ష కోసం అన్ని ఏర్పాట్లు చేసుకుని, కేంద్రాలకు బయలుదేరే సమయానికి పేపర్ లీక్ కారణంగా పరీక్ష వాయిదా పడడంతో లక్షలాది మంది అభ్యర్థులు తీవ్ర నిరాశకు, ఆందోళనకు గురవుతున్నారు.

# రాష్ట్ర రోడ్లకు ఇక మహర్దశ

భారీ బడ్జెట్‌ను కేటాయించింది. దీని ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రధాన ప్రాంతాలను అనుసంధానిస్తూ వేగవంతమైన, సురక్షితమైన , అత్యాధునిక రవాణా సౌకర్యాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మెగా ప్రాజెక్టులో భాగంగా మొదటి విడత కింద రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 6,092 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న 441 రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య రవాణా వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు, వాణిజ్య పరంగా కీలకమైన మార్గాలను బలోపేతం చేసేందుకు ఈ నిధులను ఖర్చు చేయనున్నారు. హ్యామ్ విధానం లో చేపట్టడం వల్ల పనులు అత్యంత నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తవుతాయని అధికారులు భావిస్తున్నారు. ప్రయాణ సమయాన్ని తగ్గించడంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ ఈ రహదారుల రూపకల్పన జరిగింది. కనగల్‌లో జరిగే ఈ శంకుస్థాపన కార్యక్రమానికి మంత్రులు, ఉన్నతాధికారులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరు కానున్నారు. ఈ పనులు పూర్తయితే తెలంగాణలో మౌలిక వసతుల రంగం సరికొత్త మైలురాయిని అధిగమిస్తుందని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది.

# గోదావరి వరదలపై అప్రమత్తం కండి

ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. గోదావరి వరదల సన్నద్ధతపై ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశంలోపలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాను పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు.గత వరదల అనుభవాలను పరిగణలోకి తీసుకుని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలని దిశానిర్దేశర చేశారు. వరదల వల్ల రహదారులు బ్లాక్ అయ్యే గ్రామాలను గుర్తించాలని సూచించారు. అత్యవసర వైద్యసేవలు, నిత్యావసర వస్తువుల రవాణాకు అడ్డంకులు లేకుండా యాక్షన్ ఎ÷-లాన్ ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. తాగునీరు, వైద్యం వంటి అత్యవసర సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ సమీక్షకు ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, ఐటీడీఏపీఓ రాహుల్, మేయర్ మూడ్ గణెళిశ్, ప్రభుత్వ శాఖల అధికారులు హాజరయ్యారు.

# నేడు పల్స్ పోలియో కార్యక్రమం

### చిన్నారులకు పోలియో చుక్కలకు ఏర్పాట్లు

హైదరాబాద్,జూన్ 27 తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 28వ తేదీ ఆదివారం పల్స్ పోలియో నిర్వహించనున్నారు.అయిదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పల్స్‌పోలియో చుక్కలు వేయించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 28వ తేదీ నుంచి నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్రంలోని నవజాత శిశువులు మొదలుకుని 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు అందేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. జూన్ 28న రాష్ట్రవ్యాప్తంగా పోలియో బూత్‌లలో డ్రాప్స్ వేస్తారు. ఈ నెల 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి మిగతా చిన్నారులకూ పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లో పట్టణ ప్రాంతాలు అధికంగా ఉండటంతో జులై 1న అదనంగా మరో రోజు కార్యక్రమం కొనసాగుతుంది. ఇకపోతే కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఇప్పటికే ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రంలోని 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు అందేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, ఒక్కరు కూడా మిగిలిపోకుండా బూత్‌లు, మొబైల్ బృందాలు, ఇంటింటి సర్వేల ద్వారా పోలియో డ్రాప్స్ అందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వలస కార్మికుల పిల్లలు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాల్లోని బస్తీలు, కొత్త కాలనీలు, , గిరిజన ప్రాంతాల్లోని చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మహిళా శిశు సంక్షేమం, మున్సిపల్, పంచాయతీరాజ్, విద్యాశాఖ, ఆర్టీసీ తదితర శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. తెలంగాణలో చివరి పోలియో కేసు 2007లో నమోదైందని, పోలియో రహిత హోదాను ఉమ్మడి రాష్ట్రంలోనే సాధించామని ఈ సందర్భంగా అధికారులు గుర్తు చేశారు.

# శంషాబాద్‌ల ప్రాంతంలో చిరుత సంచారం

అధికారులు అప్రమత్తమయ్యారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. చిరుత ఆనవాళ్లు, పాదముద్రలు లేదా ఇతర ఆధారాలు ఉన్నాయా అనే దానిపై అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. అవసరమైతే ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసి పరిస్థితిని పర్యవేక్షిస్తామని అధికారులు తెలిపారు. చిరుత కనిపించిందనే వార్తతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా స్కూల్ పరిసర ప్రాంతాలు, నివాస కాలనీల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అయితే ఇప్పటివరకు చిరుత సంచారంపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ కాలేదు. అటవీశాఖ అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి, చిరుత ఆనవాళ్లు లభించిన తర్వాతే స్పష్టమైన సమాచారం అందజేస్తామని తెలిపారు. ప్రజలు వదంతులను నమ్మకుండా, ఏదైనా అనుమానాస్పద జంతువు కనిపిస్తే వెంటనే అటవీశాఖ లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

# పౌరసత్వానికి, పాస్‌పోర్టుకు తేడా తెలియదా?

హైదరాబాద్,జూన్ 27 ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ భారత పాస్‌పోర్టులు, పౌరసత్వంపై ఇటీవల చేసిన వ్యాఖ్యలు చట్టపరంగా తప్పుదారి పట్టించేవిగా ఉన్నాయని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఒక ప్రజాప్రతినిధిగా, న్యాయవాదిగా ఉన్న అసదుద్దీన్‌కు పాస్‌పోర్టుకు, పౌరసత్వానికి మధ్య ఉన్న చట్టపరమైన తేడాలు తెలిసి ఉండాలని ఆయన హితవు పలికారు. రాజ్యాంగ బద్ధమైన పదవుల్లో ఉన్నవారు బాధ్యతాయుతంగా మాట్లాడాలని పేర్కొన్న కిషన్ రెడ్డి.. ప్రజలను తప్పుదారి పట్టించే ముందు అసదుద్దీన్ ఒవైసీ పౌరసత్వ చట్టం1955, పాస్‌పోర్ట్ చట్టం1967లను మరోసారి క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సూచించారు. అసదుద్దీన్ వ్యాఖ్యలు చట్టంపై ఆయనకున్న అవగాహన లోపాన్ని, రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల్లో అయోమయం సృష్టించే ప్రయత్నాన్ని సూచిస్తున్నాయని మండిపడ్డారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇచ్చిన వివరణను కొందరు తప్పుగా చిత్రీకరిస్తున్నారని కిషన్ రెడ్డి

స్పష్టం చేశారు. విదేశాంగ శాఖ వివరణ ప్రకారం భారత పాస్‌పోర్టు విలువలేనిదని అర్థం కాదని, పాస్‌పోర్టు ఒక్కటే భారత పౌరసత్వానికి తుది, ఖచ్చితమైన ఆధారం కాదని మాత్రమే ప్రభుత్వం పేర్కొందని ఆయన వివరించారు. భారత పౌరసత్వం అనేది ఎల్లప్పుడూ భారత రాజ్యాంగం , పౌరసత్వ చట్టం1955 ప్రకారమే నిర్ణయించబడుతుందని స్పష్టం చేశారు. పాస్‌పోర్ట్ చట్టం1967 ప్రకారం పాస్‌పోర్టు అనేది ప్రధానంగా విదేశీ ప్రయాణాల కోసం ఉపయోగించే ఒక పత్రం (÷ుసజీలı ఆనీఇ-బీపıనిబి) మాత్రమేనని కేంద్ర మంత్రి తెలిపారు. ఆ చట్టంలోని సెక్షన్ 20 ప్రకారం.. ప్రజాహితం దృష్ట్యా భారత పౌరుడు కాని వ్యక్తికి కూడా కేంద్ర ప్రభుత్వం పాస్‌పోర్టు లేదా ట్రావెల్ డాక్యుమెంట్‌ను జారీ చేసే ప్రత్యేక అధికారాన్ని కలిగి ఉంటుందని గుర్తుచేశారు. గతంలో కూడా ఇటువంటి ప్రత్యేక సందర్భాలు ఉన్నాయని, అందువల్ల పాస్‌పోర్టును మాత్రమే పౌరసత్వానికి తుది ప్రాతిపదికగా పరిగణించలేమని చెప్పారు. ఇది ఇప్పటికప్పుడు తెచ్చిన కొత్త నిబంధన కాదని, 1967లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఈ చట్టం అమల్లోకి వచ్చిందని తెలిపారు. దాదాపు 60 ఏళ్లుగా అమల్లో ఉన్న చట్టపరమైన అంశాన్ని ఇప్పుడు మోదీ ప్రభుత్వంపై నెట్టడం అవగాహన లోపమో, లేదా వాస్తవాలను దాచిపెట్టే కుట్రో అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పౌరసత్వ చట్టం1955 ప్రకారం ఒక వ్యక్తికి భారత పౌరసత్వం అనేది జననం, వంశపారంపర్యం, నమోదు లేదా నేచురలైజేషన్ పక్రియల ద్వారా మాత్రమే లభిస్తుందని కిషన్ రెడ్డి వివరించారు. గతంలో 2013లో బొంబాయి హైకోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తావిస్తూ.. పాస్‌పోర్టు, జనన ధృవీకరణ పత్రం వంటి పత్రాలు మాత్రమే పౌరసత్వాన్ని నిరూపించడానికి పూర్తిగా సరిపోవని న్యాయస్థానం స్పష్టం చేసిందని, దేశంలోని ఇతర హైకోర్టులు కూడా ఇదే సూత్రాన్ని అనుసరించాయని గుర్తుచేశారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ఎలాంటి కొత్త విధానాన్ని లేదా నిబంధనను ప్రకటించలేదని, దేశ చట్టాలు, న్యాయస్థానాలు ఇప్పటికే స్పష్టం చేసిన పాత అంశాన్నే మరోసారి పునరుద్ఘాటించిందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

# 14 నైబర్‌హుడ్ సెంటర్లకు ఉచిత రవాణా




హైదరాబాద్,జూన్27 :దివ్యాంగుల కోసం రాష్ట్రంలోని 14 నైబర్‌హుడ్ సెంటర్లకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించే లక్ష్యంతో ఈ-ఆటోల పంపిణీని తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. హెలెన్ కెల్లర్ జయంతి సందర్భంగా దివ్యాంగుల రవాణా సదుపాయాలను మెరుగుపరిచే లక్ష్యంతో ఈ-ఆటోలను పంపిణీ చేయడం శుభపరిణామమని మంత్రి సీతక్క అన్నారు. దివ్యాంగులు జీవితాన్ని సవాల్‌గా స్వీకరిస్తే అసాధారణ విజయాలను సాధించగలరని ఆమె పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, వారి అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. 'వైకల్యం అనేది కేవలం శారీరక లోపమే. మానవత్వంలేని వారే అసలైన దివ్యాంగులు. ఇతరులను అవమానించే అహంకారం కూడా ఒక రకమైన వైకల్యమే. పుట్టుకతో వచ్చిన లోపాలను తల్లిదండ్రుల ప్రోత్సాహం, సరైన శిక్షణ, సమాజం సహకారంతో అధిగమించవచ్చు. చూపు, వినికిడి లేకపోయినా హెలెన్ కెల్లర్ ప్రపంచానికి స్ఫూర్తిగా నిలిచారు' అని అన్నారు.'దివ్యాంగులను చీదరించకుండా వారికి అవకాశాలు కల్పిస్తే అన్ని రంగాల్లో అద్భుతంగా రాణిస్తారు. బ్రెయిలీ వంటి సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అనేక మంది దివ్యాంగులు తమ లక్ష్యాలను చేరుకుంటున్నారు. తల్లిదండ్రులపై ఉన్న ఆర్థిక, రవాణా భారాన్ని తగ్గించడానికే ఈ-ఆటోల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాం' అని సీతక్క చెప్పారు. ఈ సందర్భంగా ఐఓసీఎల్‌కు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## తక్కువ ధరకు బంగారం అంటూ బురిడీ

### పారిపోతుండగా సూర్యాభాయ్ అరెస్ట్

హైదరాబాద్,జూన్ 27 గోల్డ్ మ్యాన్ సూర్యభాయ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్ నుంచి షాద్‌నగర్ పారిపోతుండగా పోలీసులు పట్టుకున్నారు. తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తానంటూ అమాయకులను సూర్య భాయ్ బురిడీ కొట్టించాడు. తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగితే.. ఏకంగా బాధితులపై కేసు పెట్టాడు. చివరకు అసలు రంగు బయటపడటంతో పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా గోల్డ్ మ్యాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. తక్కువ ధరకే విదేశీ బంగారం ఇస్తానంటూ అమాయకుల నుంచి సూర్య భాయ్ లక్షలాది రూపాయలను వసూలు చేసి భారీ మోసానికి తెరతీశాడు. గోల్డ్ మ్యాన్ మాటలు నమ్మి హిమాయత్‌నగర్, నీలోఫర్‌కు చెందిన బాధితులు దాదాపు రూ.30 లక్షలు ఇచ్చారు. అయితే బంగారం ఇవ్వకపోవడంతో సూర్య ఇంటికి వెళ్లిన బాధితులు.. తమ డబ్బులు తమకు తిరిగి ఇచ్చేయాలని కోరారు. దీంతో తన వద్ద ఉన్న మూడు ఐఫోన్లను ఇచ్చి వాటి విలువ రూ.10 లక్షలు అని, అలాగే రూ.20 లక్షల చెక్ ఇచ్చి బాధితులను పంపించేశాడు. అనంతరం బాధతులపైనే సూర్య భాయ్ తిరిగి పోలీసులకు ఫిర్యాదు చేశాను. తనను బెదిరించి ఫోన్ లాక్కెల్లారంటూ సూర్య భాయ్ పోలీసులను తెలిపారు. ఈ విషయంలో లోతుగా దర్యాప్తు చేసిన పోలీసులు అసలు నిజామన్ని బయటపెట్టారు. తక్కువ ధరకే బంగారం పేరుతో సూర్య భాయ్ మోసం చేశారంటూ అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం ఈ కేసును నారాయణగూడకు బదిలీ చేశారు. అయితే అరెస్ట్ భయంతో సూర్య భాయ్ హైదరాబాద్ నుంచి పారిపోయేందుకు ప్రయత్నించగా షాద్‌నగర్‌లో పోలీసులు పట్టుకున్నారు.

## మేడిపల్లి రైతులకు సాగునీరు అందించాలి సింగరేణి ఎస్ ఓ టు జీఎంకు వినతిపత్రం



జ్యోతి నగర్ ఎన్టిపిసి జూన 27 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్ మేడిపల్లి గ్రామ రైతుల పంట పొలాలకు సాగునీరు అందించాలని కోరుతూ కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్ శనివారం సింగరేణి ఎస్ ఓ టు జీఎం చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు.

మేడిపల్లి గ్రామంలో గతంలో సింగరేణి ఏర్పాటు చేసిన నీటి పైప్‌లైన్ తుప్పు పట్టి దెబ్బతినడంతో రైతులకు సాగునీటి సరఫరా నిలిచిపోయిందని, దీంతో వరుసగా రెండు పంటలు నష్టపోయారని ఆయన తెలిపారు. పైప్‌లైన్‌ను తక్షణమే పునరుద్ధరించి రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు.

ఈ సందర్భంగా జీఎం చంద్రశేఖర్ సమస్యను సానుకూలంగా స్వీకరించి, త్వరలోనే కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు మడిపెల్లి విజయ మల్లేష్ తెలిపారు. రైతుల సమస్య పరిష్కారానికి సహకరిస్తామని హామీ ఇచ్చినందుకు మేడిపల్లి గ్రామ ప్రజల తరఫున ఆయన జీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

## గోండుగూడ పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

- **అమ్మ ఆదర్శం యూత్ సేవా కార్యక్రమం.**



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ జూన్ 27/అక్షరం న్యూస్ -:

మంచిర్యాల జిల్లా కాసిపేట్ మండలంలోని గోండుగూడా ఎంపీపీఎస్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అమ్మ ఆదర్శం యూత్ ఆధ్వర్యంలో విద్యా సామగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, కంపాస్ బాక్సులు, పెన్సిల్లు, పలకలు, బలపాలు అందజేశారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, “నువ్వు గౌరవించే స్థాయి నుండి నిన్ను గౌరవించే స్థాయికి తీసుకెళ్లే శక్తి ఒక్క చదువుకే ఉంది” అని పేర్కొన్నారు. విద్యార్థులు విద్యపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.కార్యక్రమంలో అమ్మ ఆదర్శం యూత్ వ్యవస్థాపకుడు బండారి రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు మంతెన సుమన్, సభ్యులు అందె శ్రీకాంత్, ఆత్రం సంజీవ్ పాల్గొన్నారు. అలాగే ఉపాధ్యాయురాలు శ్రీలత సహా పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించిన అమ్మ ఆదర్శం యూత్ సభ్యులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. విద్యాభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు మరింత ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

## కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ




ములుగు/నూగూరు వెంకటాపురం/జూన్ 27/ అక్షరం న్యూస్:-

కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలు ఆడ బిడ్డల పెళ్లిళ్లకు వరాలని భద్రాచలం శాసన స భ్యులు తెల్లం వెంకటరావు అన్నారు.శనివారం కళ్యాణ లక్ష్మి చెక్కులను మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ వేణు గోపాల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పేద మధ్యతరగతి కుటుంబాల్లోని ఆడపిల్లల వివాహాలకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలు భరోసానిస్తున్నా యని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం లబ్ధిదారులకు అండగా నిలుస్తూ చెక్కుల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేస్తుందని అన్నారు.ఈ కార్యక్ర మంలో ఉప తహశీల్దార్ మహేందర్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ హుస్సేన్ సర్పంచ్ తాటి సరస్వతి బి బ్లాక్ అధ్యక్షులు చిడెం సాంబ శివరావు ములుగు జిల్లా జనరల్ సెక్రటరీ మన్యం సునీల్ జిల్లా కార్యదర్శి ధనపనేని వెంకటేశ్వర్లు యువజన నాయకులు బాలసాని వేణు గోపాల్ మండల యువజన అధ్యక్షులు చిట్టెం సాయి కార్యకర్తలు లబ్ధిదారులు పాల్గొన్నారు.



# ప్రత్యేక ఓటరు జాబితా సవరణ పారదర్శకంగా నిర్వహించాలి

- **అర్హులైన ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించాలి: ఆర్డీవో ఎన్. వెంకటేష్**



హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి/జూన్ 27/అక్షరం న్యూస్:-

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించి, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా ఆర్డీవో ఎన్. వెంకటేష్ అధికారులను ఆదేశించారు.

శనివారం భీమదేవరపల్లి మండలంలోని కొత్తపల్లి గ్రామంలో బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికి వెళ్లి ప్రత్యేక ఓటరు జాబితా సవరణకు సంబంధించిన దరఖాస్తు ఫారాలను పంపిణీ చేస్తూ, ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న తీరును ఆర్డీవో ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్భంగా బీఎల్‌వోలు ప్రజలకు ఫారాల వినియోగం దరఖాస్తులు పూరించే విధానం అవసరమైన ధ్రువపత్రాలు ఓటరు జాబితాలో పేరు నమోదు మార్పులు తొలగింపులు వంటి అంశాలపై అందిస్తున్న వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఆర్డీవో మాట్లాడుతూ ఓటు హక్కు ప్రతి పౌరునికి రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన ప్రజాస్వామ్య హక్కు అని పేర్కొన్నారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితాలో చేరకుండా మిగిలిపోకుండా బీఎల్‌వోలు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. అదే సమయంలో అనర్హుల పేర్లు జాబితాలో లేకుండా నిబంధనల మేరకు క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు.

ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించడంతో పాటు ఫారాలు నింపడంలో అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ప్రజలు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివరాలను పరిశీలించి. అవసరమైతే మార్పులు చేర్పులు తొలగింపులకు సంబంధించిన దరఖాస్తులను సకాలంలో సమర్పించాలని కోరారు.ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను ఎలాంటి ఫిర్యాదులకు తావులేకుండా పారదర్శకంగా నిష్పాక్షికంగా నిర్వహించాలని ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ప్రతి అధికారి, సిబ్బంది కచ్చితంగా పాటించాలని ఆర్డీవో స్పష్టం చేశారు. ప్రజల సహకారంతో సక్రమమైన, విశ్వసనీయమైన ఓటరు జాబితా రూపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ రాజేష్, బీఎల్‌వో సూపర్వైజర్ శ్రీధర్, రాజు, తిరుపతి,జ్యోషణ, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

## ఎన్టీపీసీ స్టేజ్ 1,2,3 ఆపరేషన్ విభాగ కాంట్రాక్ట్ కార్మికుల 3 నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి





- **హక్కుల సాధనకై రామగుండం ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ లో చేరిన 35 మంది ఎన్టీపీసీ ఆపరేషన్ కాంట్రాక్ట్ కార్మికులు**

జ్యోతి నగర్ ఎన్టిపిసి జూన్ 27 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

ఎన్టీపీసీ రామగుండం స్టేజ్ 1, 2, 3 పరిధిలోని ఆపరేషన్ విభాగంలో 35 మంది ఆపరేటర్లుగా పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు రావలసిన 3 నెలల వేతనాలను సంబంధిత కాంట్రాక్టర్ నుండి వెంటనే చెల్లించే విధంగా యజమాన్యం తగు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ శనివారం సంబంధిత ఇంజనీరింగ్ ఇన్‌ఛార్జ్ ఏజీఎం, జిఎం ఓ అండ్ ఎం, ఏజీఎం హెచ్ఆర్ మరియు సంబంధిత కాంట్రాక్టర్ కు రామగుండం ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి గీట్ల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ‘వీ/రా చైతన్య భారతి ఎస్సీ కో-ఆపరేటివ్’ ఏజెన్సీ కింద ఆపరేటర్లుగా పనిచేస్తున్న సుమారు 35 మంది కాంట్రాక్ట్ కార్మికులకు సంబంధిత కాంట్రాక్టర్ గత మూడు నెలలుగా (ఏప్రిల్, మే, జూన్ 2026) జీతాలు చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేయడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. కాంట్రాక్ట్ నిబంధనల ప్రకారం ప్రతి నెల 1వ తేదీ లోపు కార్మికులందరికీ వేతనాలు చెల్లించాల్సి ఉండగా, సదరు కాంట్రాక్టర్ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘిస్తూ నిరంతరం ఆలస్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేతనాలు అందక కార్మికులు తమ దైనందిన కుటుంబ అవసరాలకు, అత్యవసర వైద్య ఖర్చులకు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అంతేకాకుండా, కార్మికుల జీతాల నుండి పీఎఫ్ వాటా కట్ చేస్తున్నప్పటికీ, గత 7 నెలలుగా (డిసెంబర్-2025 నుండి) వారి సంబంధిత పీఎఫ్ ఖాతాలలో కాంట్రాక్టర్ జమ చేయడం లేదని, ఇది పూర్తిగా చట్టవిరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. కార్మికులకు సరిగ్గా జీతాలు ఇవ్వకుండా, వారి హక్కులను కాలరాస్తూ ఇబ్బందులకు గురి చేసే ఇలాంటి దోపిడీ విధానాన్ని ఏజెన్సీ తక్షణమే మానుకోవాలని ఆయన హెచ్చరించారు. ఈ సమస్యలపై ప్రధాన యాజమాన్యం తక్షణమే స్పందించి, పెండింగ్‌లో ఉన్న 3 నెలల వేతనాలను ఇప్పించాలని, అలాగే నిలిచిపోయిన పీఎఫ్ డబ్బులను వెంటనే ఖాతాల్లో జమ చేయించేలా కాంట్రాక్టర్‌ను ఆదేశించాలని డిమాండ్ చేశారు.యూనియన్‌లోకి కార్మికుల చేరిక - ఘన స్వాగతం:

# రైతులకు కూరగాయల విత్తనాల పంపిణీ చేసిన ఎన్టీపీసీ






జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూన్ 27 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: సామాజిక అభివృద్ధి, రైతుల జీవనోపాధి మెరుగుదలకు కట్టుబడి ఉన్న ఎన్టీపీసీ రామగుండం తన కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగంగా లైఫ్ స్కిల్ అకాడమీ--బ్లాక్-2లో రైతులకు కూరగాయల విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించింది.

ఈ కార్యక్రమానికి ఎన్టీపీసీ రామగుండం & తెలంగాణ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆర్ అండ్ టీ) చందన్ కుమార్ సామంత ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులైన రైతులకు కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు సాధించడంతో పాటు ఆదాయాన్ని పెంచుకోవాలని ఆయన సూచించారు.

ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ప్రభావిత ప్రాంతాలు, పరిసర గ్రామాలు, కార్పొరేషన్ డివిజన్లకు చెందిన 20 గ్రామాల నుంచి సుమారు 200 మంది రైతులకు రూ.10.30 లక్షల విలువైన కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు.

సభను ఉద్దేశించి చందన్ కుమార్ సామంత మాట్లాడుతూ, సుస్థిర వ్యవసాయం నేటి అవసరమని, రైతుల అభ్యున్నతికి ఎన్టీపీసీ సీఎస్ఆర్ కార్యక్రమాల ద్వారా నిరంతరం అండగా నిలుస్తుందని తెలిపారు. రైతులు ఈ సహకారానికి ఎన్టీపీసీకి కృతజ్ఞతలు తెలుపుతూ, అందించిన విత్తనాలతో కూరగాయల సాగు చేపట్టి తమ కుటుంబాలకు అదనపు ఆదాయం సమకూర్చుకుంటామని పేర్కొన్నారు.



ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కిచెన్ గార్డెనింగ్, కూరగాయల సాగు ప్రోత్సాహం పొందడంతో పాటు కుటుంబాల పోషకాహార భద్రత పెరగడం, రైతులకు అదనపు ఆదాయ వనరులు ఏర్పడే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈజీఎంహెచ్ఆర్ సాగర్ రంజాన్ సాహూ తదితరులు పాల్గొన్నారు.

## మందమర్రిలో నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

- **ముగ్గురు నిందితుల అరెస్ట్.**



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ జూన్ 27/ అక్షరం న్యూస్ -:
రైతులను మోసం చేస్తూ లాభాలు గడించడమే ధ్యేయంగా నకిలీ పత్తి విత్తనాలను విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను మందమర్రి పోలీసులు మరియు వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా జరిపిన తనిఖీల్లో పట్టుకున్నారు. నిందితుల నుండి సుమారు 100 కిలోల నకిలీ పత్తి విత్తనాలతో పాటు, రవాణాకు ఉపయోగించిన రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.
మందమర్రి ఎస్ఐ గోపతి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం
మందమర్రి మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి, సిబ్బంది, మందమర్రి పోలీసులు కలిసి శనివారం ఉదయం 08:30 గంటల ప్రాంతంలో ఎన్ హెచ్ -363, అందుగులపేట్ శ్రీ కన్వెన్షన్ హాల్ సమీపంలో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో అనుమానాస్పదంగా రెండు బైక్‌లపై వెళ్తున్న ముగ్గురు వ్యక్తులను ఆపి విచారించగా నకిలీ విత్తనాల గుట్టు రట్టయిందన్నారు. ముగ్గురు నిందితులను
మాకినేని రాఘవేంద్ర, కట్ట నరేష్,పుట్టగంటి పవన్ కుమార్ లను అరెస్టు చేసి రిమాండ్ చేసినట్లు తెలిపారు. ఎటువంటి సర్టిఫైడ్ లేబుల్స్, బిల్లులు లేని 100 కిలోల లూజ్ పత్తి విత్తనాలు, అపాచీ బైక్ మరియు టీవీఎస్ బైక్ లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. అమాయక రైతులను నకిలీ విత్తనాలతో ముంచే ఇలాంటి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు మరియు వ్యవసాయ శాఖ అధికారులు హెచ్చరించారు.?రైతులకు నష్టం చేకూరుస్తూ, అక్రమంగా నకిలీ విత్తనాలను రవాణా చేస్తున్న ముఠాను చాకచక్యంగా పట్టుకున్న మందమర్రి ఎస్ఐ గోపతి నరేష్ మరియు పోలీస్ కానిస్టేబుళ్లు శ్రీనివాస్, రాకేష్ , చైతన్య, మహేందర్, సంతోష్ లను ఉన్నతాధికారులు హృదయపూర్వకంగా అభినందించారు.

## రైతు భరోసా పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

- **జూలై 5 వరకు అవకాశం: మండల వ్యవసాయ అధికారి పద్మ.**



హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/జూన్ 27/అక్షరం న్యూస్;-
రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం పొందేందుకు అర్హులైన రైతులు జూలై 5లోపు దరఖాస్తులు సమర్పించాలని మండల వ్యవసాయ అధికారి పద్మ సూచించారు.ఈ నెల 15-06-2026 నాటికి సీసీఎల్ఏ ఆధ్వర్యంలోని భూభారతి (ధరణి) పోర్టల్‌లో భూములు నమోదైన రైతులు తమ బ్యాంకు ఖాతా వివరాలను సంబంధిత వ్యవసాయ విస్తరణాధికారులకు (ఏఈఓ) అందజేయాలని తెలిపారు. ప్రభుత్వం రైతు భరోసా పథకం ద్వారా ఎకరానికి సంవత్సరానికి రూ.12,000 పెట్టుబడి సాయాన్ని అందిస్తున్నట్లు పేర్కొన్నారు.కొత్తగా పట్టాదారు పాస్‌బుక్కులు పొందిన రైతులు, గత సీజన్‌లో సాంకేతిక కారణాల వల్ల సాయం అందని రైతులు, బ్యాంకు ఖాతా వివరాలు లేదా మొబైల్ నంబర్లు తప్పుగా నమోదైన వారు అలాగే ఒకే మొబైల్ నంబర్‌కు ఒకటి కంటే ఎక్కువ ఆధార్ నంబర్లు అనుసంధానమైన రైతులు వెంటనే సంబంధిత ఏఈఓ లేదా ఎంఏఓ కార్యాలయంలో వివరాలు సవరించుకోవాలని సూచించారు.దరఖాస్తుతో పాటు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ జిరాక్స్ ప్రతులను జత చేసి రైతు భరోసా దరఖాస్తు ఫారాన్ని సమర్పించాలని తెలిపారు. అర్హులైన రైతులు చివరి తేదీ వరకు వేచి చూడకుండా తమ పరిధిలోని ఏఈఓ లేదా ఎంఏఓ కార్యాలయంలో వెంటనే దరఖాస్తులు అందజేయాలని కోరారు.అదేవిధంగా ప్రతి రైతు తప్పనిసరిగా రైతు రిజిస్ట్రీలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పద్మ సూచించారు.

## చెన్నూరు నియోజకవర్గ అభివృద్ధి పై బహిరంగ చర్చకు సిద్ధమా?

- **టీబీజీకేఎస్ బి నాయకుల సవాల్**



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ జూన్ 27/ అక్షరం న్యూస్-:
చెన్నూరు నియోజకవర్గంలో గత ఐదు సంవత్సరాల కాలంలో బాల్క సుమన్ హాయంలో చేపట్టిన అభివృద్ధి పనులకు తాము సిద్ధమని కాంగ్రెస్ నాయకులు సిద్ధమా అని సవాల్ విసిరారు. మందమర్రి పట్టణ ప్రెస్ క్లబ్‌లో శనివారం బిఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడారు. చెన్నూరు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ హయాంలో వందల కోట్లతో జరిగిన అభివృద్ధి పనులపై తాము ఎక్కడైనా, ఏ క్షణమైనా చర్చకు సిద్ధమని నాయకులు స్పష్టం చేశారు. ఇప్పటి వరకు రెండున్నరేళ్ల కాలంలో మంత్రి వివేక్ వెంకటస్వామి చేపట్టిన అభివృద్ధి పనులు వివరించాలని మందమర్రి పట్టణ, మరియు చెన్నూరు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులతో పాటు ప్రస్తుత మంత్రి వివేక్ వెంకటస్వామి నియోజకవర్గానికి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రి వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో చెన్నూరులో జరిగిన అభివృద్ధి ఏంటో పాత్రికేయుల సమక్షంలో ప్రజలకు స్పష్టంగా వివరించాలని వారు కోరారు. అలాగే చెన్నూరు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన అభివృద్ధి చెప్పడానికి మేము సిద్ధం అని వారు స్పష్టం చేశారు.

# అపరిశుభ్ర వాతావరణంలో మాంసం విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తాం..






- **నియర్ మహంకాళి స్వామి**

జ్యోతి నగర్ ఎన్టిపిసి జూన్ 27 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్
అపరిశుభ్ర వాతావరణంలో మాంసశీ విక్రయాలు జరిపితే లైసెన్ను రద్దు చేస్తామని , మార్కెట్ నుండి ఖాళీ చేయిస్తామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి హెచ్చరించారు. వార్డు సందర్శనలో భాగంగా శనివారం 39 వ డివిజన్ శివాజీ నగర్ లోని కూరగాయల మార్కెట్ ను డిప్యూటీ మేయర్ పాత పెల్లి ఎల్లయ్య , స్థానిక కార్పొరేటర్ తిప్పారపు మానస తో కలిసి సందర్శించారు . ఈ సందర్భంగా మాశీసం దుకాణాల వద్ద నెలకొన్న అపరిశుభ్రతపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మునిసిపల్ వాహనాలకు చెత్త ఇవ్వకుండా పురుగులు పట్టే దాకా నిలువ ఉంచడం , మాంసం వ్యర్థాలను కాలువలో పడవేయడం గమనించి ఇక ముందు ఇలా జరిగితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని విక్రయదారులను హెచ్చరించారు. పశు వధశాలను ఉపయోగించుకోవాలని సూచించారు. వర్షా కాలంలో అంటువ్యాధులు ప్రబలడానికి అవకాశం ఎక్కువగా ఉన్న పరిస్థితులలో అపరిశుభ్ర పరిస్థితులలో విక్రయాలు జరపడం వలన ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని అన్నారు. అందమైన, పరిశుభ్రమైన మార్కెట్ రూపొందించడానికి ఎం ఎల్ ఎ సుమారు నాలుగు కోట్ల రూపాయలు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేయిస్తుంటే మరో ప్రక్క దుర్గంధపు వాసనతో కనీసం నిలబడలేని విధంగా మార్కెట్ ను విక్రయాదరులు అస్తవ్యస్తంగా తయారు చేయడం సరికాదని అన్నారు. కాగా ఈ సందర్భంగా దుకాణాల ముందుం ఉన్న చెత్త , రాళ్ళు , ప్లాస్టిక్ కవర్లు , తెరలు , పరదాలు , జాలీలు , శిధిలావస్థ లో ఉన్న వస్తువులన్నిటినీ తొలగింపజేశారు . నీడ కోసం ఒక క్రమ పద్దతిలో తాత్కాలికంగా రేకులు వేసుకోవాలని వ్యాపారులకు సూచించారు. చిన్న కాలువలతో పాటు పెద్ద కాలువలో పూడిక తొలగించారు. పిచ్చి చెట్లు , శిధిలాల మట్టి తొలగించారు. ఫుట్ పాత్ కు ఆనుకొని ఉన్న మట్టిని కూడా తొలగించారు . నిషేధిత ప్లాస్టిక్ కవర్లు ఉపయోగిస్తే జరిమానా విధించాలని ఆదేశించారు. చెత్త బయట పడవేస్తే పరిమాణాన్ని బట్టి జరిమానా వసూలు చేయాలని ఆదేశించారు. కూరగాయల వ్యర్థాలను మార్కెట్ లోనే రీ సైకిలింగ్ చేయడానికి తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. మార్కెట్ ప్రక్కన 40 అడుగులకు తగ్గకుండా కొత్త రోడ్డు నిర్మించాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు , నగర పాలక సంస్థ అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు. కాగా లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం ఆద్వర్యంలో సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ లో పాల్గొన్న మునిసిపల్ సిబ్బందికి



అల్పాహారం ఏర్పాటు చేశారు . లయన్స్ క్లబ్ ఆద్వర్యంలో నిరంతరం కొనసాగుతున్న అల్పాహార వితరణ కార్యక్రమం శనివారం నాటికి వెయ్యి రోజులకు చేటడం పట్ల నిర్వాహకులను మేయర్ అభినందించారు . నిర్వాహకులు తానిపర్తి విజయ లక్ష్మీ గోపాల రావు , బంక రామస్వామి , రాజేందర్ , తిలక్ చక్రవర్తి , నాయకులు తిప్పారపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





# పాఠశాలల్లో విద్యుత్ భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన ఎన్టీపీసీ





జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూన్ 27 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాలు--2026 (జూన్ 26 నుంచి జూలై 2 వరకు) సందర్భంగా శనివారం ఎన్టీపీసీ రామగుండం & తెలంగాణ ఆధ్వర్యంలో టౌన్‌షిప్ పరిధిలోని వివిధ పాఠశాలల్లో విద్యుత్ భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కేంద్రీయ విద్యాలయం, శ్రీ చైతన్య స్కూల్, సెయింట్ క్లేర్ స్కూల్‌తో పాటు ఇతర విద్యాసంస్థల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.విద్యార్థుల్లో విద్యుత్ భద్రతపై అవగాహన పెంపొందించడం, రోజువారీ జీవితంలో సురక్షితమైన విద్యుత్ వినియోగ అలవాట్లను అలవరచుకునేలా ప్రోత్సహించడం ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన పరస్పర చర్చలు, ప్రదర్శనలు, అవగాహన ప్రసంగాల ద్వారా విద్యార్థులకు విద్యుత్ ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.తడి చేతులతో విద్యుత్ పరికరాలను తాకరాదని, దెబ్బతిన్న విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని, విద్యుత్ సౌకర్యాల సమీపంలో ఆటలు ఆడకూడదని, ఎక్కడైనా ప్రమాదకరమైన విద్యుత్ పరిస్థితులు కనిపిస్తే వెంటనే పెద్దలకు తెలియజేయాలని సూచించారు.అంతేకాకుండా విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, పొరుగువారిలో కూడా విద్యుత్ భద్రతపై అవగాహన కల్పించేలా “సేఫ్టీ అంబాసిడర్లుగా” వ్యవహరించాలని ప్రోత్సహించారు. సురక్షితమైన ప్రవర్తనను అలవర్చుకుని ఇతరులను కూడా విద్యుత్ భద్రతా నియమాలు పాటించేలా చైతన్యపరచాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా మాట్లాడిన అధికారులు “విద్యుత్ భద్రత అనేది యాదృచ్ఛికంగా లభించేది కాదు.. అది మనం చేసే సరైన ఎంపిక” అని పేర్కొంటూ, ప్రతి ఒక్కరి బాధ్యతాయుతమైన వ్యవహారమే విద్యుత్ ప్రమాదాలను నివారించగలదని తెలిపారు. అనంతరం విద్యార్థులు విద్యుత్ భద్రతా నియమాలను పాటిస్తూ, సమాజంలో భద్రతా సంస్కృతిని పెంపొందించేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.ఈ అవగాహన కార్యక్రమాలకు విద్యార్థులు, ఉపాధ్యాయుల నుంచి విశేష స్పందన లభించింది. విద్య, అవగాహన, ప్రజల భాగస్వామ్యం ద్వారా సురక్షిత సమాజ నిర్మాణానికి ఎన్టీపీసీ రామగుండం & తెలంగాణ కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు.



## కొప్పూరులో పశువులకు టీకాలు

- పశువుల ఆరోగ్యమే రైతు ఆర్థిక భరోసా: పశువైద్యాధికారి డాక్టర్ రోజా



హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/జూన్ 27/అక్షరం న్యూస్:-

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొప్పూరు గ్రామంలో పశువులకు సీజనల్ వ్యాధులు ముఖ్యంగా లంపీ స్కిన్ వ్యాధి (తెల్లటి దద్దుర్లు) వంటి అంటువ్యాధులు సోకకుండా నివారణ చర్యల్లో భాగంగా ప్రత్యేక టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు.

మండల పశువైద్యాధికారి డాక్టర్ రోజా ఆధ్వర్యంలో గ్రామంలోని పశువులకు టీకాలు వేయడంతో పాటు వాటి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ రోజా మాట్లాడుతూ వర్షాకాలంలో పశువులకు వైరస్ సంబంధిత వ్యాధులు సోకే ప్రమాదం అధికంగా ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా లంపీ స్కిన్ వ్యాధి సహా ఇతర అంటువ్యాధులు వ్యాపించకుండా ఉండేందుకు ప్రతి పశువుకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని సూచించారు. ప్రభుత్వం ఈ టీకాలను ఉచితంగా అందిస్తున్నందున ప్రతి పశుపోషకుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశువులకు జ్వరం ఆహారం తినకపోవడం చర్మంపై గడ్డలు లేదా దద్దుర్లు కనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప పశువైద్య అధికారులను సంప్రదించాలని సూచించారు. టీకాల ద్వారా పశువుల ప్రాణాలను కాపాడడంతో పాటు రైతులకు ఆర్థిక నష్టాన్ని నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గద్ద కుమారస్వామి, ఉపసర్పంచ్ మిరియాల రాణి రాజు, పశువైద్య సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొని తమ పశువులకు టీకాలు వేయించుకున్నారు.

## సారంగపల్లి గ్రామపంచాయతీలో బోరు మంజూరు

- కార్మిక మంత్రి వివేక్ కి కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్థులు.



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ జూన్ 27/ అక్షరం న్యూస్ -:

మందమర్రి మండలంలోని సారంగపల్లి గ్రామపంచాయతీలో నెలకొన్న తాగినీటి సమస్యను పరిష్కరించి, గ్రామానికి బోరు మంజూరు చేయించిన ఉపాధి కల్పన శాఖ మంత్రివర్యులు, చెన్నూరు నియోజకవర్గ శాసనసభ సభ్యులు డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామికి సారంగపల్లి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు ఈ సందర్భంగా తెలిపారు. ప్రజల అవసరాలకు వెంటనే స్పందిస్తూ సేవ భావంతో ముందుకు సాగుతున్న మీ నాయకత్వం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బచ్చలి రాములు, మండల అధ్యక్షులు కడారి జీవన్ కుమార్, పట్టణ అధ్యక్షులు తిరుమల, మండల స్పోక్స్ పర్సన్ రాయమల్లు ,మాజీ సర్పంచులు కమల మనోహర్ రావు, అసనపల్లి రాజయ్య, వార్డు సభ్యులు రమేష్, నాయకులు. సంతోష్ రావు, తాజుద్దీన్, గ్రామస్తు పాల్గొన్నారు.

## కార్పొరేట్ జి ఎం విజిలెన్స్ రాజీవ్ కుమార్ కు వీడ్కోలు

- మందమర్రి ఏరియాలో ఆత్మీయ సన్మానం.



మంచిర్యాల జిల్లా/ మందమర్రి /జూన్ 27 అక్షరం న్యూస్ -:

పి.రాజీవ్ కుమార్, జి ఎం విజిలెన్స్ (కార్పొరేట్) త్వరలో పదవీ విరమణ చేయనున్న సందర్భంగా, శనివారం మందమర్రి ఏరియాకు విచ్చేశారు. ఈ సందర్భంగా మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ, ఏరియా ఉన్నతాధికారులు ఆయనను ఘనంగా సన్మానించారు. సుదీర్ఘ సర్వీసులో పి.రాజీవ్ కుమార్ అందించిన సేవలను కొనియాడారు. ఈ ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ఏరియా ఈ అండ్ ఎం బాలాజీ భగవతి జా, డి జి ఎం (ఐ ఈ డి) కె.కిరణ్ కుమార్, డి వై జి ఎం (ఏ ఎస్ ఓ) వి. మురళి, డి జి ఎం (సర్వే) భుఖ్య దేశాయ్, డి జి ఎం (సివిల్) షేక్ మదీనా భాష , ఫారెస్ట్ అధికారి నవీన్ , క్వాలిటీ అధికారి ప్రదీప్, డి జి ఎం (పర్సనల్) విజయ్ సందీప్, ఎస్.రాజ్ కుమార్, మేనేజ్మెంట్ ట్రైనీ (అకౌంట్స్) లు పాల్గొన్నారు.

## ఆలేరు ప్రజలను చల్లంగా చూడు దుర్గమ్మ తల్లి... ప్రభుత్వ విప్ , ప్రభుత్వ బీర్ల ఐలయ్య



యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూన్ 27 / : ఆలేరు ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో జీవించే విధంగా చల్లంగా చూడమని శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య వేడుకున్నారు. ఆలేరు లోని 11వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీర్వాదం తీర్థ ప్రసాద స్వీకరించి ఆయన మాట్లాడారు. ఆలేరు నియోజకవర్గంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలతో రైతులు సుఖ సంతోషాలతో కుటుంబ సభ్యులతో జీవించాలని అమ్మవారిని వేడుకున్నామన్నారు. గత మూడు రోజులుగా అంగరంగ వైభవంగా కనకదుర్గమ్మ అమ్మవారికి గణపతి పూజ నిత్య పారాయణం, హోమం, శ్రీ మల్లికార్జున స్వామి కనకదుర్గమ్మ దేవికి కళ్యాణం నిర్వహించడం, మహిళలంతా బోనాలు సమర్పించడం, మొక్కులు చెల్లించుకోవడం సంతోషంగా ఉందన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత భావాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ఆదివారం కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి ఘనంగా పండుగ నిర్వహించుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆలేరు ప్రజలందరికీ దుర్గమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడమే లక్ష్యంగా ప్రజా పాలన ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మున్సిపల్ చైర్ పర్సన్ బిజన బాలమణి భాస్కర్, టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగామ ఉపేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షులు ఎం ఏ ఎజాస్, పట్టణ అధ్యక్షులు కట్టెగొమ్ముల సాగర్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ కొలుపుల హరినాథ్, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు జట్ట నీరజ సిద్ధులు, మల్లెల సరిత శ్రీకాంత్, జూకంటి సంపత్ , మరియమ్మ మార్క్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముదిగొండ శ్రీకాంత్, మాజీ ఎంపీటీసీ శ్రీను, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

## దుర్గమ్మకు బోనం సమర్పిస్తున్న.... ఆలేరు మున్సిపల్ చైర్ పర్సన్ బీజన బాలమణి భాస్కర్



యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూన్ 27 / : ఆలేరు పట్టణ కేంద్రంలోని శ్రీ కనకదుర్గమ్మ 11వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలేరు మున్సిపల్ చైర్ పర్సన్ బీజన బాలమణి భాస్కర్ కుటుంబ సమేతంగా అమ్మవారికి బోనం సమర్పించి,మొక్కులు చెల్లించుకున్నారు.. ఈ సందర్భంగా బీజన బాలమణి భాస్కర్ మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో పిల్లాపాపలతో దుర్గమ్మ పండుగను జరుపుకోవాలని కోరారు. ఆలేరులో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలతో రైతులు సుఖ సంతోషాలతో జీవించాలని అమ్మవారిని వేడుకున్నామన్నారు. ఆలేరు పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలుపుతామని బీజన బాలమణి భాస్కర్ అన్నారు...

## మెరుగైన చికిత్స అందించాలని డాక్టర్లను కోరిన మాజీ ఎమ్మెల్యే శ్రీమతి గొంగిడి సునీత



యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూన్ 27 / : శనివారం రోజు, సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆలేరు పట్టణ బిఆర్ఎస్ నాయకులు మొరిగాడి వెంకటేశ్ ను పరామర్శించి వారి ప్రస్తుత ఆరోగ్య పరిస్థులను అడిగి తెలుసుకొని డాక్టర్లను మెరుగైన చికిత్స అందించాలని కోరిన మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీమతి గొంగిడి సునిత మహేందర్ రెడ్డి ...

## తుర్కపల్లి మండలం చౌక్ల తండా, గోగులగుట్ట తండా గ్రామంలో బి.ఎల్.ఏ లకి ఐడి కార్డులు అందజేత



యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూన్ 27 / : శనివారం రోజు ఆలేరు శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ బిర్లా ఐలన్న ఆదేశానుసారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం తుర్కపల్లి మండలం లోని చౌక్ల తండా, గోగులగుట్ట తండా గ్రామం లో బూత్ నెంబర్ 73,మరియు 78 లలో బి.ఎల్.ఏ లకి ఐడి కార్డు లను అందజేయడం జరిగింది .ఈ కార్యక్రమం లో స్థానిక సర్పంచులు, ఉపసర్పంచ్ లు , వార్డు మెంబర్లు, మరియు గ్రామస్తులు తదితరులు ఆశవర్కర్లు పాల్గొన్నారు..

## అశ్వారావుపేట మున్సిపల్ టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నండ్రు రమేష్ బాబు



భద్రాద్రి కొత్తగూడెం/అశ్వారావుపేట / జూన్ 27 / అక్షరం న్యూస్ -: అశ్వారావుపేట మున్సిపల్ టౌన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నండ్రు రమేష్ బాబు నియమితులయ్యారు. ఈ విషయాన్ని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిన్నంశెట్టి సత్యనారాయణ తెలిపారు.

### మున్సిపాలిటీగా మారిన తర్వాత తొలి అధ్యక్షుడు

అశ్వారావుపేట మున్సిపాలిటీగా ఏర్పడిన తర్వాత తొలి టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నండ్రు రమేష్ బాబు నియామకం కావడం విశేషం. పార్టీ శ్రేణులు ఈ నిర్ణయాన్ని స్వాగతించాయి.

### పార్టీ బలోపేతానికి కృషి.

తొలి నుంచి కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తూ, కార్యకర్తలను ఏకం చేయడంలో రమేష్ బాబు కీలక పాత్ర పోషించారని నాయకులు పేర్కొన్నారు.

### ప్రజాసేవలో ముందంజ

ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజాసేవలో మంచి గుర్తింపు పొందిన రమేష్ బాబుకు ఈ బాధ్యతలు రావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

### అధిష్ఠానానికి కృతజ్ఞతలు

తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి, సహకరించిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులందరికీ నండ్రు రమేష్ బాబు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆపదలో అండగా నిలుస్తున్న బీర్ల ఫౌండేషన్

- బీర్ల అనిత ఆదేశాల మేరకు ఇరు కుటుంబాలకు బియ్యం అందజేత.



యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూన్ 27 / : శనివారం రోజు తుర్కపల్లి మండలంలోని ఇంద్రనగరం గ్రామంలో ఇటీవల మరణించిన మోర కిష్టయ్య మరియు మోర నరసయ్య బియ్యం అందజేయడం జరిగింది . బీర్ల ఫౌండేషన్ చైర్ పర్సన్ బిర్లా అనిత బిర్లా ఐలన్న ఆదేశాల మేరకు ఇవ్వడం జరిగింది. గ్రామ శాఖ అధ్యక్షుడు సికోటి కిషన్ , మండలసీనియర్ నాయకులు సడల కనకయ్య , దొంతుల రమేష్ , నరసింహులు , చింతకింది నరసింహులు , మల్లపు రాములు , సీకోటి సత్యనారాయణ , సడల రమేష్ , మల్లేష్ , కరుణాకర్ , నరసింహులు , గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఇవ్వడం జరిగింది.



## వామపక్ష నాయకుల అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం

- అరెస్టు చేసిన కూనంనేని, ఇతర నేతలను భేషరతుగా విడుదల చేయాలి.
- రాత్రికి రాత్రే పేదల గుడిసెల కూల్చివేత దుర్మార్గం.
- పేదల భూపోరాటాలను అణచివేస్తే ఉద్యమం మరింత ఉధృతం.
- సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా.



బ ్ ( ద ా ( ది కొత్తగూడెం/కొత్తగూడెం /జూన్ 27 /అక్షరం న్యూస్ –: హన్మకొండ ఆదాలత్ సెంటర్ వద్ద శాంతియుతంగా భారీ రాస్తారోకో మరియు నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న వామపక్ష నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా తీవ్రంగా ఖండించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తదితర ప్రముఖ నాయకులను, వందలాది మంది కార్యకర్తలను పోలీసులు బలవంతంగా అరెస్టు చేయడం హేయమైన చర్య అని ఆయన మండిపడ్డారు. హన్మకొండ జిల్లా గుండ్లసింగారంలో నిరుపేదలు వేసుకున్న సుమారు 360కి పైగా గుడిసెలను రెవెన్యూ, మున్సిపల్ అధికారులు రాత్రికి రాత్రే జేసీబీలతో కూల్చివేయడాన్ని నిరసిస్తూ శనివారం హన్మకొండలో వామపక్షాల ఆధ్వర్యంలో ఈ భారీ ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పత్రికలకు ప్రకటన విడుదల చేస్తూ.. రాత్రికి రాత్రే పేదల గుడిసెలను కూల్చివేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇండ్ల స్థలాల పట్టాలు ఇచ్చి, ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద శాశ్వత గృహాలు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తూ, విలువైన ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న భూమాఫియాపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పేదల భూపోరాటాలను అణచివేయాలని చూస్తే రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన ప్రభుత్వాలను హెచ్చరించారు.

## చేవెళ్లలో యువాన్ష్ ఫిజియోథెరపీ క్లినిక్ ను ప్రారంభించిన మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమత వెంకటరెడ్డి



రంగారెడ్డి జిల్లా : శంకర్‌పల్లి: జూన్ 27: (అక్షరం న్యూస్ ): చేవెళ్ల మున్సిపల్ పరిధిలో శనివారం నూతన యువాన్ష్ ఫిజియోథెరపీ క్లినిక్ ను మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమత వెంకటరెడ్డి, డాక్టర్ రాణి రెడ్డితో కలిసి, రిబ్బన్ కట్ చేసి, లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ క్లినిక్ వచ్చే రోగులకు సరైన వైద్యం అందజేయాలని సూచించారు. పట్టణ, మండల ప్రజలు యువాన్ష్ ఫిజియోథెరపీ క్లినిక్ ను వినియోగించుకోవాలని కోరారు. చైర్ పర్సన్.. డా. రాణిరెడ్డిని అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పొల్యూషన్ బోర్డ్ సభ్యుడు చింపుల సత్య నారాయణ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు గౌడ్, మున్సిపల్ కమిషనర్ యాదగిరి గౌడ్, ముడిమేల సొసైటీ చైర్మన్ ప్రతాపరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాములు, కౌన్సిలర్లు శైలజ నాగిరెడ్డి, శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, నర్సింలు, కృష్ణ నాయక్, మొయినాబాద్ మాజీ జెడ్పీటిసి కాలె శ్రీకాంత్, మున్సిపాల్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కార్తీక్ రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, నాయకులు జనార్దన్ రెడ్డి, రామ్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, సిఐ భూపాల్ శ్రీధర్, మహేశ్వర్ రెడ్డి, గుడి మల్కాపూర్ డైరెక్టర్ పాండు యాదవ్, హరిచరణ్ రెడ్డి, భోజి రెడ్డి, అంజిరెడ్డి, హరీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.



### యాదగిరిగుట్టలో "ఛాత్రోన్ కీ గూంజ్" కార్యక్రమాన్ని నిర్వహించిన.

## తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ,డీసీసీ అధ్యక్షుడు బీర్ల అయిలయ్య



యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూన్ 27 / : యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలోని యాదగిరిగుట్ట పట్టణంలో భారత లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు శ్రీ రాహుల్ గాంధీ రాజస్థాన్‌లోని కోటలో విద్యార్థులు , యువత సమస్యలను తెలుసుకుని వారి గొంతుకగా ప్రారంభించిన "ఛాత్రోన్ కీ గూంజ్" (విద్యార్థుల స్వరం) కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు బీర్ల అయిలయ్య వేలాది మంది విద్యార్థులు, యువతతో కలిసి పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహించారు . ఈ సందర్భంగా రాజస్థాన్ కోట లో రాహుల్ గాంధీ మాట్లాడిన అంశాలను ఎల్.ఈ.డి స్క్రీన్ పై వీక్షించారు. ఈ కార్యక్రమంలో మహిళ కార్పొరేషన్ చైర్ పర్సన్ బండ్రు శోభారాణి, యూత్ కాంగ్రెస్ ఇంచార్జి భవ్యశ్రీ ,యూత్ కాంగ్రెస్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఫైజర్, ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ రణధీర్ ,మున్సిలల్ చైర్ పర్సన్స్ ,యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్.ఎస్.యు.ఐ నాయకులు,సోషల్ మీడియా సభ్యులు తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, విద్యార్థులు మరియు యువత ఎదుర్కొంటున్న సమస్యలను దేశవ్యాప్తంగా వెలుగులోకి తీనుకురావడమే "ఛాత్రోన్ కీ గూంజ్" కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. నాణ్యమైన విద్య, పారదర్శకమైన పరీక్షల వ్యవస్థ, ఉద్యోగాల భర్తీ, యువతకు సమాన అవకాశాలు కల్పించడం కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే విధానాలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని, యువత ఆశయాలకు అండగా నిలవడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తన అభిప్రాయాన్ని స్వేచ్ఛగా వ్యక్తపరచే హక్కు కలిగి ఉండాలని, వారి సమస్యలు ప్రభుత్వాల దృష్టికి చేరేలా ఈ కార్యక్రమం వేదికగా నిలుస్తుందని అన్నారు.

వేలాది మంది యువత, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ సమస్యలు, అభిప్రాయాలు, ఆకాంక్షలను వెల్లడించారు. కార్యక్రమంలో విద్య, ఉద్యోగాలు, పోటీ పరీక్షల నిర్వహణలో పారదర్శకత, నైపుణ్యాభివృద్ధి, యువత సాధికారత వంటి అంశాలపై చర్చ జరిగింది.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థి నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, పార్టీ కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువత పాల్గొన్నారు...

## ఆత్మహత్య కేసులో న్యాయం చేసిన పోలీసు శాఖకు సన్మానం





- మృతుడి తల్లి తిరుపతమ్మ చేతుల మీదుగా ప్రస్తుత పోలీసు అధికారులకు శాలువాలతో ఘన సత్కారం.
- మరికొందరిపై జిల్లా కోర్టులో అప్పీల్‌కు వెళ్తానన్న తిరుపతమ్మ.

భద్రాద్రి కొత్తగూడెం / అశ్వారావుపేట / జూన్ 28 / అక్షరం న్యూస్ –: అశ్వారావుపేట మండలం పేరాయిగూడెంకు చెందిన తగరం ముత్యాలరావు ఆత్మహత్య కేసులో నిందితులకు శిక్షలు పడిన నేపథ్యంలో, మృతుడి తల్లి తగరం తిరుపతమ్మ శనివారం అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించి ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.



### పోలీసు శాఖ కృషికి కృతజ్ఞతలు

కేసు దర్యాప్తు నుంచి న్యాయస్థానంలో తీర్పు వెలువడే వరకు పోలీసు శాఖ నిబద్ధతతో వ్యవహరించి న్యాయం జరిగేలా కృషి చేసిందని తిరుపతమ్మ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోలీసు శాఖకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రస్తుతం విధుల్లో ఉన్న పోలీసు అధికారులను శాలువాలతో సత్కరించారు.

### కేసు నేపథ్యం

2018లో పేరాయిగూడెంకు చెందిన తగరం ముత్యాలరావు ఆత్మహత్య చేసుకోగా, ఈ కేసును విచారించిన కొత్తగూడెం అదనపు అసిస్టెంట్ సెషన్స్ కోర్టు ఇటీవల ఐదుగురు నిందితులకు వివిధ కాలపరిమితుల కఠిన కారాగార శిక్షలు, జరిమానాలు విధించింది.

### మరికొందరిపై అప్పీల్

ఈ కేసులో ఇంకా కొందరికి కూడా శిక్ష పడాల్సి ఉందని, వారిపై జిల్లా కోర్టులో అప్పీల్ దాఖలు చేస్తానని తగరం తిరుపతమ్మ తెలిపారు.

## ఇండ్లు లేని పేదల పక్షాన సమిష్టిగా పోరాడుదాం

- పేదల ఇండ్ల కూల్చివేత చర్యలను ప్రభుత్వం మానుకోవాలి.
- బాధితుల హక్కుల సాధన కోసం జులై 1న కలెక్టరేట్ ఎదుట ధర్నా.
- పేదల ఇండ్ల సమస్యలపై అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తాం.
- ధర్నా జయప్రదానికి ఉమ్మడిగా కదిలిరావాలి.
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు.



భద్రాద్రి కొత్తగూడెం/ కొత్తగూడెం /జూన్ 27 /అక్షరం న్యూస్ –: ఇండ్లు లేని పేదల పక్షాన సమిష్టిగా పోరాడుదామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం 'శేషగిరిభవన్'లో సిపిఐ, సిపిఎం ముఖ్య నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఇండ్లు లేని పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, పేదలు నిర్మించుకున్న ఇండ్లకు ఇంటి నెంబర్లు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని, అదేవిధంగా పేదల ఇండ్ల కూల్చివేతలు ఆపాలని డిమాండ్ చేస్తూ జులై 1న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించ తలపెట్టిన ధర్నా కార్యక్రమ విజయవంతం కోసం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుపేదలు ఇండ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేదలు ఎంతో కష్టపడి నిర్మించుకున్న నివాసాలకు కనీస వసతులైన ఇంటి నెంబర్లు, కరెంట్ కనెక్షన్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. ప్రభుత్వం పేదల ఇండ్లను కూల్చే దుర్మార్గపు చర్యలను తక్షణమే మానుకోవాలని, వారికి పూర్తి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. బాధితుల హక్కుల సాధన కోసం జులై 1న జరగబోయే కలెక్టరేట్ ధర్నాను విజయవంతం చేయడానికి ఇండ్ల బాధితులను పెద్ద ఎత్తున తరలించాలని కోరారు. పేదల ఇండ్ల సమస్యలపై రాబోయే రోజుల్లో అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు గ్రామాలు, పట్టణాల్లో విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించి ధర్నా జయప్రదానికి ఉమ్మడిగా కదిలిరావాలని పిలుపునిచ్చారు. న్యూ డెమోక్రసి జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వర్ రావు, మాస్ లైన్ నాయకులు పి సతీష్ మాట్లాడారు. సమావేశంలో సిపిఐ నాయకులు సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, మేయర్ మూడ్ గణేష్, సిపిఎం రాష్ట్ర నాయకులు అన్నవరపు కనకయ్య, జిల్లా నాయకులు లిక్కి బాలరాజు, సిపిఐ, న్యూ డెమోక్రసీ, నాయకులు భూక్యా శ్రీనివాస్, నేరెళ్ల రమేష్, గద్దం ప్రభాకర్, వెంకట్, మోతుకూరి మల్లికార్జున్ రావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## చొప్పదండి గురుకుల పాఠశాలలో ఇంటర్ సైన్స్ వింగ్ అడ్మిషన్లు ప్రారంభించాలి

- బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి



చొప్పదండి/ కరీంనగర్, జూన్ 27 (అక్షరం న్యూస్ )

చొప్పదండి పట్టణ శివారు లోని గురుకుల పాఠశాలలో హాస్టల్ వసతి లేదనే కారణం తో నిలుపుదల చేసిన ఎంపీసీ,బైపీసీ సెక్షన్లలో అడ్మిషన్లు వెంటనే ప్రారంభించాలని ఎంపీటీసీ ఫోరం మాజీ మండల అధ్యక్షులు, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు.క్రితం సంవత్సరం కూడా హాస్టల్ వసతి లేదని అడ్మిషన్లు తీసుకోలేదని సంవత్సరం గడిచినప్పటికి వసతి ఏర్పాటు చేయడం పై కానీ నూతన అడ్మిషన్ల పై కానీ దృష్టి సారించిన నాధుడు లేడని ఆయన వాపోయారు.పాలకుల నిరక్షం వలన 160 మంది విద్యార్థులు చదువుకునే అవకాశం కోల్పోయారని కరీంనగర్ జిల్లా కలెక్టర్ సత్వరం స్పందించిగురుకుల పాఠశాల లో ఇంటర్ సైన్స్ విభాగం అడ్మిషన్లు ప్రారంభించ చేయాలని సింగిరెడ్డి కృష్ణారెడ్డి, దొంతిసారపు సంపత్ లు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు

## వర్షాల కోసం ఎదురుచూపులు - ప్రత్యామ్నాయ పంటలే శరణ్యం

- మార్కెట్ చైర్మన్ కోత్తూరి మహేష్



చొప్పదండి/ కరీంనగర్,జూన్ 27 (అక్షరం న్యూస్ )

నైరుతి రుతుపవనాలు ఆలస్యం కావడంతో పాటు ఎల్ నినో ప్రభావంతో రైతులు ఆందోళన చెందవద్దని, ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని చొప్పదండి మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తురి మహేష్ రైతులకు సూచించారు.శనివారం ఆయన మాట్లాడుతూ,వారం రోజులు ఆలస్యంగా ఈనెల 6న రాష్ట్రాన్ని తాకిన రుతుపవనాలు సరిహద్దు దాటి చురుకుగా ముందుకు కదలకపోవడంతోపొలాలుమండిపోతున్నాయన్నారు.మృగశిర కార్తె ప్రవేశించి పదిరోజులు గడిచినా వర్షాలు కురవక 43 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని,ఇది రోహిణి కార్తె ఎండలను తలపిస్తోందన్నారు.ఈసారి ఎల్ నినో ప్రభావం బలంగా ఉండటంతో చొప్పదండి మండలంలో సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతమే నమోదయ్యే అవకాశం ఉందన్నారు.ప్రతి వర్షాకాలం జిల్లాలో వేల ఎకరాల్లో వరి, వేల ఎకరాల్లో పత్తి సాగు చేస్తారని, ఈసారి కరువు సంకేతాలతో పంటల ప్రణాళిక మార్చాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. చొప్పదండి మండల రైతన్నలు ఈసారి వరి స్థానంలో కంది, పెసర, మినుములు, సజ్జలు, రాగులు, నువ్వులు, జొన్నలు, వంటి చిరుధాన్యాలు సాగు చేయాలని, వ్యవసాయ శాఖ ద్వారా సూచిస్తున్నామన్నారు . మొక్కజొన్నతో తయారయ్యే ఉత్పత్తుల పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తామని చెప్పారు.అవగాహన సదస్సులు: రైతులను చైతన్యవంతం చేసేందుకు గ్రామాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి, నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచుతామన్నారు.వాతావరణ అంచనాలను ఎప్పటికప్పుడు వివరిస్తామన్నారు.యూరియా కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, పీఏసీఎస్‌లలో యూరియా అమ్మకాలు జరుపుతామని తెలిపారు.సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ కేంద్ర, రాష్ట్ర పథకాలపై రైతులకు అవగాహన కల్పిస్తామని చొప్పదండి వ్యవసాయం మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్ పేర్కొన్నారు.

## గిర్వాణీ పాఠశాల విద్యార్థులకు విద్యా సామాగ్రిని పంపిణీ చేసిన చల్ల మల్లికార్జున్



చొప్పదండి /కరీంనగర్,జూన్ 27 (అక్షరం న్యూస్ )

చొప్పదండి గీర్వాణి విద్యాలయంలో విద్యార్థులకు ఉచితంగా విద్యా సామగ్రి పంపిణీ

చొప్పదండి పట్టణంలోని గీర్వాణి విద్యాలయంలో చల్ల మల్లికార్జున్ తన తోటి స్నేహితులైన కార్తికేయ, సృజన్, విష్ణులతో కలిసి సేవా దృక్పథంతో విద్యార్థినీ, విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు, నోట్‌బుక్‌లను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో గీర్వాణి విద్యాలయ చైర్మన్ కె. గంగయ్య, ప్రిన్సిపాల్ కె. కిరణ్ కుమార్, కో-ఆర్డినేటర్లు నాగరాజు, సిరిపురం శ్రీనివాస్ తో పాటు ఉపాధ్యాయినులు పాల్గొని, విద్యార్థుల సేవాభావాన్ని అభినందించారు.ఈ కార్యక్రమం విద్యార్థుల్లో సేవా భావాన్ని పెంపొందించడంతో పాటు విద్య పట్ల మరింత ఆసక్తిని కలిగించేలా నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

## గబ్బెటప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వాటర్ ప్లాంట్ ప్రారంభం





జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ )జూన్ 27: మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంట్తో పాటు ఇన్ఫోసిస్ సాఫ్ట్వేర్ కంపెని వారు అందజేసిన నూతన కంప్యూటర్ను సర్పంచ్ కూటికంటి ఉపేంద్ర అనిల్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుండే విద్యార్థులకు కంప్యూటర్పై పరిజ్ఞానం పెంపొందించడానికి బడి బాట కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులకు ఇచ్చిన హామీ మేరకు పాఠశాలలో వాటర్ ప్లాంట్తో పాటు కంప్యూటర్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రైవేటు పాఠశాలల కన్న ప్రభుత్వ పాఠశాలలలోనే మెరుగైన విద్య లభిస్తుందని, ప్రతి ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ప్రభుత్వం అందిస్తున్న సేవలను ఉపయోగించ కోవాలని కోరారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ వెలి శాల యాదలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సు నంద, ఉపాధ్యాయులు థామసమ్మ, విజయ మేరీ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శరీరంలోని వేడిని తగ్గించడంలో

## కీరదోస, పుచ్చకాయ.. ఏది ఉత్తమంగా పనిచేస్తుంది..?

వ్యాయామం, ఆహారం ఎంత ముఖ్యమో వేసవిలో శరీరానికి తగినంత నీరు అందించడం కూడా అంతే అవసరం. ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో హీట్ స్ట్రెస్, డీహైడ్రేషన్ వంటి సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. శరీరంలోని ఉష్ణోగ్రతను సమతుల్యం చేయడంలో, వేడి ప్రభావాన్ని తగ్గించడంలో కీరదోసకాయ, పుచ్చకాయ వంటి నీటి శాతం అధికంగా ఉండే ఆహారాలు కీలక పాత్ర పోషిస్తాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే వీటిని సరైన పరిమాణంలో, సరైన సమయంలో తీసుకుంటేనే పూర్తి ప్రయోజనం పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు. హీట్ స్ట్రెస్ అంటే శరీరం తన అంతర్గత ఉష్ణోగ్రతను నియంత్రించలేని పరిస్థితి. ముఖ్యంగా తీవ్రమైన ఎండల్లో ఎక్కువసేపు గడిపినప్పుడు అలసట, తల తిరగడం, అధికంగా చెమటలు పట్టడం, నీరసం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో శరీరానికి నీరు, ఎలక్ట్రోలైట్లను అందించే ఆహారాలు తీసుకోవడం చాలా అవసరం.

### పోషకాలు అధికమే..

కీరదోసకాయలో సుమారు 95 శాతం వరకు నీరు ఉంటుంది. అందువల్ల ఇది శరీరానికి క్రమంగా నీటిని అందించడంలో సహాయపడుతుంది. అలాగే పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు ఉండటం వల్ల శరీరంలోని వేడిని తగ్గించడంతోపాటు జీర్ణక్రియను కూడా మెరుగుపరుస్తుంది. తక్కువ కేలరీలు ఉండటం వల్ల వేసవిలో రోజువారీ ఆహారంలో కీరదోసకాయను చేర్చడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. పుచ్చకాయలో 92 శాతం వరకు నీరు ఉంటుంది. ఇందులో సహజ చక్కెరలు, ఎలక్ట్రోలైట్లు, లైకోపీన్ అనే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ ఉంటాయి. ఇవి శరీరానికి త్వరగా నీటిని అందించడమే కాకుండా వేడి కారణంగా తగ్గిన శక్తిని తిరిగి అందించడంలో, ఆక్సిడేటివ్ ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి. అయితే పుచ్చకాయను భోజనం చేసిన వెంటనే తినకూడదని, పరిమిత మోతాదులో మాత్రమే తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.



### ప్రయోజనాలు కాస్త భిన్నం..

కీరదోసకాయ, పుచ్చకాయ రెండూ శరీరాన్ని చల్లబరచడంలో ఉపయోగపడినా వాటి ప్రయోజనాలు కొంత భిన్నంగా ఉంటాయి. కీరదోసకాయలో నీటి శాతం ఎక్కువగా ఉండి శరీరానికి నెమ్మదిగా హైడ్రేషన్ అందిస్తుంది. పుచ్చకాయ మాత్రం సహజ చక్కెరల కారణంగా త్వరగా శక్తిని, నీటిని అందిస్తుంది. అలాగే పుచ్చకాయలో ఎలక్ట్రోలైట్లు కొంత ఎక్కువగా ఉండగా, కీరదోసకాయ తక్కువ కేలరీలతో ఎక్కువసేపు చల్లదనాన్ని అందిస్తుంది. హీట్ స్ట్రెస్‌ను తగ్గించడంలో ఏది మంచిదన్నది వ్యక్తిగత అవసరాలపై ఆధారపడి ఉంటుంది. శరీరానికి దీర్ఘకాలం చల్లదనం, తక్కువ కేలరీలతో హైడ్రేషన్ కావాలనుకునేవారికి కీరదోసకాయ మంచి ఎంపిక. త్వరగా నీరు, శక్తి అందించాలంటే పుచ్చకాయ ఉపయోగపడుతుంది. రెండింటినీ సమతుల్యంగా తీసుకోవడం వల్ల మరింత ప్రయోజనం ఉంటుంది.

### ఎలా తీసుకోవాలి..

వేసవిలో కీరదోసకాయను సలాడ్ రూపంలో లేదా నీటిలో ముక్కలు వేసి ఇన్‌ఫ్యూజ్డ్ వాటర్‌గా తీసుకోవచ్చు. పుచ్చకాయను మధ్యాహ్నం సమయంలో చిరుతిండిగా తినడం మంచిది. ప్యాకెట్ జ్యూస్‌లకు బదులుగా తాజా పండ్లనే తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అయితే ప్రతి ఒక్కరూ వీటిని ఒకే విధంగా తీసుకోవడం సరైంది కాదు. మధుమేహం ఉన్నవారు పుచ్చకాయను పరిమిత మోతాదులో మాత్రమే తీసుకోవాలి. అలాగే మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు పొటాషియం మోతాదును దృష్టిలో పెట్టుకుని పుచ్చకాయ వినియోగాన్ని నియంత్రించాలి. ఇక వేసవిలో హీట్ స్ట్రెస్ నుంచి రక్షణ పొందాలంటే కీరదోసకాయ, పుచ్చకాయ రెండింటినీ సమతుల్యంగా ఆహారంలో చేర్చడం మంచిది. వీటితోపాటు తగినంత నీరు తాగడం, ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో బయట తిరగకుండా ఉండటం, శరీరానికి అవసరమైన హైడ్రేషన్‌ను కాపాడుకోవడం ద్వారా వేసవి ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు.

## మెదడు క్యాన్సర్ చికిత్సకు ఎంతో దోహదం

## చేస్తున్న విటమిన్ బి3.. సైంటిస్టుల అధ్యయనం..

వ్యాధుల చికిత్సలో కొత్త మార్గాలను అన్వేషిస్తున్న శాస్త్రవేత్తలు తాజాగా విటమిన్ బి3 (నియాసిన్)పై ఆశాజనక పరిశోధనలు చేస్తున్నారు. ముఖ్యంగా మెదడు క్యాన్సర్‌లో అత్యంత ప్రమాదకరమైన గ్లియోబ్లాస్టోమా చికిత్సలో ఇది రోగనిరోధక వ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తుందని ప్రారంభ అధ్యయనాలు సూచిస్తున్నాయి. అయితే ఇది ఇంకా ప్రయోగాత్మక దశలోనే ఉందని, వైద్యుల పర్యవేక్షణ లేకుండా అధిక మోతాదులో విటమిన్ బి3 సప్లిమెంట్లు తీసుకోవద్దని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. గ్లియోబ్లాస్టోమా మెదడులోని నాడీకణాలకు మద్దతు ఇచ్చే గ్లియల్ కణాల నుంచి ప్రారంభమయ్యే అత్యంత వేగంగా వ్యాపించే క్యాన్సర్. పెద్దల్లో కనిపించే అత్యంత సాధారణ ప్రాణాంతక మెదడు కణితుల్లో ఇది ఒకటి. ప్రస్తుతం దీనికి పూర్తిస్థాయి చికిత్స అందుబాటులో లేకపోయినా, శస్త్రచికిత్స, రేడియేషన్, కీమోథెరపీ ద్వారా కణితి పెరుగుదలను నియంత్రించడానికి, లక్షణాలను తగ్గించడానికి ప్రయత్నిస్తారు.



### క్యాన్సర్ కణాలు నాశనం..

ఈ నేపథ్యంలో విటమిన్ బి3ని సాధారణ చికిత్సలతో కలిపి ఇస్తే ఫలితాలు మెరుగుపడతాయా అనే అంశంపై పరిశోధనలు కొనసాగుతున్నాయి. ప్రారంభ ఫలితాల ప్రకారం, అధిక మోతాదులో నియాసిన్ ఇవ్వడం వల్ల శరీరంలోని రోగనిరోధక కణాలు మళ్లీ చురుకుగా మారి క్యాన్సర్ కణాలను గుర్తించి వాటిపై దాడి చేసే సామర్థ్యాన్ని పెంచినట్లు గుర్తించారు. సాధారణంగా గ్లియోబ్లాస్టోమా కణితి రోగనిరోధక వ్యవస్థను బలహీనపరుస్తుంది. దీంతో శరీరంలోని రక్షణ కణాలు క్యాన్సర్ కణాలను సమర్థంగా ఎదుర్కోలేవు. అయితే నియాసిన్ ప్రభావంతో ఈ రోగనిరోధక కణాలు తిరిగి చురుకుగా మారి క్యాన్సర్ కణాలను నాశనం చేసే పనిని ప్రారంభించినట్లు పరిశోధనలో వెల్లడైంది. విటమిన్ బి3 లేదా నియాసిన్ మాంసం, చేపలు, పల్లీలు, ఇతర గింజలు, సంపూర్ణ ధాన్యాల్లో సహజంగా లభించే ముఖ్యమైన పోషక పదార్థం. ఇది ఆహారాన్ని శక్తిగా మార్చడంలో, కణాల ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

### 82 శాతం మందిలో సానుకూల ఫలితాలు..


ప్రస్తుతం కొనసాగుతున్న ఫేజ్-1, ఫేజ్-2 క్లినికల్ ట్రయల్‌లో శస్త్రచికిత్స, కీమోథెరపీ, రేడియోథెరపీతోపాటు నియంత్రిత విడుదల (కంట్రోల్డ్-రిలీజ్) నియాసిన్‌ను సురక్షితంగా ఉపయోగించవచ్చా అనే అంశాన్ని పరిశీలిస్తున్నారు. ఇప్పటివరకు చికిత్స పొందిన తొలి 24 మంది రోగుల్లో 82 శాతం మందికి ఆరు నెలల తర్వాత కూడా వ్యాధి మరింతగా పెరిగిన ఆనవాళ్లు కనిపించలేదు. గత అధ్యయనాలతో పోలిస్తే ఇది మెరుగైన ఫలితంగా పరిశోధకులు భావిస్తున్నారు. ఈ ట్రయల్‌లో ఆరు నెలల వ్యవధిలో కనీసం 20 శాతం మెరుగుదల కనిపించకపోతే అధ్యయనాన్ని నిలిపివేయాలని ముందుగానే నిర్ణయించారు. అయితే ప్రారంభ ఫలితాలు అంచనాలకు మించి ఉండటంతో, సంప్రదాయ చికిత్సలతోపాటు నియాసిన్ ఇవ్వడం వల్ల అదనపు ప్రయోజనం కలుగుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

### అధిక మోతాదులో వద్దు..

అయితే ఈ ఫలితాలను ఇప్పుడే తుది నిర్ణయంగా భావించరాదని పరిశోధకులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటివరకు చాలా తక్కువ మంది రోగులపైనే అధ్యయనం జరిగింది. మొత్తం 48 మంది రోగులతో ట్రయల్ పూర్తి చేసిన తర్వాతే స్పష్టమైన నిర్ధారణకు వచ్చే అవకాశం ఉంది. అలాగే ఈ ఫలితాలను మరింత పెద్ద స్థాయి అధ్యయనాల ద్వారా కూడా నిర్ధారించాల్సి ఉంది. అధిక మోతాదులో విటమిన్ బి3 తీసుకోవడం పూర్తిగా సురక్షితం కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎక్కువ మోతాదులో నియాసిన్ వల్ల కాలేయానికి నష్టం, జీర్ణ సంబంధిత సమస్యలు, ఇతర దుష్ప్రభావాలు వచ్చే అవకాశం ఉంటుంది. అందువల్ల వైద్యుల సలహా లేకుండా అధిక మోతాదులో విటమిన్ బి3 సప్లిమెంట్లు తీసుకోవడం ప్రమాదకరమని సూచిస్తున్నారు. ప్రస్తుతం ఈ పరిశోధనలు ఆశాజనకంగా ఉన్నప్పటికీ, గ్లియోబ్లాస్టోమా చికిత్సలో దీనిని సాధారణ వైద్య విధానంగా పరిగణించడానికి మరింత శాస్త్రీయ ఆధారాలు అవసరమని నిపుణులు పేర్కొంటున్నారు.

## ప్రజాప్రతినిధికి తప్పని అవమానం


- **సర్పంచ్ భర్త,కుమారుడిపై కేసు నమోదు.**



పెద్దపల్లి జిల్లా/పెద్దపల్లి టౌన్ /జూన్ 27/ అక్షరం న్యూస్ –:
పెద్దపల్లి మండలం పెద్దకల్వల గ్రామ పంచాయతీలో ప్రజా ప్రతినిధులకే రక్షణ లేని పరిస్థితులు నెలకొన్నాయని, అభివృద్ధిని ప్రశ్నించినందుకు వార్డ్ సభ్యుడిపై సర్పంచ్ భర్త, కుమారుడు దౌర్జన్యానికి దిగారంటూ 5వ వార్డ్ సభ్యుడు బోలం వినయ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.ఈ మేరకు శనివారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో ప్రెస్ నోట్ ద్వారా వివరాలను వెల్లడించారు.ఈ నెల 1న జరిగిన గ్రామ పంచాయతీ జనరల్ బాడీ సమావేశంలో గ్రామాభివృద్ధి పనులు మరియు భోజన్న చెరువుకు సంబంధించిన ప్రజా సమస్యలను తాను చర్చకు పెట్టానని వినయ్ తెలిపారు. ఈ క్రమంలో, ఎటువంటి అధికారిక హోదా లేని గ్రామ సర్పంచ్ భర్త నర్ల పోల్ రాజ్ మరియు వారి కుమారుడు నర్ల సాయి సమావేశంలోకి దూరి,తనను అడ్డుకోవడమే కాకుండా భయభ్రాంతులకు గురి చేశారని ఆయన ఆరోపించారు.కేవలం తనను మాత్రమే కాకుండా,సమావేశంలో విధుల్లో ఉన్న ప్రభుత్వ అధికారులను కూడా వారు అత్యంత అసభ్య పదజాలంతో దూషించారని,అంతటితో ఆగకుండా రాష్ట్ర మహిళా మంత్రి సీతక్క మరియు స్థానిక శాసనసభ్యుడిని సైతం వారు అవమానకరంగా మాట్లాడారని పేర్కొన్నారు.ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహిస్తున్న సమావేశంలో సర్పంచ్ కుటుంబ సభ్యుల తీరుపై వినయ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.ఈ ఘటనపై వెంటనే స్పందించిన బాధితుడు వినయ్ పెద్దపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు.ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు,నర్ల పోల్ రాజ్ మరియు నర్ల సాయిలపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు వినయ్ తెలిపారు.ప్రజా ప్రతినిధులపై దాడులకు పాల్పడటం,అధికారుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టని,ఇలాంటి వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని బోలం వినయ్ డిమాండ్ చేశారు

## ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేయాలి

- **మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్**



పెద్దపల్లి జిల్లా /పెద్దపల్లి టౌన్ /జూన్ 27/ అక్షరం న్యూస్ –:
తెలంగాణ ప్రభుత్వం చెప్పట్టిన కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే మరియు స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఆదేశాల మేరకు వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ పెద్దపల్లి మున్సిపల్ పరిధిలో గల 17 వ వార్డు సందర్శించి నూతనంగా వేయబడుతున్న రోడ్లను పరిశీలించి వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు, అలాగే స్థానిక సానిటేషన్ సమస్యలను గుర్తించి వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు, 17వ వార్డులో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు అనంతరం కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ఎన్యుయేషన్ ఫామ్ పంపిణీ వేగవంతం చేయాలని బూత్ లెవల్ అధికారులను ఆదేశించారు, అలాగే ఓపెన్ ప్లాట్ల లో చెత్త వేయకుండ యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు లేనిచోట ప్రకారమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో 17 వ కౌన్సిలర్ ఫణీందర్, మున్సిపల్ సిబ్బంది రమాకాంత్, చరణ్, రాజు, అనిల్, స్థానిక నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## స్మోకింగ్ జోన్లపై పెద్దపల్లి పోలీసుల మెరుపు దాడులు




పెద్దపల్లి జిల్లా /పెద్దపల్లి టౌన్/ జూన్ 27/ అక్షరం న్యూస్ –:
పెద్దపల్లి పట్టణంలోని బహిరంగ ధూమపాన కేంద్రాలు స్మోకింగ్ జోన్లు లక్ష్యంగా శనివారం పెద్దపల్లి పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో టౌన్, రూరల్ పోలీసు బృందాలు ఏకకాలంలో పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టాయి. ఈ సందర్భంగా బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తున్న పలువురికి" కోప్టా చట్టం ప్రకారం జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా సీఐ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, కోప్టా చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ధూమపాన ఉత్పత్తుల విక్రేతలు, దుకాణాల యజమానులకు చట్టంలోని నిబంధనలపై అవగాహన కల్పిస్తూ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇకపై బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేసే వారిపైనా, నిబంధనలకు విరుద్ధంగా స్మోకింగ్ జోన్లు నిర్వహించే వారిపైనా కోప్టా చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో టౌన్ ఎస్ఐ కె. నరేష్, రూరల్ ఎస్ఐ మధుకర్, ఎస్ఐ నరేష్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

## ప్రతి ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాలు అందించాలి

- **పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**



పెద్దపల్లి జిల్లా /పెద్దపల్లి టౌన్ /జూన్ 27/ అక్షరం న్యూస్ –:
ఓటరు నమోదు ప్రత్యేక సవరణ ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా జూలై 3లోపు అర్హులైన ప్రతి ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం పెద్దపల్లి పట్టణంలోని 4వ వార్డు ప్రగతి నగర్‌లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ఓటరు నమోదు ఆన్‌లైన్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఫారాల పంపిణీ, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోపు ప్రతి అర్హ ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారం అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో బీఎల్‌వోలకు గ్రామ పంచాయతీ కార్యదర్శులు, పట్టణ ప్రాంతాల్లో బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులు పూర్తి సహకారం అందించి ఫారాల పంపిణీని వేగవంతం చేయాలని తెలిపారు. ప్రతి ఓటరుకు రెండు ఎన్యూమరేషన్ ఫారాలు అందించాలని, ఒక ఫారాన్ని ఓటరు వివరాలతో నింపించి స్వీకరించడంతో పాటు, మరో ఫారంపై స్వీకరణ ధృవీకరణ చేసి రసీదుగా ఓటరికి తిరిగి అందజేయాలని ఆదేశించారు. ఈ ప్రక్రియను పారదర్శకంగా, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి ఇంటికి చేరుకొని ప్రతి అర్హ ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారం అందేలా అధికారులు, బీఎల్‌వోలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో పెద్దపల్లి తహసీల్దార్ రాజయ్య, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

## కిడ్నీ సమస్యలు ఉన్నాయా? అయితే ఈ ఆహార పదార్థాలకు దూరంగా ఉండాల్సిందే!



మన శరీరంలోని వ్యర్థాలను వడబోసి, రక్తాన్ని శుద్ధి చేయడంలో కిడ్నీలు (మూత్రపిండాలు) కీలక పాత్ర పోషిస్తాయి. అయితే, కిడ్నీలు బలహీనపడినప్పుడు అవి సోడియం, పొటాషియం, ఫాస్ఫరస్ వంటి ఖనిజాలను సమర్థవంతంగా బయటకు పంపలేవు. అటువంటి సమయంలో మనం తీసుకునే ఆహారం కిడ్నీలపై అదనపు భారం పడకుండా చూసుకోవాలి. ముఖ్యంగా కిడ్నీ సమస్యలు ఉన్నవారు ఏయే ఆహారాలకు దూరంగా ఉండాలో ఇప్పుడు తెలుసుకుందాం.

1.ఉప్పు, సోడియం అధికంగా ఉండే పదార్థాలు: కిడ్నీ సమస్యలు ఉన్నప్పుడు ఉప్పు(సోడియం) వాడకాన్ని తగ్గించాలి. ఆహారంలో ఉప్పు ఎక్కువగా ఉంటే అది రక్తపోటును పెంచి కిడ్నీలపై అదనపు ఒత్తిడిని కలిగిస్తుంది. అలాగే, నిల్వ ఉంచిన పచ్చళ్లు, అప్పడాలు, చిప్స్, ప్యాక్ చేసిన స్నాక్స్, జంగ్ ఫుడ్ వంటి వాటికి దూరం ఉంచితే మంచిది. వంటల్లో ఉప్పును సాధ్యమైనంత వరకు తగ్గించుకోవడం మంచిది.

2.పొటాషియం ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాయలు: అరటిపండ్లు, నారింజ, కివీ, కర్బూజ వంటి పండ్లలో పొటాషియం అధికంగా ఉంటుంది. అలాగే, ఎండు ద్రాక్ష, ఖర్జూరం వంటి ఎండిన పండ్లను పరిమితం చేయాలి. బంగాళదుంపలు, చిలకడదుంపలు, టమోటాలు, పాలకూరలో పొటాషియం ఎక్కువగా ఉంటుంది. వీటిని నీళ్లలో ఉడకబెట్టి ఆ నీటిని పారబోసి వండుకోవడం మంచింది.

3.ఫాస్ఫరస్ అధికంగా ఉండే డైరీ ఉత్పత్తులు: కిడ్నీలు సరిగ్గా పనిచేయనప్పుడు రక్తంలో ఫాస్ఫరస్ పేరుకుపోతుంది, ఇది ఎముకల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. పాలు, పెరుగు, జున్ను, పన్నీర్ వంటి పదార్థాలను వైద్యుల సలహా మేరకు చాలా తక్కువగా తీసుకోవాలి. అలాగే ముదురు రంగులో ఉండే సోడా పానీయాలకు పూర్తిగా మానేయాలి.

4.ప్రాసెస్ చేసిన మాంసం: బేకన్, సాసెజ్, నిల్వ ఉంచిన మాంసాలలో ఉప్పుతో పాటు ఇతర ప్రిజర్వేటివ్స్ అధికంగా ఉంటాయి. ఇవి కిడ్నీలపై తీవ్రమైన ఒత్తిడిని కలిగిస్తాయి. సూప్స్, నూడుల్స్ లో సోడియం అధికంగాఉంటుంది. ఫ్లేవర్ కోసం కలిపిన ఆర్టిఫిషియల్ కెమికల్స్ ఉంటాయి. ఇందులో సోడియం లెవెల్స్ అధికంగా ఉంటాయి. సోడియం పెరిగే కొద్దీ కిడ్నీలపై ఒత్తిడి పెరుగుతుంది.

5. ధాన్యం: గోధుమ రొట్టెలు, బ్రౌన్ రైస్ ఆరోగ్యానికి మంచివే అయినా, వీటిలో ఫాస్ఫరస్, పొటాషియం వంటి ఖనిజాలు అధికంగా ఉంటాయి. సాధ్యమైనంత వరకు ఈ రైస్‌ను కిడ్నీ వ్యాధిగ్రస్తులు డైట్‌లో చేర్చుకోకూడదు. వేరుశనగలు, జీడిపప్పు, బాదం, కొన్ని రకాల పప్పుల్లో ఫాస్ఫరస్ అధికంగా ఉంటుంది.

## రాత్రంతా ధనియాలు నానబెట్టి ఉదయాన్నే ఆ నీళ్లు తాగండి..

- **ఆరోగ్యానికి ఎంత మంచిదో తెలుసా..?**



వంటింట్లో ఉండే రకరకాల మసాలా దినుసుల్లో ధనియాలు కూడా ప్రధానమైనవి. దాదాపు అన్ని రకాల వంటకాల్లో ధనియాలను సువాసన కోసం వినియోగిస్తుంటారు. ధనియాల్లోని ఔషధ గుణాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అందుకే మన పూర్వీకులు ధనియాలను ఆహారంలో భాగం చేశారు. అయితే ధనియాలను కేవలం వంటల్లో ఉపయోగించడం ద్వారా మాత్రమే కాకుండా.. ఔషధంగా కూడా వినియోగించవచ్చు. ధనియాలను రాత్రంతా నీళ్లలో నానబెట్టి ఆ నీళ్లను ఉదయాన్నే తాగితే ఎన్నో ప్రయోజనాలు ఉంటాయట. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం..

### ప్రయోజనాలు..

ప్రతిరోజు ఉదయం నానబెట్టిన ధనియాల నీటిని తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఫ్రీ రాడికల్స్‌కి వ్యతిరేకంగా పోరాడుతాయి. ఇమ్యూనిటీ వ్యవస్థను బలపరుస్తాయి. ఆరోగ్య నిపుణులు తెలిపిన ప్రకారం.. బరువు తగ్గాలనుకునే వారికి ఈ ధనియాల నీళ్లు ఎంతో మేలు చేస్తాయి. ధనియాల నీటితో జీవక్రియ మెరుగవుతుంది. జీర్ణ సంబంధిత సమస్యలకు చెక్ పెట్టొచ్చు. తీసుకున్న ఆహారం బాగా జీర్ణమవుతుంది. ధనియాల్లో విటమిన్ కె, విటమిన్ సి, విటమిన్ ఎ పుష్కలంగా లభిస్తాయి. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడంవల్ల జుట్టు ఆరోగ్యానికి ఎంతో మంచిది. ప్రతి రోజు ధనియాలు నానబెట్టిన నీటిని తీసుకుంటే జుట్టు రాలుడు సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. డయాబెటిస్ బాధితులకు కూడా ధనియాల నీరు ఎంతో ఉపయోగపడుతుంది. ముఖ్యంగా రక్తంలో షుగర్ లెవల్స్ ఎక్కువగా ఉండేవారు ప్రతి రోజూ ఉదయం నానబెట్టిన ధనియాల నీటిని తీసుకుంటే షుగర్ లెవల్స్ అదుపులో ఉంటాయి. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులైన జలుబు, దగ్గు లాంటి సమస్యలు దరిచేరకుండా ఉండాలంటే రోజూ ధనియాల నీటిని తాగాలని నిపుణులు సూచిస్తున్నారు. కిడ్నీ సమస్యలతో బాధపడే వారికి కూడా ధనియాల నీరు బాగా ఉపయోగపడుతుంది. ముఖ్యంగా యూరినరీ ట్రాక్ ఇన్‌ఫెక్షన్ సమస్యలు ఉన్నవారు కూడా ధనియాల నీటిని రోజూ పరగడుపున తీసుకోవాలి.

## వేసవి కదా అని కూల్ డ్రింక్స్‌ను అధికంగా తాగుతున్నారా..

- **అయితే ఏం జరుగుతుందో తెలుసా..**



వేసవి వేడి ప్రజలకు చల్లటి పానీయాలను తాగాలనే కోరిక కలిగిస్తుంది. ముఖ్యంగా తీపి రుచి, గ్యాస్ కలిగిన సాఫ్ట్ డ్రింక్స్ తాగడం ద్వారా వెంటనే దాహం తగ్గినట్లు అనిపిస్తుంది. అందుకే వేసవిలో సాఫ్ట్ డ్రింక్స్ వినియోగం గణనీయంగా పెరుగుతుంది. అయితే వీటిలో ఉండే అధిక చక్కెర, కెఫీన్ వంటి పదార్థాలు అలవాటుగా మారే ప్రమాదం ఉంది. పరిశోధనల ప్రకారం, ఈ పానీయాలను తరచుగా తీసుకోవడం దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. సాఫ్ట్ డ్రింక్స్‌లో ఉండే అధిక ఫ్రుక్టోజ్ శరీరంలో ఇన్సులిన్ రెసిస్టెన్స్‌కు దారితీస్తుంది. ఇది టైప్–2 డయాబెటిస్‌కు ముందస్తు సంకేతంగా పరిగణించబడుతుంది. అదనంగా, అధిక చక్కెర లివర్‌లో కొవ్వుగా మారి నాన్–ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ సమస్యను కలిగించే అవకాశం ఉంది. దంతాల ఆరోగ్యంపైనా ఇవి ప్రతికూల ప్రభావం చూపుతాయి. సోడాలో ఉండే ఫాస్ఫారిక్, కార్బోనిక్ యాసిడ్లు దంతాల పైపొరను దెబ్బతీసి దంతాలు పుచ్చిపోవడానికి కారణమవుతాయి. అలాగే ఇవి కాల్షియం శోషణను తగ్గించి ఎముకలను బలహీనపరచి ఆస్టియోపోరోసిస్ ప్రమాదాన్ని పెంచుతాయి.

### అనేక విధాలుగా ప్రభావం..

సాఫ్ట్ డ్రింక్స్‌లో పోషక విలువలు చాలా తక్కువగా ఉంటాయి. ఇవి కేవలం ఎంప్టీ కాలరీలు మాత్రమే ఇస్తాయి. ఫలితంగా, శరీరానికి అవసరమైన పోషకాలు అందకుండా అదనపు కాలరీలు చేరి అస్వస్థకరమైన ఆహార అలవాట్లకు దారితీస్తాయి. అదేవిధంగా, లిక్విడ్ కాలరీలు తృప్తి కలిగించకపోవడంతో మరింత ఆహారం తీసుకునే అవకాశం ఉంటుంది. దీని వల్ల బరువు పెరగడం, ఊబకాయం, గుండె సంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. సాఫ్ట్ డ్రింక్స్‌లో కెఫీన్ అధికంగా ఉంటుంది. కెఫీన్ అధికంగా ఉండే సాఫ్ట్ డ్రింక్స్ ను ఎక్కువగా తీసుకోవడం వల్ల గుండె వేగం పెరగడం, ఆందోళన, నిద్రలేమి వంటి సమస్యలు తలెత్తవచ్చు. ముఖ్యంగా రాత్రి సమయంలో వీటిని తీసుకోవడం నిద్ర నాణ్యతను దెబ్బతీస్తుందని వైద్యులు చెబుతున్నారు. వేసవిలో వీటిని తాగడం వల్ల డీహైడ్రేషన్ సమస్య కూడా రావచ్చు.

కెఫీన్, చక్కెర మూత్ర విసర్జనను పెంచి శరీరంలో నీటి శాతం తగ్గించే అవకాశం ఉంది. ఇక గుండె ఆరోగ్యంపై కూడా వీటి ప్రభావం ఉంటుంది. ప్రతిరోజూ చక్కెర పానీయాలు తీసుకునే మహిళల్లో గుండె జబ్బుల ప్రమాదం దాదాపు 20 శాతం వరకు పెరుగుతుందని ఒక అధ్యయనం చెబుతోంది. రక్తపోటు, ట్రైగ్లిజరైడ్స్ పెరగడం వంటి సమస్యలు కూడా గమనించవచ్చు. అధికంగా సాఫ్ట్ డ్రింక్స్ తీసుకోవడం కిడ్నీలపై ఒత్తిడిని పెంచుతుంది. వీటిలో ఫాస్ఫారిక్ యాసిడ్ అధికంగా ఉండటం వల్ల కిడ్నీ స్టోన్స్, దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధుల ప్రమాదం పెరుగుతుంది. కనుక వేసవిలో సాఫ్ట్ డ్రింక్స్ ను తీసుకోకపోవడమే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

# సీషెల్స్ పర్యటనలో వృద్ధ తాబేలును చూడనున్న మోడీ



న్యూఢిల్లీ,జూన్27 హిందూ మహాసముద్ర ద్వీపం సీషెల్స్‌లో వచ్చే వారం ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఆ పర్యటన వేళ ఆయన అక్కడ నేషనల్ బోటానికల్ గార్డెన్స్‌ను సందర్శించనున్నారు. షెడ్యూల్ ప్రకారం ఆయన అక్కడ ఓ వృక్షాన్ని నాటనున్నారు. భారత్, సీషెల్స్ మధ్య 50 ఏళ్ల దౌత్య బంధానికి ప్రతీకగా ప్రధాని మోదీ ఈ పర్యటన చేపట్టనున్నారు. సీషెల్స్ జాతీయ దినోత్సవ సంబరాల్లో మోదీ గౌరవ అతిథిగా పాల్గొంటారు. ఇక ప్రపంచంలో ప్రాణాలతో ఉన్న అతి వృద్ధ జంతువును కూడా ప్రధాని మోదీ దర్శించుకోనున్నారు. 1832లో పుట్టిన తాబేలును ఆయన వీక్షించనున్నారు. ఆ తాబేలు పేరు జోనాథన్. ఇప్పుడు అది సుమారు 194 ఏళ్లు ఉంటుందని గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అంచనా వేసింది. సుమారు రెండు శతాబ్దాలకు చేరుకున్న ఆ జంతువు ఎన్నో చరిత్రాత్మక సందర్భాలకు సాక్షీగా నిలిచింది. వయసు మీరినా ఆ తాబేలు మాత్రం ఆరోగ్యకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. వెటరర్నీ డాక్టర్లు దాని ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పరీక్షిస్తున్నారు. అయితే వయసు రీత్యా ఆ తాబేలుకు కంటి చూపు మందగించింది. వాసన గుర్తుపట్టే గుణాన్ని కూడా కొంత కోల్పోయినట్లు తెలుస్తోంది.

# హైదరాబాద్‌లో డోనాల్డ్ ట్రంప్ అవెన్యూ

### భారత్‌కు కృతజ్ఞతలు అంటూ ట్రూత్‌తో ట్రంప్ వెల్లడి

వాషింగ్టన్,జూన్27 భారత్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ పక్కనున్న రహదారికి 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ' అని పేరు పెట్టిన నేపథ్యంలో ఆయన స్పందించారు. 'ఈ విధంగా గౌరవం పొందిన అమెరికా తొలి అధ్యక్షుడిని నేను. ధన్యవాదాలు భారత్' అంటూ ఆయన తన సామాజిక మాధ్యమ వేదిక 'ట్రూత్'లో పోస్టు చేశారు. అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 23న హైదరాబాద్‌లో ఓ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్ పక్కన ఉన్న రోడ్డుకు 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ'గా నామకరణం చేశారు. ఆ ప్రత్యేక ఫలకాన్ని అమెరికా రాయబారి సెర్గియో గోర్‌తో కలిసి తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఆవిష్కరించారు.మెరికాకు చెందిన కీలక టెక్ కంపెనీలు అయిన మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్‌లు ఈ రోడ్డుకు దగ్గర్లోనే ఉన్నాయి. ఈ పేరు మార్పును తెలంగాణ ప్రభుత్వం భారత్-అమెరికా సంబంధాలకు గుర్తింపుగా, అలాగే హైదరాబాద్ అంతర్జాతీయ సాంకేతిక కేంద్రంగా ఎదుగుతున్న నేపథ్యంలో తీసుకున్న ప్రతీకాత్మక నిర్ణయంగా పేర్కొంది. ఈ నేపథ్యంలో ట్రంప్ ధన్యవాదాలు తెలియజేశారు.

# బస్వాపూర్ గ్రామ శివారులో చిరుత సంచారం

### మేకను ఎత్తుకెళ్లిందంటున్న గ్రామస్థులు

నిజామాబాద్,జూన్ 27: జుక్కల్ మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామ శివారులో చిరుత సంచారం కలకలం రేపింది. గ్రామ శివారులో మేత మేస్తున్న గొర్రెల గుంపులోకి వచ్చిన చిరుత.. ఓ మేకపిల్లను ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ ఘటనతో అప్రమత్తమైన స్థానికులు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఫారెస్ట్ అధికారులు అక్కడ కనిపించిన అడుగుజాడలను పరిశీలించి అవి చిరుత పాదాలేనని నిర్ధారించారు. ఈ నేపథ్యంలో రైతులు, పశువుల కాపరులు, గ్రామ ప్రజలు ఒంటరిగా పొలాలు, అటవీ ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో అప్రమత్తంగా ఉండాలని, చిరుత కనిపించినా లేదా ఆనవాళ్లు గుర్తించినా వెంటనే అటవీ శాఖకు సమాచారం ఇవ్వాలని కోరారు. గ్రామ పరిసరాల్లో చిరుత సంచారం నేపథ్యంలో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. అటవీ శాఖ అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైతే చిరుతను బంధించేందుకు తగిన చర్యలు చేపడతామని తెలిపారు.

# అమీనాపూర్‌లో మహిళ, ఇద్దరు పిల్లలతో అదృశ్యం

నిజామాబాద్,జూన్ 27: వేల్పూర్ మండలం అమీనాపూర్‌లో మహిళ సహా ఇద్దరు చిన్నారులు అదృశ్యం కావడం తీవ్ర కలకలం రేపుతోంది. ఓ మహిళ తన కుమారుడు, కుమార్తెతో కలిసి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడం సంచలనం సృష్టిస్తోంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 25న వేల్పూర్‌కు వెళున్నట్లు చెప్పి ఇద్దరు పిల్లలతో సదరు మహిళ ఇంటి నుంచి వెళ్లిపోయింది. అయితే రాత్రి అయినా ఆమె ఇంటికి తిరిగి రాలేదు. మహిళ సెల్‌ఫోన్‌కు పలుమార్లు కాల్ చేసినా స్విచ్ఆఫ్ వస్తుండటంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఎంత వెతికినా ఎక్కడా ఆమె జాడ తెలియరాలేదు. దీంతో బంధువులు, పరిచయస్తుల వద్ద ఆరా తీసినా ప్రయోజనం లేకుండా పోయింది. చివరికి వేల్పూర్ పోలీసులను బాధిత కుటుంబ సభ్యులు ఆశ్రయించారు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మహిళ, చిన్నారుల ఆచూకీ కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. వివిధ కోణాల్లో విచారణ చేపట్టారు. వారి వివరాలు తెలిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని వేల్పూర్ పోలీసులు విజ్ఞప్తి చేశారు. కాగా, ఈ ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# కేతన్ మర్డర్ కేసులో రోజుకో కొత్త విషయం

చేతన్‌తో సియాగోయల్ ప్రేమకు క్రికెటే కారణం

ముంబై,జూన్27 పుణెకు చెందిన యువ వ్యాపారవేత్త కేతన్ అగర్వాల్ మర్డర్ కేసులో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది. తాజాగా, క్రికెట్ కోణం వెలుగులోకి వచ్చింది. కేతన్ హత్య కేసులో నిందితులైన సియా గోయల్, చేతన్ చౌదరీల మధ్య ప్రేమ చిగురించడానికి కారణం క్రికెట్ అని తెలుస్తోంది. సియా గోయల్ సోదరుడు సాహిల్ గోయల్‌ను పోలీసులు 10 గంటలకుపైగా విచారించారు. విచారణ సందర్భంగా గోయల్ పలు ఆసక్తికర విషయాలు బయటపెట్టినట్లు సమాచారం. ఆ వివరాల ప్రకారం..సాహిల్ క్రికెట్ మ్యాచ్‌లు ఆడేవాడు. క్రికెట్ మ్యాచ్‌లు చూడ్డానికి సియా తరచూ వెళుతుండేది. ఈ నేపథ్యంలోనే చేతన్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఓ సారి కామన్ ఫ్రెండ్స్ ఏర్పాటు చేసిన దివాళీ పార్టీలోనూ ఇద్దరూ కలిశారు. దీంతో ఇద్దరి మధ్యా స్నేహం బలపడి ప్రేమగా మారింది. సియా, చేతన్ ప్రేమించుకుంటున్న సంగతి సాహిల్‌కు తెలుసు. కేతన్‌తో సంబంధం మాట్లాడుతున్నపుడు సియా అభ్యంతరం వ్యక్తం చేస్తుందని సాహిల్ అనుకున్నాడు. కానీ, సియా అలా చేయలేదు. కేతన్ అంటే ఇష్టం లేనట్లు ఆమె అస్సలు ప్రవర్తించలేదు. కేతన్‌తో పెళ్లి కుదిరిన తర్వాత సియా.. చేతన్‌తో మాట్లాడటం కానీ, తిరగటం కానీ, సాహిల్ చూడలేదు. ఇవే విషయాలు సాహిల్ పోలీసులకు చెప్పాడు. పోలీసులు సియా, చేతన్‌ల కాల్ రికార్డ్స్ పరిశీలించగా.. జనవరి నెల నుంచి మర్డర్ జరిగిన తేదీ వరకు ఇద్దరూ 2 వేలకుపైగా ఫోన్ కాల్స్ చేసుకున్నట్లు గుర్తించారు. దాదాపు 238 గంటల పాటు ఇద్దరూ మాట్లాడుకున్నారు. అయితే, సియా లాయర్ మాత్రం సియా, చేతన్‌లు స్నేహితులు మాత్రమేనని అంటున్నాడు.

# ప్రజల్లో ప్రశ్నించే తత్వం చచ్చిపోయిందా ?

న్యూఢిల్లీ,జూన్27.. దృశ్యం సినిమాలో హీరో ఓ వ్యక్తిని చంపి మాయం చేస్తాడు. పోలీస్ అధికారి కొడుకైన అతడి ఆచూకీ కోసం పోలీసులు ఎంతగా ప్రయత్నించినా పట్టుకోలేక పోతారు. శవాన్నా మాయం చేసినా గుర్తించలేక పోతారు. ఆధారాలు లేకుండా చంపేసి, పోలీస్ స్టేషన్‌లోనే పాతిపెట్టినా కనిపెట్టలేక పోతారు. ఇప్పుడు అచ్చంగా ఇలాంటి కథే ఒకటి విజయవాడలో చోటుచేసుకుంది. సాయికృష్ణ కస్టోడియల్ డెత్ జరిగి దాదాపు నెలదాటినా ఆచూకీ కనిపెట్టడం లేదు. ఎందుకంటే మాయమైన వ్యక్తిపై రౌడీషీట్ ఉంది. అందులోనూ ఓ సామాన్యుడు. ఘనత వహించిన చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సాధించిన విజయమిది. జగన్ హయాంలోనూ ఓ డాక్టర్‌ను పిచ్చోడిని చేసి చంపారు. పిల్లలు మాయం అయ్యారు. పట్టించుకోలేదు. ఇకపోతే సాయికృష్ణ ఏమయ్యాడో అన్న సందర్భంలోనే తునిలో జ్ఞానేశ్వరి అనే ఓ చిన్నారి కూడా మాయం అయ్యింది. ఇప్పటికీ ఆమె ఆచూకీ కనుక్కోలేక పోయారు. నిజంగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నా ప్రజలు స్పందించడం లేదు. మనుషులు చస్తున్నా, మాయం అవుతున్నా సమాజాం ఎందుకో నిస్తేజంగా మారిపోయింది. హక్కుల గురించి మాట్లాడే నేతల నోళ్లు మూతపడ్డాయి. ఆందోళన చేసేవారు కనిపించడం లేదు. ఎర్రజెండాల వాళ్లకు ఏమయ్యిందో కనిపించడం లేదు. పౌరహక్కుల కోసం అంటూ మాట్లాడే వారు మాయం అయ్యారు. అన్యాయాలు జరుగుతున్నా ప్రజలు ప్రశ్నించే శక్తని కోల్పోయారు. ఈ మధ్యే పుట్టిన కాక్రోచ్ జనతా పార్టీ వారు కూడా ఎక్కడా కిమ్మనడం లేదు. కొందరు ఆ మధ్య హైదరాబాద్ లో తామంతా కాక్రోచ్ అంటూ బయలుదేరారు. విజయవాడలో కస్టోడియల్ డెత్‌కు గురయ్యాడంటూ సిట్ చెప్పినా సాయికృష్ణణ వ్యవహారం గురంచి ఒక్కరు కూడా మాట్లాడడం లేదు. రాజకీయ లబ్ది కోసం వైకాపా నేతలు మాట్లాడినా అది ప ఎద్దగా ప్రభావం చూపడం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో సాయకృష్ణ అనే వ్యక్తి ఇప్పటికీ కనిపించడం లేదు. పోలీసుల అదుపులో ఉన్న వ్యక్తిని కొట్టి చంపేశారు. చంపితే శవాన్ని ఇవ్వాలి. కానీ శవాన్ని ఇవ్వలేదు. మాయం చేశారు. కాల్చేశారా పాతరేశారా లేక కృష్ణానదిలో ఉన్న మొసళ్లకు ఆహారంగా వేశారా అన్ని తెలియదు. సిట్ మాత్రం కస్టోడియల్ డెత్ అంటూ కోర్టుకు నివేదించింది. అయితే మరి శవం ఏమయ్యిందనేదే ప్రశ్న. వియజవాడలో తీవ్ర సంచలనం సృష్టిస్తున్న సాయికృష్ణ మిస్సింగ్ కేసులో, తన కుమారుడు సాయి కృష్ణ చనిపోయాడని ధృవీకరిస్తూ సిఐ నాగరాజుపై చర్యలు తీసుకోవాలని ఈ నెల 19న అతని తల్లి విజయలక్ష్మి సీపీ రాజశేఖర్ బాబుకు ఫిర్యాదు చేసింది. పోలీసులు పట్టుకెళ్లినట్లు గుర్తించిన ఆమె సాయి కృష్ణ ఎక్కడున్నాడనే ప్రశ్నలకు తెరదించుతూ అతను చనిపోయడని తల్లి విజయలక్ష్మి తన ఫిర్యాదులో ధృవీకరించినట్టు తెలస్తోంది.

సిఐ నాగరాజు తన కుమారుడిని తన కళ్ళెదుటే కొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మే నెల మొదటి వారంలో సాయికృష్ణను పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారంట్‌తో కృష్ణలంక, మాచవరం పోలీసు స్టేషన్లో తీసుకొని వచ్చారని.. కృష్ణలంక స్టేషన్‌కు తెచ్చాకా సిఐ నాగరాజు తన కోడుకుని చంపేస్తాం దండ రెడీ చేసుకో అన్నారని ఆమె చెప్పుకొచ్చింది. అయితే సిఐ నాగరాజు సాయికృష్ణను మార్కాపురం నుంచి తీసుకొచ్చి కోర్టులో హాజరు పరచలేదని.. సాయి కృష్ణను అక్రమంగా నిర్బంధించి చిత్ర హింసలకు గురిచేసి తీవ్రంగా కొట్టారని ఆమె ఆరోపించింది. సిఐ నాగరాజు కొట్టిన దెబ్బలకు సాయి కృష్ణ చనిపోయాడని.. లాకప్ లో సాయి కృష్ణను కొట్టినప్పుడు అరుపులు కేకలు తాను విన్నానని ఆమె చెప్పుకొచ్చింది. తన కొడుకుని తనతో పంపమని అడిగితే.. తనపై సీఐ నాగరాజు గట్టిగా అరిచాడని ఆమె ఆరోపించింది. దీంతో ఏం చేయాలో తోచక తన చెల్లెలు ద్వారా హై కోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ ఫైల్ చేశామని.. సాయి కృష్ణ చనిపోయాడనే విషయం ఇబ్బందవుతుందని తన కుమారుడు శవాన్ని నామరూపాలు లేకుండా తగలబెట్టారని కూడా విజయలక్ష్మి ఫిర్యాదులో పేర్కొంది. సాయి కృష్ణను చంపి ఆధారాలు లేకుండా చేసిన సిఐ నాగరాజుపై చర్యలు తీసుకోవాలని విజయలక్ష్మి డిమాండ్ చేసింది. విజయలక్ష్మీ ఫిర్యాదు ఆధారంగా సిఐ నాగరాజుపై అక్రమంగా నిర్బంధించడం, ఆధారాలు ధ్వంసం చేయడం,హత్య చేసిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన పోలీసులు సాయికృష్ణ కస్టోడియల్ డెత్ చెందాడంటూ కోర్టుకు నివేదించారు. ఈ కేసు ప్రత్యేక విచారణ బృందం అధికారులు, నిందితుడైన సీఐ నాగరాజు రిమాండ్ రిపోర్టును విజయవాడ రెండవ అదనపు జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు సమర్పించారు. చట్టవిరుద్ధంగా నిర్బంధించడం, పోలీస్ స్టేషన్‌లోనే దారుణంగా థర్డ్ డిగ్రీ ప్రయోగించడం, ఆపై ఆధారాలు దొరకకుండా శవాన్ని తగలబెట్టి మాయం చేయడం వంటి విషయాలను సిట్ నిర్ధారించింది. పోలీసుల థర్డ్ డిగ్రీ వల్లే సాయికృష్ణ చనిపోయాడని, ఆ తరువాత మృతదేహాన్ని సీఐ నాగరాజు వేరే చోటుకు తరలించి దహనం చేశారని రిమాండ్ రిపోర్టులో తెలిపింది. డిజిటల్ సాక్ష్యాలను సైతం మాయం చేయడంతో పాటు విచారణలోనూ సహకరించలేదని సిట్ కోర్టుకు తెలిపింది. నిజంగా ఇంత జరిగినా సిఎం చంద్రాబు పెద్దగా స్పందించలేదు. సిట్ వేసి మిన్నకున్నారు. ఓ మహిళ హోంమంత్రిగా ఉన్నా ఓ తల్లికి న్యాయం జరగలేదు. సాయికృష్ణ రౌడీషీటర్ అయితే, కేసులు పెట్టి బొక్కలో తోయాలి. కానీ ఉగ్రవాదిని చంపినట్లు చంపేశారు. తగులబెట్టేశారు. ఆధారాలు మాయం చేశారు. ఇంత జరుగుతున్నా, పోరాటాల గడ్డ బెజవాడ కిమ్మనడం లేదు. ఎర్రజెండా పార్టీల నోళ్లు మూతలు పడ్డాయి. దీనిని ఓ కేసుగా పెద్దగా ఎవ్వరూ పరిగణించడం లేదని తేలింది. దీంతో ఎలాంటి సందేశాన్ని ఇవ్వాలనుకుంటున్నరో కూటమి పెద్దలు చెప్పాలి. ఓ వ్యక్తి కస్టోడియల్ డెత్ ఇప్పుడు సామాన్య వార్తగా మారడం విషాదం.

# ఆదానీ లంచం కేసులో ఫెడరల్ కోర్టు కీలక నిర్ణయం

### కేసు ఉపసంహరణకు నివేదిక ఇవ్వాలని జడ్జి ఆదేశం



న్యూయార్క్,జూన్27 బిలియనీర్ గౌతమ్ అదానీపై నమోదైన హై-ప్రొఫైల్ లంచం కేసులో అమెరికా ఫెడరల్ కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. అదానీతోపాటు ఇతర నిందితులపై ఉన్న క్రిమినల్ ఆరోపణలను తక్షణమే కొట్టివేసేందుకు ఫెడరల్ జడ్జి నిరాకరించారు. ఈ కేసును ఎందుకు ఉపసంహరించుకోవాలని అనుకుంటున్నారో తెలుపుతూ మరింత స్పష్టమైన, వివరణాత్మకమైన నివేదికను సమర్పించాలని అమెరికా జస్టిస్ డిపార్ట్‌మెంట్‌ను కోర్టు ఆదేశించింది. బ్రూక్లిన్ లోని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి నికోలస్ గరాఫిస్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. కేసును ఉపసంహరించుకోవాలంటూ మే 18న జస్టిస్ డిపార్ట్‌మెంట్ దాఖలు చేసిన పిటిషన్ చాలా క్లుప్తంగా, ఎలాంటి బలమైన కారణాలు లేకుండా ఉందంటూ ఆయన అసంతృప్తి వ్యక్తంచేశారు. కేసును ఎందుకు డ్రాప్ చేయాలనుకుంటున్నారో సరైన ఆధారాలు, కారణాలతో కూడిన నివేదికను జూలై 13 లోగా కోర్టుకు సమర్పించాలని ప్రాసిక్యూటర్లను ఆదేశించారు. భారత్‌లో సౌర విద్యుత్ ప్రాజెక్టుల ఆమోదం కోసం ప్రభుత్వ అధికారులకు వందల మిలియన్ డాలర్ల లంచాలు ఇవ్వడానికి ప్రయత్నించారని, అలాగే అమెరికా ఇన్వెస్టర్లను తప్పుదోవ పట్టించారని గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు సాగర్ అదానీపై 2024లో అమెరికాలో కేసు నమోదైంది. అయితే ఈ ఆరోపణలను అదానీ గ్రూప్ మొదటి నుంచీ తీవ్రంగా ఖండిస్తూ వస్తోంది. మే నెలలో ట్రంప్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఈ కేసుపై మరింత సమయం, వనరులను కేటాయించలేమని పేర్కొంటూ కేసును పూర్తిగా ఉపసంహరించుకోవాలని జస్టిస్ డిపార్ట్‌మెంట్ భావించింది. జూన్ 24న అదానీ తరపు న్యాయవాదులు కూడా ఈ కేసు అమెరికా అధికార పరిధిలోకి రాదని, లంచం ఇచ్చినట్లు నిరూపించడానికి తగిన ఆధారాలు లేవని పేర్కొంటూ కేసును అధికారికంగా కొట్టివేయాలని కోర్టును కోరారు. అయితే దీనిపై తుది నిర్ణయం తీసుకునే ముందు ప్రభుత్వం నుంచి పూర్తి వివరణ కావాలని న్యాయమూర్తి స్పష్టంచేశారు. ఈ క్రిమినల్ కేసు పక్రియ ఇలా ఉండగా.. దీనికి సమాంతరంగా నడుస్తున్న సివిల్ వివాదాల పరిష్కారానికి అదానీ గ్రూప్ అంగీకరించింది. ఇందులో భాగంగా గౌతమ్ అదానీ 6 మిలియన్ డాలర్లు, సాగర్ అదానీ 12 మిలియన్ డాలర్ల మేర సివిల్ సెటిల్‌మెంట్ కింద చెల్లించే ప్రతిపాదనలు కోర్టు అనుమతి కోసం వేచి ఉన్నాయి. ఇవి కాకుండా ఇరాన్ నుంచి ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ దిగుమతులకు సంబంధించి అమెరికా ఆంక్షలను ఉల్లంఘించారనే ఆరోపణల పరిష్కారానికిగాను అదానీ ఎంటర్‌ప్రైజెస్ అమెరికా ట్రెజరీకి 275 మిలియన్ డాలర్లు చెల్లించడానికి ఒప్పుకుంది.


# రెండేళ్లలో 500 నగరాలకు భారత్ ట్యాక్సీ సేవల

### గుజరాత్‌లో ట్యాక్సీ సేవలు ప్రారంభించిన అమిత్ షా

గాంధనగర్,జూన్27 రెండేళ్లల్లో 500 నగరాలకు ఈ ట్యాక్సీ సేవలు విస్తరిస్తాయని హోం మంత్రి అమిత్ షా చెప్పారు. గుజరాత్‌లో తాజాగా భారత్ ట్యాక్సీ సేవలను ఆయన ప్రారంభించారు. కోఆపరేటివ్ మోడల్‌లో డ్రైవర్లే భాగస్వాములుగా ఉండే ఈ యాప్ ప్రారంభ వేడుకల్లో హోం మంత్రి ప్రసంగిస్తూ ట్యాక్సీ సేవలు ప్రస్తుతం నిత్యావసరంగా మారాయని అన్నారు. భారత్ ట్యాక్సీలో ఇలాంటి శ్రమదోపిడీ ఉండదని హోం మంత్రి హామీ ఇచ్చారు. ఒక న్యాయమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని అన్నారు. ఇటీవల కాలంలో ఈ రంగం గణనీయంగా విస్తరించిందని అన్నారు. ప్రస్తుతం ద్విచక్రవాహనాలు కూడా బైక్ ట్యాక్సీలుగా కుంభమేళా లాంటి భారీ ఈవెంట్స్‌లో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా ప్రైవేటు రైడ్ హెయిలింగ్ యాప్స్‌పై కూడా విమర్శలు గుప్పించారు. కార్పొరేట్ యాప్‌లు ఒక క్రమపద్ధతితో శ్రమదోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. రవాణా ఆపరేటర్లను డ్రైవర్లుగా పిలవడం కంటే సారథులని పిలుస్తానని చెప్పారు. ప్రైవేటు ఆపరేటర్లే అధిక శాతం లాభాలు దండుకుని వర్కర్లను వేధించిన ఘటనలు ఉన్నాయని అన్నారు. వినియోగదారులు, డ్రైవర్లకు ఎలాంటి నష్టం చేకూర్చని వ్యవస్థ ఇదేనని అన్నారు. ఇప్పటికే 7 లక్షల మంది డ్రైవర్లు ఈ యాప్‌లో భాగస్వాములయ్యారని అన్నారు. సుస్థిర ఆర్థిక భద్రతను సొంతం చేసుకున్నారని అన్నారు. భారత్ ట్యాక్సీలో రేట్లు ఎక్కువగా ఉన్నాయన్న వాదనలను కూడా హోం మంత్రి కొట్టిపారేశారు. ప్రత్యర్థి యాప్‌లు కావాలనే వ్యూహాత్మకంగా తమ ధరలను తగ్గిస్తున్నాయని కూడా హోం మంత్రి ఆరోపించారు. ఈ యాప్‌ను మార్కెట్ నుంచి తప్పించేందుకు ఈ వ్యూహాన్ని అమలు చేస్తున్నారని ఆరోపించారు. 'వాళ్లు ఇలా ఎంతకాలం చేయగలరు? భారత్ ట్యాక్సీ అలసిపోదు, యుద్ధ మైదానాన్ని వీడదు. నిలిచి పోరాడుతుంది. విజయం సాధిస్తుంది' అని అన్నారు. భారత్ ట్యాక్సీ దీర్ఘకాలిక అభివృద్ధికి సారథులు (డ్రైవర్లు), వినియోగదారులే బాధ్యులని అన్నారు. ఇతర కోఆపరేటివ్ సంస్థలు విజయం సాధించిన వైనాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు.



## ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నవారు తీవ్రమైన వ్యాయామం చేయకూడదు..?



వ్యాయామం ఆరోగ్యానికి అత్యంత మేలు చేస్తుందని వైద్య నిపుణులు ఎప్పటికప్పుడు చెబుతుంటారు. క్రమం తప్పకుండా శారీరక శ్రమ చేయడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడటంతోపాటు రక్తపోటు నియంత్రణలో ఉండటం, బరువు తగ్గడం, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదం తగ్గుతుంది. అయితే అత్యంత తీవ్రమైన వ్యాయామాలు చేసే సమయంలో కొందరిలో అరుదుగా స్ట్రోక్ ప్రమాదం తాత్కాలికంగా పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఇప్పటికే గుండె లేదా రక్తనాళాలకు సంబంధించిన సమస్యలు ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. అధిక తీవ్రతతో వ్యాయామం చేసే సమయంలో గుండె వేగంగా కొట్టుకోవడంతోపాటు రక్తపోటు కూడా గణనీయంగా పెరుగుతుంది. సాధారణంగా ఆరోగ్యంగా ఉన్నవారికి ఇది పెద్ద సమస్య కాకపోయినా, నియంత్రణలో లేని అధిక రక్తపోటు, గుండె రిథమ్ లోపాలు, మధుమేహం లేదా రక్తనాళాల వ్యాధులు ఉన్నవారిలో ఈ మార్పులు స్ట్రోక్ ప్రమాదాన్ని తాత్కాలికంగా పెంచే అవకాశాలు ఉంటాయి.

### హైబీపీ, ఎట్రియల్ ఫైబ్రిలేషన్, డయాబెటిస్ ఉంటే..

ముఖ్యంగా నియంత్రణలో లేని హైబీపీ, ఎట్రియల్ ఫైబ్రిలేషన్ (గుండె అసమాన స్పందనలు), మధుమేహం, ధూమపానం చేసే అలవాటు, ఇప్పటికే గుండె జబ్బులు ఉన్నవారు, గతంలో స్ట్రోక్ లేదా ట్రాన్సియెంట్ ఇస్కీమిక్ అటాక్ (టీఐఏ) వచ్చినవారు తీవ్రమైన వ్యాయామాలు ప్రారంభించే ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇలాంటి వారిలో రక్తప్రసరణలో ఆకస్మిక మార్పులు ఏర్పడి మెదడుకు రక్తం సరఫరా చేసే ధమనుల్లో గడ్డకట్టడం వల్ల ఇస్కీమిక్ స్ట్రోక్ లేదా అరుదుగా మెదడులో రక్తస్రావం జరిగే హీమరేజిక్ స్ట్రోక్ సంభవించే అవకాశం ఉంటుంది. దీర్ఘకాలం కొనసాగే ఎండ్యూరెన్స్ వ్యాయామాలు చేసే అథ్లెట్లలో ఎట్రియల్ ఫైబ్రిలేషన్ వచ్చే అవకాశం కొద్దిగా ఎక్కువగా ఉంటుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఈ గుండె స్పందన లోపం చికిత్స లేకుండా ఉంటే స్ట్రోక్ ప్రమాదం కూడా పెరుగుతుంది. అంతేకాకుండా ఎక్కువసేపు వ్యాయామం చేయడం వల్ల శరీరంలో నీటి కొరత, ఎలక్ట్రోలైట్ అసమతుల్యత ఏర్పడటం కూడా ఈ ప్రమాదాన్ని మరింత పెంచుతుంది.

### ఈ సందర్భాల్లో శరీరంపై ఒత్తిడి..

మారథాన్ పరుగు, సుదూర సైక్లింగ్, ట్రయాథ్లాన్, అల్ట్రా ఎండ్యూరెన్స్ పోటీల్లో పాల్గొనే వారు శరీరంపై అధిక ఒత్తిడిని కలిగిస్తారు. అందువల్ల తగినంత నీరు తాగడం, అవసరమైన లవణాలను భర్తీ చేసుకోవడం, ఆరోగ్య పరిస్థితిని క్రమం తప్పకుండా పరీక్షించుకోవడం చాలా అవసరం. అయితే ఈ అరుదైన ప్రమాదాల కారణంగా వ్యాయామాన్ని పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. వాస్తవానికి క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల స్ట్రోక్, గుండెపోటు, ఊబకాయం, మధుమేహం వంటి అనేక సమస్యల ప్రమాదం గణనీయంగా తగ్గుతుంది. అందువల్ల మితమైన లేదా శక్తివంతమైన వ్యాయామం చేసే అలవాటు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ప్రస్తుత మార్గదర్శకాల ప్రకారం పెద్దలు వారానికి కనీసం 150 నిమిషాలు మితమైన తీవ్రతతో లేదా 75 నిమిషాలు అధిక తీవ్రతతో వ్యాయామం చేయాలి. వేగంగా నడక, సైక్లింగ్, ఈత, జాగింగ్, నృత్యం, కండరాల బలవర్ధక వ్యాయామాలు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి.

### ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి..

40 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్నవారు లేదా గుండె సంబంధిత ప్రమాద కారకాలు ఉన్నవారు తీవ్రమైన వ్యాయామ కార్యక్రమాలు ప్రారంభించే ముందు ఆరోగ్య పరీక్ష చేయించుకోవడం మంచిది. ముఖ్యంగా వ్యాయామం చేస్తున్నప్పుడు ఛాతినొప్పి, కారణం లేకుండా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తల తిరగడం లేదా మూర్ఛ, గుండె వేగంగా కొట్టుకోవడం, అసాధారణ అలసట వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. తీవ్రమైన వ్యాయామం వల్ల స్ట్రోక్ ప్రమాదం చాలా అరుదైన సందర్భాల్లో మాత్రమే కనిపిస్తుంది. ముఖ్యంగా ఇప్పటికే గుండె లేదా రక్తనాళాల సమస్యలు ఉన్నవారిలో ఈ అవకాశం ఉంటుంది. కాబట్టి వ్యాయామ తీవ్రతను క్రమంగా పెంచడం, శరీరానికి తగినంత నీరు అందించడం, ఆరోగ్య సమస్యలు ఉంటే ముందుగా పరీక్షలు చేయించుకోవడం వంటి జాగ్రత్తలు పాటిస్తే వ్యాయామం సురక్షితంగానే కాకుండా ఆరోగ్యానికి అత్యంత ప్రయోజనకరంగా ఉంటుంది.

## హైపోథెర్మియా.. శరీర ఉష్ణోగ్రత తగ్గితే ప్రాణాపాయం!

హైపోథెర్మియా అనేది శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయి కంటే ప్రమాదకరంగా తగ్గిపోవడం. ఇది ఒక వైద్య అత్యవసర పరిస్థితిగా పరిగణిస్తారు. శరీరం ఉత్పత్తి చేసే వేడి కంటే ఎక్కువ వేగంగా వేడిని కోల్పోయినప్పుడు ఈ సమస్య ఏర్పడుతుంది. దీంతో శరీర ఉష్ణోగ్రత క్రమంగా తగ్గిపోతుంది. సాధారణంగా శరీర ఉష్ణోగ్రత 98.6శీఫీ (37°F) ఉంటుంది. అయితే ఇది 95°F (35°F) కంటే తక్కువకు పడిపోతే దాన్ని హైపోథెర్మియా అంటారు. ఈ పరిస్థితి గుండె, నాడీ వ్యవస్థతో పాటు ఇతర కీలక అవయవాల పనితీరుపై ప్రభావం చూపుతుంది. సరైన సమయంలో చికిత్స అందకపోతే గుండె వైఫల్యం లేదా ప్రాణాపాయం కూడా సంభవించే అవకాశం ఉంది.

### హైపోథెర్మియా అంటే ఏమిటి?

మన శరీర ఉష్ణోగ్రతను హార్మోన్లు, శరీర వ్యవస్థలు నియంత్రిస్తాయి. కానీ తీవ్రమైన చలి లేదా ఇతర కారణాల వల్ల శరీర ఉష్ణోగ్రత ఒక్కసారిగా సాధారణ స్థాయి కంటే తగ్గిపోతే దానిని హైపోథెర్మియా అంటారు. ఇది ముఖ్యంగా వర్షాకాలం, చలికాలంలో ఎక్కువగా కనిపిస్తుంది.

హైపోథెర్మియా లక్షణాలు: నిరంతరం వణకడం, తీవ్రమైన అలసట, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, మాటలు స్పష్టంగా చెప్పలేకపోవడం, అయోమయం లేదా మానసిక గందరగోళం, చేతులు, కాళ్లలో తిమ్మిరి, నిద్రమత్తు లేదా స్పృహ తగ్గడం

### ఎవరికీ ఎక్కువ ప్రమాదం?

హైపోథెర్మియా ఎవరికైనా రావచ్చు. అయితే ఈ కింది వర్గాల వారికి ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. వృద్ధులు, నవజాత శిశువులు, హార్మోన్ల అసమతుల్యత ఉన్నవారు, యాంటీ డిప్రెసెంట్ లేదా యాంటీ సైకోటిక్ మందులు తీసుకునేవారు, ఎక్కువసేపు చల్లని వాతావరణంలో ఉండేవారు.

### హైపోథెర్మియా వచ్చినప్పుడు ఏమి చేయాలి?

బాధితుడిని వెంటనే వెచ్చని ప్రదేశానికి తరలించాలి. తడి బట్టలు ఉంటే తొలగించి పొడి బట్టలు వేయాలి.దుప్పట్లు కప్పి శరీరాన్ని వెచ్చగా ఉంచాలి. తల, మెడ, పాదాలను బాగా కప్పాలి. వ్యక్తి స్పృహలో ఉంటే గోరువెచ్చని నీరు లేదా సూప్ ఇవ్వవచ్చు. కెఫిన్ లేదా మద్యం ఇవ్వకూడదు. శరీరాన్ని బలంగా రుద్దకూడదు లేదా మసాజ్ చేయకూడదు. అకస్మాత్తుగా తీవ్రమైన చలి, వణుకు, అయోమయం వంటి లక్షణాలు కనిపిస్తే వాటిని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించడం చాలా ముఖ్యం.

# శరీరంలోని వేడిని తగ్గించడంలో కీరదోస, పుచ్చకాయ.. ఏది ఉత్తమంగా పనిచేస్తుంది..?



వ్యాయామం, ఆహారం ఎంత ముఖ్యమో వేసవిలో శరీరానికి తగినంత నీరు అందించడం కూడా అంతే అవసరం. ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో హీట్ స్ట్రెస్, డీహైడ్రేషన్ వంటి సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. శరీరంలోని ఉష్ణోగ్రతను సమతుల్యం చేయడంలో, వేడి ప్రభావాన్ని తగ్గించడంలో కీరదోసకాయ, పుచ్చకాయ వంటి నీటి శాతం అధికంగా ఉండే ఆహారాలు కీలక పాత్ర పోషిస్తాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే వీటిని సరైన పరిమాణంలో, సరైన సమయంలో తీసుకుంటేనే పూర్తి ప్రయోజనం పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు. హీట్ స్ట్రెస్ అంటే శరీరం తన అంతర్గత ఉష్ణోగ్రతను నియంత్రించలేని పరిస్థితి. ముఖ్యంగా తీవ్రమైన ఎండల్లో ఎక్కువసేపు గడిపినప్పుడు అలసట, తల తిరగడం, అధికంగా చెమటలు పట్టడం, నీరసం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో శరీరానికి నీరు, ఎలక్ట్రోలైట్లను అందించే ఆహారాలు తీసుకోవడం చాలా అవసరం.

### పోషకాలు అధికమే..

కీరదోసకాయలో సుమారు 95 శాతం వరకు నీరు ఉంటుంది. అందువల్ల ఇది శరీరానికి క్రమంగా నీటిని అందించడంలో సహాయపడుతుంది. అలాగే పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు ఉండటం వల్ల శరీరంలోని వేడిని తగ్గించడంతో పాటు జీర్ణక్రియను కూడా మెరుగుపరుస్తుంది. తక్కువ కేలరీలు ఉండటం వల్ల వేసవిలో రోజువారీ ఆహారంలో కీరదోసకాయను చేర్చడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. పుచ్చకాయలో 92 శాతం వరకు నీరు ఉంటుంది. ఇందులో సహజ చక్కెరలు, ఎలక్ట్రోలైట్లు, లైకోపీన్ అనే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ ఉంటాయి. ఇవి శరీరానికి త్వరగా నీటిని అందించడమే కాకుండా వేడి కారణంగా తగ్గిన శక్తిని తిరిగి అందించడంలో, ఆక్సిడేటివ్ ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి. అయితే పుచ్చకాయను భోజనం చేసిన వెంటనే తినకూడదని, పరిమిత మోతాదులో మాత్రమే తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

### ప్రయోజనాలు కాస్త భిన్నం..

కీరదోసకాయ, పుచ్చకాయ రెండూ శరీరాన్ని చల్లబరచడంలో ఉపయోగపడినా వాటి ప్రయోజనాలు కొంత భిన్నంగా ఉంటాయి. కీరదోసకాయలో నీటి శాతం ఎక్కువగా ఉండి శరీరానికి నెమ్మదిగా హైడ్రేషన్ అందిస్తుంది. పుచ్చకాయ మాత్రం సహజ చక్కెరల కారణంగా త్వరగా శక్తిని, నీటిని అందిస్తుంది. అలాగే పుచ్చకాయలో ఎలక్ట్రోలైట్లు కొంత ఎక్కువగా ఉండగా, కీరదోసకాయ తక్కువ కేలరీలతో ఎక్కువసేపు చల్లదనాన్ని అందిస్తుంది. హీట్ స్ట్రెస్‌ను తగ్గించడంలో ఏది మంచిదన్నది వ్యక్తిగత అవసరాలపై ఆధారపడి ఉంటుంది. శరీరానికి దీర్ఘకాలం చల్లదనం, తక్కువ కేలరీలతో హైడ్రేషన్ కావాలనుకునేవారికి కీరదోసకాయ మంచి ఎంపిక. త్వరగా నీరు, శక్తి అందించాలంటే పుచ్చకాయ ఉపయోగపడుతుంది. రెండింటినీ సమతుల్యంగా తీసుకోవడం వల్ల మరింత ప్రయోజనం ఉంటుంది.

### ఎలా తీసుకోవాలి..

వేసవిలో కీరదోసకాయను సలాడ్ రూపంలో లేదా నీటిలో ముక్కలు వేసి ఇన్‌ఫ్యూజ్డ్ వాటర్‌గా తీసుకోవచ్చు. పుచ్చకాయను మధ్యాహ్నం సమయంలో చిరుతిండిగా తినడం మంచిది. ప్యాకెట్ జ్యూస్‌లకు బదులుగా తాజా పండ్లనే తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అయితే ప్రతి ఒక్కరూ వీటిని ఒకే విధంగా తీసుకోవడం సరైంది కాదు. మధుమేహం ఉన్నవారు పుచ్చకాయను పరిమిత మోతాదులో మాత్రమే తీసుకోవాలి. అలాగే మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు పొటాషియం మోతాదును దృష్టిలో పెట్టుకుని పుచ్చకాయ వినియోగాన్ని నియంత్రించాలి. ఇక వేసవిలో హీట్ స్ట్రెస్ నుంచి రక్షణ పొందాలంటే కీరదోసకాయ, పుచ్చకాయ రెండింటినీ సమతుల్యంగా ఆహారంలో చేర్చడం మంచిది. వీటితోపాటు తగినంత నీరు తాగడం, ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో బయట తిరగకుండా ఉండటం, శరీరానికి అవసరమైన హైడ్రేషన్‌ను కాపాడుకోవడం ద్వారా వేసవి ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు.

# మెదడు క్యాన్సర్ చికిత్సకు ఎంతో దోహదం చేస్తున్న విటమిన్ బి3.. సైంటిస్టుల అధ్యయనం..




వ్యాధుల చికిత్సలో కొత్త మార్గాలను అన్వేషిస్తున్న శాస్త్రవేత్తలు తాజాగా విటమిన్ బి3 (నియాసిన్)పై ఆశాజనక పరిశోధనలు చేస్తున్నారు. ముఖ్యంగా మెదడు క్యాన్సర్‌లో అత్యంత ప్రమాదకరమైన గ్లియోబ్లాస్టోమా చికిత్సలో ఇది రోగనిరోధక వ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తుందని ప్రారంభ అధ్యయనాలు సూచిస్తున్నాయి. అయితే ఇది ఇంకా ప్రయోగాత్మక దశలోనే ఉందని, వైద్యుల పర్యవేక్షణ లేకుండా అధిక మోతాదులో విటమిన్ బి3 సప్లిమెంట్లు తీసుకోవద్దని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. గ్లియోబ్లాస్టోమా మెదడులోని నాడీకణాలకు మద్దతు ఇచ్చే గ్లియల్ కణాల నుంచి ప్రారంభమయ్యే అత్యంత వేగంగా వ్యాపించే క్యాన్సర్. పెద్దల్లో కనిపించే అత్యంత సాధారణ ప్రాణాంతక మెదడు కణితుల్లో ఇది ఒకటి. ప్రస్తుతం దీనికి పూర్తిస్థాయి చికిత్స అందుబాటులో లేకపోయినా, శస్త్రచికిత్స, రేడియేషన్, కీమోథెరపీ ద్వారా కణితి పెరుగుదలను నియంత్రించడానికి, లక్షణాలను తగ్గించడానికి ప్రయత్నిస్తారు.

### క్యాన్సర్ కణాలు నాశనం..

ఈ నేపథ్యంలో విటమిన్ బి3ని సాధారణ చికిత్సలతో కలిపి ఇస్తే ఫలితాలు మెరుగుపడతాయా అనే అంశంపై పరిశోధనలు కొనసాగుతున్నాయి. ప్రారంభ ఫలితాల ప్రకారం, అధిక మోతాదులో నియాసిన్ ఇవ్వడం వల్ల శరీరంలోని రోగనిరోధక కణాలు మళ్లీ చురుకుగా మారి క్యాన్సర్ కణాలను గుర్తించి వాటిపై దాడి చేసే సామర్థ్యాన్ని పెంచినట్లు గుర్తించారు. సాధారణంగా గ్లియోబ్లాస్టోమా కణితి రోగనిరోధక వ్యవస్థను బలహీనపరుస్తుంది. దీంతో శరీరంలోని రక్షణ కణాలు క్యాన్సర్ కణాలను సమర్థంగా ఎదుర్కోలేవు. అయితే నియాసిన్ ప్రభావంతో ఈ రోగనిరోధక కణాలు తిరిగి చురుకుగా మారి క్యాన్సర్ కణాలను నాశనం చేసే పనిని ప్రారంభించినట్లు పరిశోధనలో వెల్లడైంది. విటమిన్ బి3 లేదా నియాసిన్ మాంసం, చేపలు, పల్లీలు, ఇతర గింజలు, సంపూర్ణ ధాన్యాల్లో సహజంగా లభించే ముఖ్యమైన పోషక పదార్థం. ఇది ఆహారాన్ని శక్తిగా మార్చడంలో, కణాల ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

### 82 శాతం మందిలో సానుకూల ఫలితాలు..

ప్రస్తుతం కొనసాగుతున్న ఫేజ్-1, ఫేజ్-2 క్లినికల్ ట్రయల్‌లో శస్త్రచికిత్స, కీమోథెరపీ, రేడియోథెరపీతోపాటు నియంత్రిత విడుదల (కంట్రోల్డ్-రిలీజ్) నియాసిన్‌ను సురక్షితంగా ఉపయోగించవచ్చా అనే అంశాన్ని పరిశీలిస్తున్నారు. ఇప్పటివరకు చికిత్స పొందిన తొలి 24 మంది రోగుల్లో 82 శాతం మందికి ఆరు నెలల తర్వాత కూడా వ్యాధి మరింతగా పెరిగిన ఆనవాళ్లు కనిపించలేదు. గత అధ్యయనాలతో పోలిస్తే ఇది మెరుగైన ఫలితంగా పరిశోధకులు భావిస్తున్నారు. ఈ ట్రయల్‌లో ఆరు నెలల వ్యవధిలో కనీసం 20 శాతం మెరుగుదల కనిపించకపోతే అధ్యయనాన్ని నిలిపివేయాలని ముందుగానే నిర్ణయించారు. అయితే ప్రారంభ ఫలితాలు అంచనాలకు మించి ఉండటంతో, సంప్రదాయ చికిత్సలతోపాటు నియాసిన్ ఇవ్వడం వల్ల అదనపు ప్రయోజనం కలుగుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

### అధిక మోతాదులో వద్దు..

అయితే ఈ ఫలితాలను ఇప్పుడే తుది నిర్ణయంగా భావించరాదని పరిశోధకులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటివరకు చాలా తక్కువ మంది రోగులపైనే అధ్యయనం జరిగింది. మొత్తం 48 మంది రోగులతో ట్రయల్ పూర్తి చేసిన తర్వాతే స్పష్టమైన నిర్ధారణకు వచ్చే అవకాశం ఉంది. అలాగే ఈ ఫలితాలను మరింత పెద్ద స్థాయి అధ్యయనాల ద్వారా కూడా నిర్ధారించాల్సి ఉంది. అధిక మోతాదులో విటమిన్ బి3 తీసుకోవడం పూర్తిగా సురక్షితం కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎక్కువ మోతాదులో నియాసిన్ వల్ల కాలేయానికి నష్టం, జీర్ణ సంబంధిత సమస్యలు, ఇతర దుష్ప్రభావాలు వచ్చే అవకాశం ఉంటుంది. అందువల్ల వైద్యుల సలహా లేకుండా అధిక మోతాదులో విటమిన్ బి3 సప్లిమెంట్లు తీసుకోవడం ప్రమాదకరమని సూచిస్తున్నారు. ప్రస్తుతం ఈ పరిశోధనలు ఆశాజనకంగా ఉన్నప్పటికీ, గ్లియోబ్లాస్టోమా చికిత్సలో దీనిని సాధారణ వైద్య విధానంగా పరిగణించడానికి మరింత శాస్త్రీయ ఆధారాలు అవసరమని నిపుణులు పేర్కొంటున్నారు.

## వ్యాయామానికి ముందు వార్మప్ తప్పనిసరి.. ఎందుకంటే!

ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండాలంటే క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం చాలా ముఖ్యం. అయితే చాలా మంది వ్యాయామం చేసే ముందు వార్మప్ చేయడాన్ని నిర్లక్ష్యం చేస్తారు. కానీ వ్యాయామానికి ముందు శరీరాన్ని వార్మప్ చేయడం వల్ల శరీరం వ్యాయామానికి సిద్ధమవుతుంది. దీంతో వ్యాయామ ఫలితాలు మెరుగుపడతాయని నిపుణులు చెబుతున్నారు.




### వార్మప్ అంటే ఏమిటి?

వార్మప్ అనేది వ్యాయామానికి ముందు చేసే తేలికపాటి శారీరక కదలికలు లేదా స్ట్రెచింగ్ వ్యాయామాలు. సాధారణంగా 5 నుంచి 10 నిమిషాల పాటు జాగింగ్, జంపింగ్ జాక్స్, ఆర్మ్ స్వింగ్స్, స్ట్రెచింగ్ వంటి వ్యాయామాలు చేయడం ద్వారా శరీరాన్ని వ్యాయామానికి సిద్ధం చేస్తారు.

### వార్మప్ ఎందుకు చేయాలి?

ఎలా అయితే వాహనాన్ని స్టార్ట్ చేసిన వెంటనే వేగంగా నడపకుండా కొంతసేపు ఇంజిన్‌ను వేడెక్కిస్తామో, అలాగే వ్యాయామానికి ముందు కూడా శరీరాన్ని క్రమంగా సిద్ధం చేయాలి. వార్మప్ చేయడం వల్ల శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది, కండరాలకు రక్తప్రసరణ మెరుగవుతుంది. దీంతో శరీరం వ్యాయామాన్ని సులభంగా తట్టుకోగలుగుతుంది.

### వార్మప్ చేయకుండా వ్యాయామం చేస్తే ఏమవుతుంది?

వార్మప్ లేకుండా నేరుగా కఠినమైన వ్యాయామాలు చేస్తే కండరాలపై ఒక్కసారిగా ఒత్తిడి పడుతుంది. దీంతో కండరాల నొప్పులు, కండరాలు పట్టేయడం, గాయాలు అయ్యే ప్రమాదం పెరుగుతుంది. అందుకే వ్యాయామానికి ముందు తప్పనిసరిగా వార్మప్ చేయాలని ఫిట్‌నెస్ నిపుణులు సూచిస్తున్నారు.

## రాకాలో పవర్‌ఫుల్ రోల్‌లో రష్మిక

- నెగెటివ్ షేడ్‌లో ఉంటుందని ప్రచారం



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'రాకా' గురించి ప్రస్తుతం సోషల్ మీడియాలో ఒక క్రేజీ అప్‌డేట్ తెగ హల్‌చల్ చేస్తోంది. 'పుష్ప', 'పుష్ప 2' చిత్రాలతో ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసిన అల్లు అర్జున్, రష్మిక మందన్న హిట్ కాంబో ఈ సినిమాతో మరోసారి రిపీట్ కాబోతున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో బలమైన వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈసారి వీరిద్దరి కాంబినేషన్ మరింత విభిన్నంగా ఉండబోతోందని సమాచారం.ఇప్పటివరకు బన్నీతో కేవలం రొమాన్స్ చేసిన రష్మిక, ఈ సినిమాలో సరికొత్తగా నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించబోతుందని ప్రచారం సాగుతోంది. కథను పూర్తిగా మలుపు తిప్పే ఒక కీలకమైన పాత్ర కోసం దర్శకుడు అట్లీ ఆమెను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ముంబైలో జరుగుతున్న భారీ యాక్షన్ షెడ్యూల్‌లో రష్మిక కూడా జాయిన్ అయినట్లు బాలీవుడ్ వర్గాల సమాచారం. 'పుష్ప' సిరీస్ బ్లాక్‌బస్టర్ హిట్ అవ్వడంతో అల్లు అర్జున్‌కి రష్మిక ఒక 'లక్కీ చార్మ్' అని, అందుకే ఆమెను ఈ ప్రాజెక్ట్‌లోకి తీసుకున్నారని ఫ్యాన్స్ భావిస్తున్నారు. కాగా, ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె ప్రధాన నాయికగా నటిస్తుండగా, రష్మికతో పాటు మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ కూడా కీలక పాత్రలు పోషిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు బాలీవుడ్ కింగ్ ఖాన్ షారుక్ ఖాన్ కూడా ఈ సినిమాలో ఒక పవర్‌ఫుల్ క్యామియో రోల్‌లో మెరవనున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ క్రేజీ తారాగణంతో అంచనాలను పెంచేస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై చిత్ర యూనిట్ నుండి త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

## ఇరుముడి కట్టు పాట 29న విడుదల



మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా టాలెంటెడ్ డైరెక్టర్ శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న డివోషనల్ డ్రామా 'ఇరుముడి'. మైత్రీ మూవీ మేకర్స్, టి-సిరీస్ సంయుక్తంగా ప్రతిష్టాత్మ కంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన క్రేజీ అప్‌డేట్‌ను చిత్ర బృందం ప్రకటించింది. ఈ సినిమా నుంచి మొదటి పాట 'ఇరుముడి కట్టు' పాటను జూన్ 29వ తేదీన ఉదయం 11:07 గంటలకు విడుదల చేయబోతున్నట్లు ప్రకటించింది. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని ఈ ఆగస్ట్ 21న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తుండగా, సాయి కుమార్, బేబీ నక్షత్ర, విష్ణుశర్మ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాలో రవితేజ సరికొత్త డివోషనల్ లుక్‌లో కనిపించనున్నారు. ఒక తండ్రి, కూతురి మధ్య ఉండే ఎమోషనల్ బాండింగ్, అయ్యప్ప స్వామి మాల ధారణ ద్వారా ఒక వ్యక్తి జీవితంలో వచ్చే ఆధ్యాత్మిక మార్పుల చుట్టూ ఈ కథ తిరగనుంది. రవితేజ కెరీర్‌లోనే ఇదొక విభిన్నమైన చిత్రంగా నిలవబోతోంది.

## తమిళ చిత్ర పరిశ్రమలో మరో విషాదం

నటుడు, దర్శకుడు భాగ్యరాజ్ హఠాన్మరణం

తమిళ చిత్ర పరిశ్రమలో మరో విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ నటుడు, దర్శకుడు కె.భాగ్యరాజ్ (73) కన్నుమూశారు. గుండెపోటుతో శనివారం ఉదయం చెన్నైలో తుదిశ్వాస విడిచారు. తమిళ, తెలుగు భాషల్లో 75కు పైగా చిత్రాల్లో ఆయన నటించారు. 25 సినిమాలకు దర్శకత్వం వహించారు. అంతేకాదు.. సంగీత దర్శకుడిగా సింగర్‌గా కూడా ఆయన అలరించారు. చివరిగా ఆయన '35 చిన్న కథ కాదు', శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించిన 'కుబేర' చిత్రంలో సాధు పాత్రలో కనిపించారు. తమిళనాడులోని ఈరోడ్ జిల్లా వెల్లాంకోయిల్‌లో ఆయన జన్మించారు. 1981లో నటి ప్రవీణను వివాహం చేసుకున్నారు.

# మైత్రీ మూవీ మేకర్స్‌లో నవీన్ పోలిశెట్టి



టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో నవీన్ పోలిశెట్టి తన తదుపరి క్రేజీ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించేందుకు సర్వం సిద్ధం చేసుకున్నాడు. 'అనగనగా ఒక రాజు' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకోవడమే కాకుండా, వంద కోట్ల క్లబ్‌లో చేరి తన మార్కెట్ స్టామినాను నిరూపించుకున్న నవీన్.. తన కొత్త సినిమాను లైన్‌లోపెట్టాడు. అగ్ర నిర్మాణ సంస్థ అయిన మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించబోతుంది. నవీన్ పోలిశెట్టి మార్కెట్ పరిధిని దృష్టిలో ఉంచుకుని ఈ కలయికపై మైత్రీ సంస్థ చాలా నమ్మకంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన రాకముందే నవీన్ పోలిశెట్టి సోషల్ మీడియా వేదికగా చేసిన ఒక వినూత్న ప్రమోషన్ ప్రస్తుతం నెట్టింట సంచలనంగా మారింది. సినీ ఇండస్ట్రీలోని నలుగురు టాప్ కమర్షియల్ డైరెక్టర్స్ ప్రశాంత్ నీల్, సుకుమార్, లోకేష్ కనగరాజ్, మరియు రిషబ్ శెట్టిలతో కలిసి దిగిన ఒక అదిరిపోయే ఫన్నీ రీల్‌ను ఆయన షేర్ చేశాడు. ఈ దర్శకుల సినిమాల బాక్సాఫీస్ వసూళ్లను ఉద్దేశిస్తూ.. దీనిని తన కెరీర్‌లోనే అత్యంత ఖరీదైన 'రూ. 5000 కోట్ల ఫ్రేమ్' అని నవీన్ చమత్కరించాడు. ఈ వైరల్ వీడియో ద్వారా మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌లో తన తదుపరి చిత్రం రాబోతోందని నవీన్ క్లారిటీ ఇచ్చాడు. దీనికి స్పందనగా మైత్రీ మూవీ మేకర్స్ కూడా నవీన్‌ను తమ ప్రొడక్షన్ ఫ్యామిలీలోకి ఆహ్వానిస్తూ.. ఒక ఫుల్-ఆన్ ఎంటర్‌టైనర్ లోడింగ్ అవుతోందని వెల్లడించింది. అయితే ఈ సరికొత్త ప్రాజెక్ట్‌ను పూర్తి స్థాయి క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించనున్నారు. 'సైరన్' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న తమిళ దర్శకుడు ఆంటోనీ భాగ్యరాజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నట్లు సినీ వర్గాల్లో గట్టి ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం స్క్రిప్టింగ్, ప్రీ-ప్రొడక్షన్ పనులను వేగవంతం చేసిన చిత్ర బృందం, త్వరలోనే షూటింగ్‌ను ప్రారంభించి, వచ్చే ఏడాది ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి ప్లాన్ చేస్తోంది. నవీన్ పోలిశెట్టి అద్భుతమైన కామిక్ టైమింగ్, ఆంటోనీ భాగ్యరాజ్ టేకింగ్, మరియు మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణ విలువల కలయికలో రాబోతున్న ఈ చిత్రంపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి.

## భాగ్యరాజ్ భౌతిక కాయానికి సిఎం విజయ్ నివాళి

### ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలకు ఆదేశం



తమిళ సినీ పరిశ్రమలో ప్రముఖ దర్శకుడు, నటుడు, స్క్రీన్‌ప్లే రచయిత కే భాగ్యరాజ్ శనివారం చెన్నైలో గుండెపోటుతో కన్నుమూసారు. భాగ్యరాజ్ మృతి పట్ల తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్, సూపర్ స్టార్ రజనీకాంత్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన భౌతికకాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాగ్యరాజ్ భార్య పూర్ణిమ, కుమారుడు శంతనుతో పాటు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ గాఢ సానుభూతిని తెలియ జేశారు. తమిళ చిత్ర పరిశ్రమకు ఆయన చేసిన విశేష సేవలకు గుర్తింపుగా భాగ్యరాజ్ అంత్యక్రియలను ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నట్లు తమిళనాడు ప్రభుత్వం ప్రకటించింది. భాగ్యరాజ్ మరణవార్త తెలుసుకున్న పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు, అభిమా నులు భారీ సంఖ్యలో తరలివచ్చి ఆయనకు కన్నీటి వీడ్కోలు పలుకుతున్నారు.

# ఇడుపు కాయితం టైటిల్‌పై రచ్చ

- టైటిల్ మార్చేది లేదన్న దర్శకుడు బన్నీవాసు




ఒక సినిమా విడుదలైన తర్వాత అందులోని పాత్రలు, సన్నివేశాలు, సంభాషణలపై చర్చ.. వివాదాలకు దారి తీయడం ఇప్పటివరకూ చూశాం. ఇటీవల కాలంలో టైటిల్‌తోనే చర్చకు దారితీసిన మూవీ 'ఇడుపు కాయితం'. సోషల్ మీడియాలో పనిగట్టుకుని కొందరు పెట్టిన పోస్టులు వివాదానికి దారితీశాయి. సినిమా భాష, యాస, టైటిల్స్ విషయంలో రెండు వర్గాలుగా విడిపోయి.. ఒకరిపై ఒకరు ఆరోపణలు, విమర్శలకు దిగారు. ఈ క్రమంలో చిత్ర నిర్మాత బన్ని వాస్ స్పందించారు. ఇది ఒక ప్రాంతానికి పరిమితమయ్యే కథ కాదని, కథను బట్టే టైటిల్ ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం వివాదం నేపథ్యంలో టైటిల్, కథను మార్చే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఏ సినిమాకైనా కథ, దాని నేపథ్యం బట్టే టైటిల్ ఉంటుంది. దీనిపై ఇక చర్చ అనవసరం. షూటింగ్ పూర్తయి విడుదలైన తర్వాత సినిమానే మాట్లాడుతుంది. ఆంధ్రా, తెలంగాణ ఎవరైనా సరే సినిమా నచ్చితేనే చూస్తారు. నచ్చకపోతే చూడరు. నేను చేయాల్సింది సినిమాను బాగా తీయడంపై దృష్టి పెట్టడమే. ప్రస్తుతం ఈ వివాదం వల్ల సినిమాకు కొంత ఇబ్బంది కలిగిన మాట వాస్తవం. రేపు సినిమా బాగుంటే అన్నీ సర్దుకుంటాయి. ఇది ఒక ప్రాంతానికి పరిమితమయ్యే కథ కాదు. నాకు పూర్తి నమ్మకం ఉంది. దర్శకుడు వచ్చిన ప్రాంతం, చూసిన వాస్తవ సంఘటనల నుంచి రాసుకున్న కథ ఇది అన్నారు. ప్రియదర్శి, నాగదుర్గ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీకి వంశీరెడ్డి దొండపాటి దర్శకుడు. ఇడుపు కాయితం అంటే విడాకుల పత్రం.. భార్యాభర్తలు విడిపోవడానికి పెద్దల సమక్షంలో కుదుర్చుకున్న ఒప్పంద పత్రం. ఇప్పుడు దంపతులు విడిపోవాలనుకుంటే కోర్టులు చుట్టూ తిరుగుతున్నారు. కానీ, కొద్ది కాలం కిందట కలిసి బతకలేమని నిర్ణయించుకున్న దంపతులు పెద్ద మనుషుల సమక్షంలో విడిపోవడానికి ఒక ఒప్పందం చేసుకునే వారు. దీన్నే ఇడుపు కాయితం అని పిలిచేవారు. ఇప్పటికీ తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇడుపు కాయితం రాసుకొని విడిపోతున్న జంటలున్నాయి. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఎక్కువగా వినిపిస్తున్న పదాల్లో 'ఇడుపు కాయితం' ఒకటి. ప్రియదర్శి హీరోగా తెరకెక్కుతున్న కొత్త సినిమా టైటిల్‌గా ఈ పదాన్ని ప్రకటించిన తర్వాత దీనిపై పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. కొందరు ఈ పదానికి అర్థం ఏమిటని వెతుకుతుండగా, మరికొందరు దీనిపై సోషల్ మీడియాలో చర్చలు, వాదోపవాదాలు మొదలుపెట్టారు. దీంతో 'ఇడుపు కాయితం' అనే పదం ఒక్కసారిగా ట్రెండింగ్‌లోకి వచ్చింది.

## ప్రణాళికలకు తగ్గట్లు బౌలింగ్ చేయలేదు

### టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్

మిడిల్ ఓవర్లలో ప్రణాళికలకు తగ్గట్లు బౌలింగ్ చేయకపోవడం తమ పతనాన్ని శాసించిందని టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అన్నాడు. మిడిల్ ఓవర్లలో కట్టడిగా బౌలింగ్ చేసి ప్రత్యర్థిని 140 పరుగులకు కట్టడి చేసి ఉంటే లక్ష్యాన్ని ఛేదించడం సులువయ్యేదని తెలిపాడు.రెండు టీ20ల సిరీస్‌లో భాగంగా ఐర్లాండ్‌తో శుక్రవారం జరిగిన తొలి మ్యాచ్‌లో సమష్టిగా విఫలమైన భారత్ 34 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలైంది. ఈ మ్యాచ్ అనంతరం మాట్లాడిన శ్రేయస్ అయ్యర్..బ్యాటింగ్ కంటే బౌలింగ్ వైఫల్యమే తమ ఓటమికి ప్రధాన కారణమని చెప్పుకొచ్చాడు. గ్రౌండ్‌కు తగ్గట్లు బౌలింగ్ చేయాలేకపోయామని తెలిపాడు.'ఆరంభంలో మా బౌలర్లు చాలా బాగా బౌలింగ్ చేశారు. వారికి పిచ్ నుంచి స్వింగ్ లభించింది. రెండు వికెట్లు కూడా తీశారు. దాంతో మాకు అద్భుతమైన ఆరంభం దక్కింది. కానీ మిడిల్ ఓవర్లలో మా ప్రణాళికలను సరిగ్గా అమలు చేయలేకపోయాం. ఈ గ్రౌండ్ బౌండరీలు చాలా చిన్నవని తెలిసినప్పటికీ, స్ట్రెయిట్ షాట్లు ఆడేలా బంతులు వేసాం. డెత్ ఓవర్లలో మా బౌలర్లు తిరిగి పుంజుకున్నారు. మాకు లభించిన ఆరంభాన్ని బట్టి చూస్తే.. ఐర్లాండ్‌ను 140 పరుగులకు కట్టడి చేసి ఉంటే ఛేజ్ చేయడానికి సులువయ్యేది. ఫలితం ఎలా ఉన్నప్పటికీ.. ఇక్కడ ఆడటం ఒక గొప్ప అనుభవం. ఈ వాతావరణ పరిస్థితుల్లో ఆడే అవకాశం మాకు దక్కింది. పిచ్ ఎలా ఉందనే దానిపై ఒక స్పష్టమైన అవగాహన వచ్చింది. కెప్టెన్‌గా నాకైతే ఇది మంచి అనుభవమే. సుదీర్ఘ విరామం తర్వాత ఆడటం వల్ల కూడా మా జట్టు కాస్త తడబడింది. ఈ మ్యాచ్ ఫలితాన్ని వీలైనంత త్వరగా మర్చిపోయి.. తదుపరి మ్యాచ్ కోసం సిద్ధమవుతాం. అయితే ఈ ఓటమి నుంచి మేం నేర్చుకోవాల్సింది చాలా ఉంది. తదుపరి మ్యాచ్‌లో సరికొత్త ఉత్సాహం,రెట్టింపు బలంతో బరిలోకి దిగుతాం.హర్షిత్ రాణా , శివమ్ దూబే అద్భుతంగా బౌలింగ్ చేశారు. పిచ్ నుంచి వారికి సహకారం లభించింది. శివం విషయానికి వస్తే.. అతను గతంలోనూ చాలా కీలకమైన ఓవర్లు వేశాడు. అందువల్ల నేను అతన్ని ఎల్లప్పుడూ సపోర్ట్ చేస్తాను. నేను దేశవాళీ క్రికెట్‌లోనూ అతనితో కలిసి ఆడాను కాబట్టి అతని బలాలు, బలహీనతలు నాకు బాగా తెలుసు. అలాగే హర్షిత్ రాణా అద్భుతంగా బౌలింగ్ చేశాడు. గాయం నుంచి కోలుకుని వచ్చి.. ఈ స్థాయిలో రాణించడం చాలా గొప్ప విషయం.క్రికెట్‌లో ఈ విషయాన్ని అంత తేలికగా తీసుకోలేం. మైదానంలోకి అడుగుపెట్టగానే మ్యాచ్‌లు గెలవడం సాధ్యం కాదు. ఇక్కడ కష్టపడాలి, ఆ క్షణంలో ఆటపైనే దృష్టి పెట్టాలి. నేను ఇంతకు ముందు చెప్పినట్లుగా.. ఎప్పుడూ ప్రస్తుతంలోనే జీవించాలి. ప్రత్యర్థిని దెబ్బతీసే అవకాశం వచ్చినప్పుడు, దాన్ని ఖచ్చితంగా ఉపయోగించుకోవాలి.

## సరికొత్త చరిత్ర సృష్టించిన కేప్ వెర్దే



2026 ఫిఫా ప్రపంచ కప్‌లో కేప్ వెర్దే సరికొత్త చరిత్ర సృష్టించింది. గ్రూప్ హెచ్ నుంచి ఈ జట్టు నాకౌట్ దశకు అర్హత సాధించింది. ఇప్పటిదాకా మూడు మ్యాచ్?లు ఆడిన కేప్ వెర్దే ఒక్క మ్యాచ్?లోనూ ఓటమి లేకుండా అన్నీ డ్రా చేసుకుంది. ఫలితంగా మూడు పాయింట్లతో ఈ గ్రూప్ నుంచి నాకౌట్?కు దూసుకెళ్లింది. ఈ క్రమంలో ఫిఫా ప్రపంచ కప్‌లో నాకౌట్ దశకు అర్హత సాధించిన అత్యంత చిన్న దేశంగా కేప్ వెర్దే రికార్డు కొట్టింది. ఈ దేశ జనాభా 5 నుంచి 5.50 లక్షల మధ్యే కావడం గమనార్హం! ఈ ఫిఫా వరల్డ్?కప్?లో ఆడడం కేప్ వెర్దెకు ఇదే తొలిసారి కావడం విశేషం. ఫిఫాలో తొలిసారే ఆడుతున్న ఆ జట్టు అద్భుత ప్రదర్శన కనబరుస్తుంది. గ్రూప్ హెచ్ లో స్పెయిన్, ఉరుగ్వే, సౌది అరేబియా జట్లతో పాటు కేప్ వెర్దే ఉంది. ఇప్పటికే స్పెయిన్, ఉరుగ్వే లాంటి బలమైన జట్లను నిలువరించిన వెర్దే తాజాగా సౌది అరేబియాతో మ్యాచ్?ను కూడా డ్రా చేసుకుంది. దీంతో ఆడిన మూడు మ్యాచ్?ల్లో మూడు డ్రాలతో పట్టికలో (3 పాయింట్లు) రెండో స్థానం సొంతం చేసుకుంది. అలాగే ఒక్క మ్యాచ్?లో కూడా విజయం సాధించకుండానే నాకౌట్?కు చేరిన జట్టుగానూ కేప్ వెర్దే అరుదైన ఘనత సాధించింది. ఇలాంటి సందర్భాలు ఫిఫా చరిత్రలో చాలా అరుదుగా నమోదు అయ్యాయి. 1958లో వేల్స్, 1990లో ఐర్లాండ్, నెదర్లాండ్స్ అలాగే 1998లో చిలీ జట్లు 3 పాయింట్లతో నాకౌట్ దశకు చేరుకున్నాయి. ఇక 2010లోనూ ఇలాంటి సందర్భం జరిగినా, అప్పుడు న్యూజిలాండ్ నాకౌట్?కు వెళ్లలేదు. ఆ సీజన్‌లో న్యూజిలాండ్ 3 మ్యాచ్‌లను డ్రా చేసుకున్నప్పటికీ నాకౌట్ దశకు చేరుకోలేకపోయింది. ఈ గ్రూప్‌లో స్పెయిన్ టాప్‌లో నిలిచింది. మూడు మ్యాచ్?ల్లో రెండు విజయాలు, ఒక డ్రాతో ఏడు పాయింట్లు సాధించింది. దీంతో నాకౌట్?కు దూసుకెళ్లింది. ఆ తర్వాత స్థానంలో ఉన్న కేప్ వెర్దే కూడా రౌండ్ 32కు క్వాలిఫై అయ్యింది. దీంతో ఈ గ్రూప్ నుంచి స్పెయిన్, వెర్దే జట్లు నాకౌట్‌కు వెళ్లగా, ఉరుగ్వే, సౌది అరేబియా ఇంటిబాట పట్టాయి. గ్రూప్ దశలో సంచలనాలు సృష్టించిన కేప్ వెర్దేపై ఇప్పుడు అందరి దృష్టి పడింది. ఆ జట్టు నాకౌట్‌లో అర్జెంటీనాతో తలపడనుంది. గ్రూప్ దశలో స్పెయిన్?ను నిలువరించిన వెర్దే నాకౌట్లో అర్జెంటినా విజయాన్ని అడ్డుకుంటే మాత్రం చరిత్ర సృష్టించినట్లే అవుతుంది!

## రెండో మ్యాచ్‌కు టీమిండియాలో 3 కీలక మార్పులు



తొలి టీ20 మ్యాచ్‌లో పసికూన ఐర్లాండ్ చేతిలో తగిలిన ఘోర పరాజ యం తర్వాత భారత క్రికెట్ జట్టు యాజమాన్యం అప్రమత్తమైంది. సిరీస్ ఆశలు సజీవంగా ఉంచుకోవాలంటే రెండో మ్యాచ్‌లో ఖచ్చితంగా గెలవాల్సిన పరిస్థితి రావడంతో, కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ తుది జట్టులో మూడు కీలక మార్పులు చేయడానికి సిద్ధమైనట్లు విశ్వసనీయ సమాచారం అందుతోంది. మొదటి పోరులో ప్రపంచ ఛాంపియన్ హోదాకు ఏమాత్రం తగని రీతిలో టీమిండియా ఓటమి పాలవ్వడం అభిమానులతో పాటు మాజీ ఆటగాళ్లను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. బౌలింగ్ విభాగంలో క్రమశిక్షణ లోపించడం, బ్యాటింగ్‌లో చేతులెత్తేయడం జట్టు పతనానికి దారితీశాయి. ఈ నేపథ్యంలోనే తప్పులను సరిదిద్దుకుంటూ శనివారం జరగబోయే రెండో పోరు కోసం భారత్ సరికొత్త వ్యూహాలతో బరిలోకి దిగుతోంది. ఇందులో భాగంగానే ఫామ్‌లో లేని ఆటగాళ్లను పక్కనబెట్టి, యువ రక్తాన్ని మైదానంలోకి దించాలని మేనేజ్‌మెంట్ గట్టి నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. తొలి మ్యాచ్‌లో ఘోరంగా విఫలమై, ప్రపంచ రికార్డు స్థాయిలో పరుగులు సమర్పించుకున్న పేసర్ ప్రసిద్ధ్ కృష్ణపై వేటు పడటం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. నాలుగు ఓవర్లలో ఒక్క వికెట్ కూడా తీయకుండా 57 పరుగులు ఇచ్చిన ప్రసిద్ధ్ స్థానంలో బెంచ్‌కే పరిమితమైన మరో ప్రతిభావంతుడైన యువ ఫాస్ట్ బౌలర్‌ను జట్టులోకి తీసుకోనున్నారు. డెత్ ఓవర్లలో (చివరి ఓవర్లలో) పరుగులు నియంత్రించడమే లక్ష్యంగా ఈ మార్పు జరుగుతోంది. గత మ్యాచ్‌లో కేవలం ఒక్క ఓవర్ వేసి 19 పరుగులు ఇచ్చుకోవడమే కాకుండా, బ్యాటింగ్‌లోనూ దారుణంగా విఫలమైన వాషింగ్టన్ సుందర్ స్థానాన్ని కూడా మార్చాలని యాజమాన్యం భావిస్తోంది. స్పిన్ విభాగంతో పాటు బ్యాటింగ్‌లో లోతును పెంచేందుకు మరో సమర్థుడైన ఆల్‌రౌండర్‌ను తుది జట్టులోకి తీసుకురానున్నారు. మిడిల్ ఓవర్లలో ప్రత్యర్థి పరుగుల వేగానికి అడ్డుకట్ట వేయడం ఈ మార్పు వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. మొదటి మ్యాచ్ ముగిసినప్పటి నుంచి సోషల్ మీడియాలో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీని జట్టులోకి తీసుకోవాలనే డిమాండ్ గట్టిగా వినిపిస్తోంది. భారత బ్యాటింగ్ ఆర్డర్‌ను బలోపేతం చేసేందుకు, అలాగే పవర్‌ప్లేలో వేగంగా పరుగులు రాబట్టేందుకు అతడిని తుది జట్టులోకి తీసుకునే అవకాశాలను కెప్టెన్ పరిశీలిస్తున్నాడు. ఒకవేళ ఇతనికి అవకాశం దక్కితే భారత ఇన్నింగ్స్ మరింత దూకుడుగా మారే అవకాశం ఉంది.

# పాండ్యా సీక్రెట్ మ్యారేజ్?



స్టార్ క్రికెటర్ హార్దిక్ పాండ్యా తన గర్ల్‌ఫ్రెండ్, ప్రముఖ మోడల్ మహికా శర్మను రహస్యంగా పెళ్లాడాడా? అంటే అవుననే అంటున్నాయి సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న సరికొత్త ఫోటోలు. వీరిద్దరూ సీక్రెట్‌గా వివాహం చేసుకున్నారంటూ నెట్టింట పెద్ద ఎత్తున ఊహాగానాలు మొదలయ్యాయి. హార్దిక్, మహికా ఇద్దరూ ఒక వృద్ధురాలితో కలిసి దిగిన ఫోటో ఆన్‌లైన్‌లోకి రావడంతో ఈ రూమర్లు ఒక్కసారిగా ఊపందుకున్నాయి. వైరల్ అవుతున్న ఆ ఫోటోను నిశితంగా గమనించిన నెటిజన్లు ఒక ఆసక్తికరమైన విషయాన్ని కనిపెట్టారు. హార్దిక్ పాండ్యాతో కలిసి ఫోటోకు పోజులిచ్చిన మహికా శర్మ నుదుటిపై 'సింధూరం' ధరించి ఉండటం అందరి దృష్టిని ఆకర్షించింది. అంతేకాకుండా, ఆ ఫోటోలో ఉన్న వృద్ధురాలు ఈ జంట చేతులను పట్టుకుని ఆశీర్వదిస్తున్నట్లుగా ఉంది. దీంతో, వీరిద్దరూ అత్యంత సన్నిహితుల మధ్య ఒక ప్రైవేట్ వేడుకలో పెళ్లి బంధంతో ఒకటయ్యారని, ఆ తర్వాతే ఈ ఫోటో దిగారని సోషల్ మీడియాలో చాలా మంది బలంగా నమ్ముతున్నారు. ఈ పెళ్లి వార్తలపై హార్దిక్ లేదా మహికా నుండి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. అయినప్పటికీ, వీరిద్దరి ఫోటోలు సోషల్ మీడియాలో విపరీతంగా షేర్ అవుతున్నాయి. కొంతకాలంగా డేటింగ్‌లో ఉన్న ఈ జంట, ఇప్పుడు తమ బంధాన్ని తదుపరి దశకు తీసుకెళ్లి జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించారని అభిమానులు ఫిక్స్ అయిపోతున్నారు. తన మాజీ భార్య నటాషా స్టాన్‌కోవిచ్‌తో విడిపోయిన రెండేళ్ల తర్వాత.. హార్దిక్ పాండ్యా తన జీవితంలోకి వచ్చిన కొత్త మహిళగా మోడల్ మహికా శర్మను ప్రపంచానికి పరిచయం చేశాడు. గతేడాది (2025) అక్టోబర్ 10న, హార్దిక్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో మహికాతో కలిసి బీచ్‌లో దిగిన ఒక ఫోటోను షేర్ చేశాడు. ఆ ఫోటోలో వీరిద్దరూ సముద్రతీరంలో ఎంతో ప్రశాంతంగా, సంతోషంగా కనిపించారు. హార్దిక్ ఓవర్‌సైజ్డ్ జాకెట్, షార్ట్స్ ధరించి మహికా భుజంపై చేయి వేయగా.. తెల్లటి షర్ట్ డ్రెస్‌లో ఉన్న మహికా కెమెరాకు దూరంగా చూస్తూ ఉంది. ఈ ఫోటోకు మహికా ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌ను ట్యాగ్ చేయడం ద్వారా హార్దిక్ తమ బంధాన్ని అధికారికంగా ప్రకటించాడు. అప్పట్లోనే ఈ జంట కెమిస్ట్రీ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. హార్దిక్ పాండ్యా కంటే ఏడేళ్లు చిన్నదైన మహికా శర్మ.. భారత ఫ్యాషన్ రంగంలో ఎంతో గుర్తింపు తెచ్చుకున్న మోడల్. ఆమె 'టాప్ మేగజైన్‌ల కవర్ పేజీలపై మెరిసింది. అంతేకాకుండా, ప్రతిష్టాత్మక 'ఇండియన్ ఫ్యాషన్ అవార్డ్స్'లో 'మోడల్ ఆఫ్ ది ఇయర్' అవార్డును కూడా సొంతం చేసుకుంది. తనీష్క్ , వివో , యునిక్లో వంటి ప్రముఖ బ్రాండ్ల యాడ్స్‌లో నటించిన మహికా.. తరుణ్ తహిలియాని, మనీష్ మల్హోత్రా, అనితా డోంగ్రే వంటి టాప్ డిజైనర్లు రూపొందించిన దుస్తులలో ఫ్యాషన్ షోలలో తరచూ సందడి చేస్తుంటుంది. మరి ఈ పెళ్లి రూమర్లపై హార్దిక్ పాండ్యా ఎలా స్పందిస్తాడో చూడాలి!



# 2027 వరల్డ్ కప్‌కు రోహిత్ శర్మ వద్దు!

**మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్**



టీమ్ఇండియా వన్డే జట్టులో మార్పులు చేర్పులపై ఎప్పుడూ ఏదో ఒక కాంట్రవర్సీ నడుస్తూనే ఉంటుంది. వచ్చే నెలలో ఇంగ్లాండ్‌తో జరగనున్న వన్డే సిరీస్ కోసం సెలక్టర్లు జట్టును ప్రకటించారు. ఈ జట్టులో సీనియర్ ఆటగాడు రోహిత్ శర్మకు చోటు దక్కడంతో రాబోయే 2027 వన్డే వరల్డ్ కప్ ప్రణాళి కలపై అప్పుడే ఒక టాక్ మొదలైంది. మరో ఏడాదిన్నరలో జరగనున్న ఈ మెగా టోర్నీ సమయానికి రోహిత్ ఫామ్ అలాగే ఫిట్‌నెస్ ఎలా ఉంటాయనే దానిపై రకరకాల కామెంట్స్ వినిపిస్తున్నాయి. యశస్వీ జైస్వాల్ లాంటి యువ ఆటగాళ్లు గట్టి పోటీ ఇస్తున్న టైమ్‌లో రోహిత్‌ను కొన సాగిస్తారా? లేదా అన్నది అసలు ప్రశ్న. ఇదే విషయంపై మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ చేసిన కామెంట్స్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఒక స్పోర్ట్స్ ఛానెల్‌లో జరిగిన చర్చలో '2027 వరల్డ్ కప్‌లో రోహిత్ శర్మ ఆడే ఛాన్స్ ఉందా?' అని యాంకర్ అడిగిన ప్రశ్నకు మంజ్రేకర్ చాలా ఓపెన్‌గా సమాధానం ఇచ్చారు. తాను చెప్పే మాటలు వివాదాస్పదం అవుతాయని తనకు తెలుసని, కానీ తాను ఎవరి గురించీ పట్టించుకోనని ఆయన అన్నారు. మనం ఇప్పుడు 2026 మధ్యలో ఉన్నామని, కానీ ఆ వరల్డ్ కప్ 2027 చివర్లో జరుగుతుందని గుర్తుచేశారు. ఆ సమయానికి ఇండియన్ టీమ్ దగ్గర చాలా ఆప్షన్స్ ఉంటాయని విరాట్ కోహ్లీ తన ఫిట్‌నెస్‌తో గట్టి పోటీ ఇస్తున్నాడని వివరించారు. జట్టును ఎంపిక చేసేటప్పుడు కేవలం రోహిత్ శర్మ విరాట్ కోహ్లీ లాంటి సీనియర్ల గురించే ఆలోచించడం కరెక్ట్ కాదని మంజ్రేకర్ అభిప్రాయపడ్డారు. 'ఇండియన్ క్రికెట్ భవిష్యత్తుకు ఏది మంచిది?' అనే కోణంలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా 50 ఓవర్ల ఫార్మాట్‌లో ఓపెనింగ్ చేయడం అనేది జట్టులో స్ఫూర్తినిచ్చే ప్రోగ్రామ్ లాగా చూడాలని ఆయన చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలో రోహిత్ శర్మ గురించి మాత్రమే ఆలోచించడం సరైన పద్ధతి కాదని ఆయన చాలా క్లియర్‌గా చెప్పారు. వన్డే ఫార్మాట్‌లో ఓపెనింగ్ చేసే అవకాశాన్ని ఫామ్‌లో ఉన్న కుర్రాళ్లకు ఇవ్వా లని మంజ్రేకర్ అన్నారు. కనీసం మరో 5 నుంచి 10 ఏళ్ల పాటు కెరీర్ ఉన్న యువ ఆటగాళ్లను ఓపెనర్లుగా ఎంకరేజ్ చేస్తే జట్టుకు ఎంతో లాభం చేకూరుతుందని వివరించారు. ఈ లెక్కలన్నీ పరిగణనలోకి తీసుకుంటే 2027 వరల్డ్ కప్ స్క్వాడ్‌లో తన ఛాయిస్ రోహిత్ శర్మ కానేకాదని మంజ్రేకర్ చాలా క్లారిటీగా తన అభిప్రాయాన్ని బయటపెట్టారు. జట్టు ప్రయోజనాల దృష్ట్యా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకునే తాను ఈ మాటలు చెబుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఇంగ్లాండ్‌తో జరగనున్న ఈ వన్డే సిరీస్ కోసం బీసీసీఐ ఇప్పటికే జట్టును ప్రకటించింది. గాయం కారణంగా అఫ్గానిస్థాన్ సిరీస్‌కు దూరమైన స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మళ్లీ జట్టులోకి వచ్చాడు. రోహిత్ శర్మ విరాట్ కోహ్లీలతో పాటు స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా కూడా జట్టులో చేరాడు. బుమ్రా నేతృత్వంలోని పేస్ విభాగంలో అర్షదీప్ సింగ్ ప్రసిద్ధ్ కృష్ణ హర్షిత్ రాణా గుర్నూర్ బ్రార్ లాంటి యువ బౌలర్లు ఉన్నారు. అలాగే స్పిన్ డిపార్ట్‌మెంట్‌ను కుల్దీప్ యాదవ్ అక్షర్ పటేల్ వాషింగ్టన్ సుందర్ చూసుకోనున్నారు. వికెట్ కీపర్లుగా కేఎల్ రాహుల్ ఇషాన్ కిషన్ ఎంపికయ్యారు. సెలక్టర్లు ప్రకటించిన ఈ వన్డే జట్టులో సీనియర్లు కుర్రాళ్ల కాంబినేషన్ చాలా బాగుందని దిగ్గజ క్రికెటర్ సునీల్ గావస్కర్ ప్రశంసించారు. సీనియర్ ఆటగాళ్లతో కలిసి ఆడే అవకాశం రావడం కుర్రాళ్లకు ఎంతో కలిసి వస్తుందని ఆయన అన్నారు. రాబోయే జనరేషన్ ఆటగాళ్లు తమ టాలెంట్ నిరూపించుకోవడానికి ఈ ఇంగ్లాండ్ టూర్ ఒక అద్భుతమైన అవకాశం అని తెలిపారు. సీనియర్ ఆటగాళ్లతో కలిసి డ్రెస్సింగ్ రూమ్ పంచుకోవడం వల్ల యంగ్ ప్లేయర్లు ఎన్నో కొత్త విషయాలు నేర్చుకుంటారని గావస్కర్ చెప్పుకొచ్చారు.



# అభిషేక్ శర్మ హాఫ్ సెంచరీ రద్దు

ఐర్లాండ్ పర్యటనను టీమిండియా ఓటమితో ప్రారంభించింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా విఫలమైన భారత్ 34 పరుగుల తేడాతో ఓడి ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్న సంగతి తెలిసిందే. ఐర్లాండ్ విధించిన 183 పరుగుల లక్ష్యాన్ని టీమిండియా ఛేదించలేకపోయింది. 148 పరుగులకే కుప్పకూలి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. భారత్ జట్టులో అభిషేక్ శర్మ మినహా అంతా విఫలమయ్యారు. అయితే ఈ మ్యాచ్‌లో అభిషేక్ శర్మ హాఫ్ సెంచరీ అనూహ్యంగా రద్దయ్యింది. ఐర్లాండ్ బౌలర్ లియామ్ మెక్‌కార్తీ వేసిన 8వ ఓవర్‌లో సింగిల్ తీయడం ద్వారా అభిషేక్ శర్మ 19 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ సమయంలో అభిషేక్ శర్మ స్కోర్‌ను 50 గా చూపించడంతో అతను సెలెబ్రేట్ చేసుకున్నాడు. భారత ఆటగాళ్లు కూడా డగౌట్‌లో నిలబడి అభిషేక్‌ను అభినందించాడు. ఆ మరుసటి బంతికే డీప్ మిడ్ వికెట్‌లో బెంజమిన్ కల్లిస్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆ సమయంలోనూ స్కోర్ కార్డులో అభిషేక్ శర్మ స్కోర్‌ను 20 బంతుల్లో 50 పరుగులుగా చూపించారు. అయితే రెండో ఓవర్‌లో లెగ్ బై సవరణ కారణంగా అభిషేక్ శర్మ హాఫ్ సెంచరీ కాస్త 49 పరుగులుగా మారింది. భారత ఇన్నింగ్స్ రెండో ఓవర్‌లో ఐర్లాండ్ పేసర్ జయ్ మూంద్రా వేసిన ఆఖరి బంతి షార్ట్ ఫైన్ లెగ్ వైపు వెళ్లగా అభిషేక్ శర్మ సింగిల్ తీసాడు. ఆన్ ఫీల్డ్ అంపైర్ దానిని బ్యాట్‌కు తగిలిన పరుగుగా ప్రకటించాడు. కానీ అది లెగ్ బై అని తేలడంతో అభిషేక్ శర్మ హాఫ్ సెంచరీ నుంచి ఆ పరుగును తొలగించారు. దాంతో అతని హాఫ్ సెంచరీ కాస్త 49 పరుగులకు తగ్గింది. 183 పరుగుల లక్ష్య ఛేదనలో అభిషేక్ శర్మ ఒక్కడే ఒంటరి పోరాటం చేశాడు. సంజూ శాంసన్(5), ఇషాన్ కిషన్(1), శ్రేయస్ అయ్యర్(3) పవర్ ప్లేలోనే వెనుదిరిగినా తనదైన శైలిలో బ్యాటింగ్‌తో చెలరేగాడు. కానీ అతన్ని మెక్‌కార్తీ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చి భారత్ పతనాన్ని శాసించాడు. ఆ తర్వాత తిలక్ వర్మ(21 బంతుల్లో 3 ఫోర్లతో 19), వాషింగ్టన్ సుందర్(12 బంతుల్లో 9) విఫలమవ్వగా.. శివమ్ దూబే(25) కాస్తా పోరాడాడు. కానీ ఐర్లాండ్ బౌలర్లు అవకాశం ఇవ్వకుండా వరుసగా వికెట్లు తీసి భారత్ పతనాన్ని శాసించారు. అంతర్జాతీయ క్రికెట్‌లో భారత్‌పై ఐర్లాండ్‌కు ఇదే తొలి విజయం. 11 ప్రయత్నాల తర్వాత భారత్‌ను ఓడించి ఐర్లాండ్ సరికొత్త చరిత్ర సృష్టించింది. ఇరు జట్ల మధ్య రెండో టీ20 ఆదివారం జరగనుంది.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers,
RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609